అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 30-03-2025

సంపుటి : 11 | సంచిక : 38 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు + వెటలో (సోపతి) | వెల : 8.00





పదేండ్లు నేనే ఉంటా

కొందరికి కుర్చీ పోయిన దు:ఖం ఉండొచ్చు

- ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి
- ముస్లింలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చిందే కాంగ్రెస్
- అంబేద్కర్‌ను అవమానించేలా అమిత్‌షా వ్యాఖ్యలు : కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహాలక్ష్మి, వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి

11లో..



11లో..

ప్రజావసరాలకే లింక్ రోడ్లు

విస్తరణతోపాటు కొత్తవి నిర్మించాలి : హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో సీఎం రేవంత్

ప్రజలకు గవర్నర్, సీఎం

ఉగాది శుభాకాంక్షలు

వివరాలు 11లో..

హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదు

ఆరు గ్యారంటీలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి



- స్థానిక సమస్యలపై పోరుబాట
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రనష్టం
- ఇండ్ల నిర్మాణం చేపట్టకుంటే రామోజీ ఫిల్మ్‌సిటీని ముట్టడిస్తాం
- ఫ్యూచర్ సిటీలో బలవంతంగా భూమి లాక్కుంటే ప్రతిఘటిస్తాం
- సీసీఐ పరిశ్రమను వెంటనే తెరవాలి
- అదానీకి కట్టబెట్టే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలి
- సర్కార్ జోక్యంతోనే ఓయూ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ
- హెచ్‌సీయూలో 400 ఎకరాల వేలం పాటను ఆపాలి
- మనువాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతితో కలిసి జాన్‌వెస్లీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు 11 రోజులే జరిగాయని చెప్పారు. బడ్జెట్ కేటాయింపులపై సమగ్ర చర్చ జరగకుండానే సమావేశాలు ముగిశాయన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయని అన్నారు. వాటిని ఎలా అమలు చేస్తారో, నిధులను ఎలా కేటాయిస్తారో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించలేదని వివరించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలను కుదించారనీ, జీరో ...2లో

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి పేలిన తూటా

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. వారిపై తూటాలతో వేట ఆగటం లేదు. భద్రతా దళాలు అడవులను జల్లెడ పట్టి.. మావోయిస్టులను మట్టుబెడుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అడవుల్లో తుపాకుల మోతలే వినబడుతున్నాయి. మావోయిస్టుల ప్రాబల్యమున్న ఈ రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. భద్రతా బలగాలతో జరుగుతున్న ఎదురు కాల్పుల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవటం గమనార్హం. మావోయిస్టులకు పట్టున్న సుక్మా జిల్లాలోనూ తాజాగా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో 16 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇద్దరు జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయి. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మృతి

ఇది నక్సలిజంపై మరో దెబ్బ : అమిత్ షా



రాయ్‌పూర్ : ఇటీవలి కాలంలో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతుండగా సుక్మా పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లాపాల్ ప్రాంతంలో వారు తారసపడ్డారనీ, ఈ సందర్భంగా ఎదురు కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డులు (డీఆర్‌జీ), కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయని ఆయన చెప్పారు. 'ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇద్దరు జవాన్లకు స్వల్పంగా గాయాలయ్యాయి' అని అన్నారు.

మావోయిస్టుల ఏరివేతలో భద్రతా దళాలు సాధిస్తున్న విజయాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. "నక్సలిజంపై మరో దాడి జరిగింది. మన భద్రతా దళాలు మావోయిస్టులను మట్టు పెట్టాయి. సుక్మా ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ప్రధాని మోడీ నాయకత్వంలో 2026 మార్చి 31 లోగా నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మేము కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయుధాలు, హింసతో ఎలాంటి మార్పునూ తీసుకురాలేరనీ, కేవలం శాంతి, అభివృద్ధి మాత్రమే ...11లో

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

- లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలి
- ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు పెంచాలి : విలేకర్ల సమావేశంలో జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్ఎల్‌బీసీ, ఎస్ఆర్ఎస్‌పీ, డిండి ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేక నిలిచిపోయాయని అన్నారు. వెంటనే దీనిపై సమీక్ష నిర్వహించి నిధులు కేటాయించి ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని లిఫ్టులను ప్రాజెక్టు అంతర్భాగంలోకి తీసుకొని ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను గ్యారెంటీగా అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ధాన్యం మార్కెట్లోకి వస్తుందని, మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారుల, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా రైతుల పండించి పంటకు మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు మరో నెలరోజులపాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.



గడువు చివరి రోజుల్లో ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల ఎక్కువ మంది వినియోదారులు పన్నులు చెల్లించలేకపోయారని, అదేవిధంగా ఎల్ఆర్ఎస్ విషయంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని వాటిని తొలగించి ఫీజు రాయితీ 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అడవిదేవులపల్లిలో సత్రశాల బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లయితే వ్యవసాయం, పారిశ్రామికరంగం అభివృద్ధి చెందడంతోపాటు రెండు రాష్ట్రాలకు ప్రయోజకరంగా ఉంటుందని చెప్పారు.

అదేవిధంగా డంపింగ్ యార్డ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ముఖ్యమంత్రి దృష్టి సారించి సమీక్ష పెట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవి నాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, భవాండ్ల పాండు, లక్ష్మీనారాయణ వెంకటరెడ్డి ఉన్నారు.

మీ ఆఫీసులో సర్వర్లు ఎందుకు పెట్టుకున్నారు?


ఎంత మంది ఫోన్లను ట్యాపింగ్ చేశారు?


శ్రవణ్ రావును ఆరున్నర గంటలు విచారించిన స్పెషల్ టీం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎట్టకేలకు నిందితుడు, ఐ న్యూస్ సీఈవో శ్రవణ్ రావును జూబ్లీహిల్స్ స్పెషల్ టీం పోలీసులు శనివారం ఆరున్నర గంటలపాటు విచారించారు. ప్రధానంగా శ్రవణ్ రావుపై ఫోన్ ట్యాపింగ్ చేయడానికి గల కారణాలు, ఫోన్ ట్యాపింగ్ కోసం ఎంచుకున్న వ్యక్తులు, వీఐపీలు, దాని ద్వారా సాధించిన ఫలితాలపై దర్యాప్తు అధికారులు నిందితున్ని ప్రశ్నలతో నిగ్గదీసినట్టు తెలిసింది. అంతేగాక ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించిన సర్వర్‌ను తమ ఆఫీసులో శ్రవణ్ రావు పెట్టుకునేలా ఎవరు కోరారు? ఎవరి దిశానిర్దేశం మేరకు ఈ చట్ట వ్యతిరేక కార్యక్రమానికి పాల్పొడ్డారో అనే ప్రశ్నలు కూడా అధికారులు సంధించారు. గత ఏడాది మార్చి 10న ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగు చూసి జూబ్లిహిల్స్ స్పెషల్ టీం అధికారులు, ...2లో





అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు

వీసాలు రద్దు చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం


- క్యాంపస్ కార్యకలాపాల సాకుతో చర్యలు
- సోషల్ మీడియా పోస్టుల పైనా నిఘా...
- లైక్ కొట్టినా ఇంటికే



వాషింగ్టన్ : రాజకీయ, పర్యావరణ, ఆర్థిక, సామాజిక మార్పుల కోసం విద్యార్థులు తమ క్యాంపస్‌లలో కొన్ని కార్యక్రమాలు చేపడుతుంటారు. ప్రజాస్వామ్యం, పౌర హక్కులు వంటి అంశాలపై ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తారు. వీటిని 'క్యాంపస్ యాక్టివిజం'గా వ్యవహరిస్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడడంతో పాటు సామాజిక మాధ్యమాలలో దేశ వ్యతిరేక పోస్టులు పెడుతున్నారన్న కారణంతో అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం 'స్వీయ బహిష్కరణ' వేటు వేస్తోంది. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను లైక్ చేసిన వారిపై కూడా బహిష్కరణ పిడుగు పడుతోంది.

మాకు ఆ హక్కుంది

హమాస్, ఇతర ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తున్న విద్యార్థులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవడానికి రుబియో ఇటీవలే 'క్యాచ్ అండ్ రివోక్' అనే కృత్రిమ మేథ ఆధారిత యాప్‌ను ...11లో





కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. లేబర్ కోడ్‌లు రద్దయ్యేందుకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికవర్గాన్ని కోరారు. శనివారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సీఐటీయూ సమ్మె సన్నాహక వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలను నిలిపివేయాలని, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న చేపడుతున్న అఖిలభారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గం సాధించుకున్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మిక ద్రోహానికి పాల్పడిందన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో ప్రయివేటీకరణను మరింత వేగవంతం చేసిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను దూరం చేసిందన్నారు. ఆశాలు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మెడికల్ అండ్ హెల్త్, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, ఐకేపీ వీఓఏలు ఇతర రంగాల కార్మికులు దేశ వ్యాప్తంగా కనీస వేతనాల కోసం, ఉద్యోగ భద్రత, పెన్షన్, ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాల కోసం పోరాటాల నిర్వహిస్తుంటే.. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును దూరం చేసి 12 గంటల పని దినాన్ని చట్టబద్ధం చేసి, కార్మికులను దోచుకునేందుకు చట్టాల్లో మార్పులు చేసిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, నిర్మల్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శులు నవీన్ కుమార్, డి.వెంకటమ్మ, నక్క లక్ష్మణ్, నాయకులు ఆర్.సురేందర్, పండుగ పొచ్చన్న, దర్శనాల నగేష్, ఎ.సంతోష్, అశోక్, సంగీత పాల్గొన్నారు.

ప్యారానగర్ డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని సీఎంకు లేఖ

- ప్రజా బ్యాలెట్ ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి
- జిల్లా కలెక్టర్ గ్రామాలను సందర్శించాలి : ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె.రాజయ్య

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్, నల్లవల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల పోరాట వేదిక సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసింది. ఇటీవల నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో వచ్చిన ప్రజాభిప్రాయాన్ని గౌరవించి డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతూ 13 గ్రామాల ప్రజల తరపున రాసిన లేఖను మెయిల్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపినట్టు ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె.రాజయ్య తెలిపారు. లేఖలో పేర్కొన్న వివరాలను శనివారం ఆయన మీడియాకు వెల్లడించారు. ప్యారానగర్ డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ గుమ్మడిదల మండలంలోని 13 గ్రామాల ప్రజలు 53 రోజులుగా దీక్షలు, ధర్నాలు, ర్యాలీలు ఇతర రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్ ఎవరూ గ్రామాల్ని సందర్శించడం లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కే కీలకమైనందున డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై ప్రజా సంఘాల పోరాట వేదిక ఈనెల 22న 9 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన 'ప్రజా బ్యాలెట్' కార్యక్రమంలో 13 గ్రామాల ప్రజలు ఓటేశారన్నారు. ప్రజలు వంద శాతం డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఓట్లేసినట్టు లేఖలో పేర్కొన్నారు. 6449 మంది ఓట్లు వేయగా, ఇందులో ఒక్కరు మాత్రమే అనుకూలంగా ఓటేశారన్నారు. ప్రజలంతా ముక్తకంఠంతో డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తున్నందున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రద్దు చేస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పచ్చటి పంట పొలాలు, ఐదు వేల ఎకరాల్లో నర్సాపూర్ అడవులు, పక్కనే దుండిగల్ ఎయిర్‌పోర్ట్ అకాడమీ ఉన్నందున ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డ్ పెట్టడం ప్రమాదకరమని పర్యావరణ వేత్తలు, ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఫిర్యాదు చేసినట్టు గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ గ్రామాల్లో సందర్శించి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా నిర్ణయం తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గుమ్మడిదల ప్రజల అభిప్రాయాల్ని కూడా గౌరవించాల్సిన అవసరముందన్నారు.



దేశంలోనే మొదటిసారి సన్న బియ్యం పంపిణీ

- గౌరవెల్లి ప్రాజెక్టులో నీళ్ల నింపుతా : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి సన్న బియ్యం పంపిణీని ఉగాది నుంచి చేస్తుందని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకల పంచాంగ శ్రవణం ఉంటుందని, అందరూ పాల్గొనాలని కోరారు. గౌరవెల్లిలో నీళ్ల నింపడంతోపాటు కాలువల భూసేకరణ వేగంగా జరుగుతుందన్నారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పంపిణీకి ఇప్పటికే అన్ని చౌక ధరల దుకాణాలకు సన్న బియ్యం చేరాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కోసం పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు. హుస్నాబాద్‌లో 309 పోలింగ్ స్టేషన్‌లు, 160కి పైగా గ్రామాలు ఉన్నాయన్నారు. ఏప్రిల్ నెలలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి కొరత ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. కరీంనగర్-హుస్నాబాద్ నాలుగు లైన్ల రోడ్డుకు టెండర్ అయిందన్నారు. మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, లైబ్రరీ వచ్చినా స్థలాలు ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. హామీ ఇచ్చిన 100 రోజుల్లో శాతవాహన యూనివర్సిటీకి హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు అయిందని తెలిపారు. దీనికి మహాసముద్రం గండి వద్ద స్థల సేకరణ చేశామని, లేవలింగ్ చేస్తున్నామని చెప్పారు. 9 ఏండ్ల కిందట ఏర్పడిన అక్కన్నపేట మండల కార్యాలయ భవనానికి కోటిన్నర రూపాయలు మంజూరు అయిందన్నారు. హుస్నాబాద్ జంక్షన్‌లో ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఫిష్ మార్కెట్ దగ్గర జంక్షన్, ఎల్లమ్మ చెరువు నుంచి రామవరం వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రింగ్ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా చేస్తామన్నారు. కరీంనగర్‌లో లా కాలేజీ, హుస్నాబాద్‌కి ఇంజినీరింగ్ కాలేజీ మంజూరైనట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మార్కెట్ చైర్మెన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు, వెన్న రాజు, చిత్తారి రవీందర్, వీరన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదు



(మొదటి పేజీ తరువాయి)

అవర్‌లోనూ ప్రజా సమస్యలు ఎక్కువగా ప్రస్తావను రాలేదన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వ చర్యలున్నాయని చెప్పారు. కేటాయింపులు సరిగ్గా లేవన్నారు.

గ్యారంటీలకు గ్యారంటీ ఏదీ?

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని జాన్‌వెస్లీ గుర్తు చేశారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్నారనీ, వాటి అమలుకు విధివిధాలేవని ప్రశ్నించారు. దళితులు, గిరిజనులకు రూ.12 లక్షల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. చేవెళ్ల ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామంటూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించారని అన్నారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపుల్లేవని చెప్పారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలు 30 లక్షల మంది ఉన్నారని వివరించారు. కానీ 4.50 లక్షల మంది ఇండ్లు నిర్మిస్తామంటూ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని అన్నారు. గతేడాది కూడా ఇదే విషయాన్ని చెప్పిందనీ, కానీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. ఇదే వైఖరి కొనసాగితే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారంటీల కోసం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వానికి తగిన పద్ధతిలో ప్రజలు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే నష్టం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని జాన్‌వెస్లీ చెప్పారు. దాని అమలు కోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని సూచించారు. అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కేంద్రం నిర్ణయం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లను పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. దానివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అఖిలభారత స్థాయిలో అన్ని పార్టీలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదించాలని డిమాండ్ చేశారు. స్పష్టత రాకుంటే ఈ ప్రక్రియను వాయిదా వేయాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతుగా ఉంటామన్నారు.

ప్రజా సమస్యలపై కేంద్రీకరణ

ఈనెలలో ప్రజా సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తున్నామనీ, సర్వేలు చేస్తున్నామని జాన్‌వెస్లీ అన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తెస్తున్నామని చెప్పారు. ధర్నాలు, ఆందోళనలు చేపట్టామన్నారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. ఆ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ సమస్య కూడా ఉందన్నారు. కరెంటు సమస్య కూడా ఉందని చెప్పారు. గృహ వినియోగదారులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని అన్నారు. దాన్ని 300 యూనిట్ల వరకు పెంచాలని కోరారు. రూ.500 గ్యాస్ సిలిండర్ అందరికీ అమలు కావడం లేదని చెప్పారు. అర్హులందరికీ వర్తింపజేయాలని సూచించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చి వాటికి పట్టాలివ్వడం లేదన్నారు. వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో 700 కుటుంబాలకు ఇండ్లు నిర్మించాలి

రామోజీ ఫిల్మ్ సిటీలో 700 కుటుంబాలకు 2007లో ఇండ్ల స్థలాల నిర్మాణానికి నాటి ప్రభుత్వం పట్టాలిచ్చిందని జాన్‌వెస్లీ చెప్పారు. అక్కడ ఇండ్లు నిర్మాణం చేసుకోవడానికి అవకాశం లేకుండా రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యం చుట్టూ ప్రహరీగోడ కట్టి, గేట్లు పెట్టి, రోడ్లను ఆక్రమించి పేదలను ఆ భూముల్లోకి రానివ్వడం లేదన్నారు. పోలీసులను పెట్టి అరెస్టు చేయిస్తూ ఇబ్బంది పెడుతున్నదని అన్నారు. పట్టాలిచ్చిన 700 కుటుంబాల నిర్మాణానికి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం 360 ఎకరాల భూమిని అక్రమంగా ఆక్రమించిందని విమర్శించారు. చుట్టు పక్కల గ్రామాల్లో ఇండ్లు లేని పేదలు చాలా మంది ఉన్నారనీ, వారిని సమీకరించి పేదలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ క్రమంలో జరిగే పరిణామాలకు రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో రైతుల భూములు తీసుకోవద్దు

ఫ్యూచర్ సిటీ పేరుతో వేల ఎకరాల భూమిని రైతుల నుంచి ప్రభుత్వం తీసుకున్నదని జాన్‌వెస్లీ చెప్పారు. ఫార్మాసిటీ పేరుతో 15 వేల ఎకరాలను సేకరించిందని అన్నారు. అక్కడ రెండువేల ఎకరాల భూమికి సంబంధించి 800 మంది రైతులు భూమిని ఇవ్వబోమంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఆ రైతులకు భూమిని తిరిగి ఇవ్వాలంటూ సుప్రీం తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లను చేర్చలేదని అన్నారు. వారికి సంక్షేమ పథకాలు, రుణమాఫీ, రైతు భరోసా అమలు కావడం లేదన్నారు. ఆ భూమిని ఇతరులకు అమ్ముకునే హక్కు లేదని చెప్పారు. రైతుల భూములను బలవంతంగా తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనీ, ఇది సరైంది కాదన్నారు. సుప్రీం కోర్టు చెప్పినట్టుగా రైతుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలనీ, వారికి ఆ భూమిని అమ్ముకునే హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన ఐదువేల మందికి 120 గజాల చొప్పున ఇండ్లస్థలాలను కేటాయిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు వారికి పట్టాలివ్వలేదనీ, భూమి చూపించలేదని విమర్శించారు. వారు తక్కువ ధరకు ప్రభుత్వానికి భూములిచ్చారని చెప్పారు.

అక్కడ రూ.ఐదు కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు భూమి విలువ పెరిగిందన్నారు. కానీ ప్రభుత్వం రూ.ఎనిమిది లక్షలు, రూ.16 లక్షలు మాత్రమే వారికి ఇచ్చిందని అన్నారు. వారి ఇండ్ల నిర్మాణం కోసం భూమి చూపించాలనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ పేరుతో ఫ్యూచర్ సిటీలో రోడ్డు వేస్తున్నారని వివరించారు. రైతులతో చర్చించకుండానే బలవంతంగా భూమిని తీసుకుంటున్నారని విమర్శించారు. ఏమీ చెప్పకుండా భూమి వద్ద హద్దులను పెడుతున్నారని చెప్పారు. ఏమైనా అడిగితే పోలీసులతో బెదిరిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలిసే ఇదంతా జరుగుతున్నదని చెప్పారు. దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామనీ, రైతులకు తాము అండగా నిలబడతామని అన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదనీ, బలవంతంగా భూములను తీసుకుంటే ఉద్యమిస్తామని చెప్పారు.

సీసీఐ భూమిని అదానీకి కట్టబెట్టే కుట్ర

ఆదిలాబాద్‌లో సీసీఐ 27 ఏండ్ల మూతపడిందని జాన్‌వెస్లీ వివరించారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపిస్తే 770 ఎకరాల్లో ఉన్న సీసీఐని తెరిపిస్తామంటూ హోంమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని చెప్పారు. అక్కడ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే గెలిచారనీ, వెంటనే సీసీఐ పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల విలువైన ఆ భూమిని రూ.42 కోట్లకు అదానీకి కారుచౌకగా కట్టబెట్టే కుట్ర చేస్తున్నదని విమర్శించారు. పది వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. అదానీకి కట్టబెట్టే కుట్రను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐని తెరవాలంటూ చలో పార్లమెంటు కార్యక్రమానికి తాము మద్దతు ఇస్తున్నామని అన్నారు. ఓయూ ప్రజా ఉద్యమాలకు కేంద్రమన్నారు. అక్కడ ధర్నాలు, నినాదాలు, ఆందోళనలు చేయొద్దంటూ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారని విమర్శించారు. దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనేక భావాలపై చర్చ జరిగే కేంద్రాలుగా వర్సిటీలుండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతోనే ఆ సర్క్యులర్ వచ్చిందని విమర్శించారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమిని వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

బలమున్నచోట ఒంటరిగా పోటీ

స్థానిక సమస్యలపై వచ్చేనెలలోనూ క్యాంపెయిన్ చేపడతామని జాన్‌వెస్లీ విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఏప్రిల్ 11న పూలే, 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా మనువాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందిస్తామని అన్నారు. మనువాద భావజాలాన్ని, మత ఉద్రిక్తతలను బీజేపీ రెచ్చగొడుతున్నదని విమర్శించారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని చెప్పారు. పాస్టర్ పగడాల ప్రవీణ్‌ది హత్య, ప్రమాదమా?అనేది స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం దానిపై విచారణ జరపాలని కోరారు. హత్యలు, కులదురంహకార హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అరాచకాలు, కుల దురంహకార హత్యలను ప్రభుత్వం అరికట్టాలని అన్నారు. వచ్చేనెల రెండు నుంచి ఆరు వరకు తమిళనాడు మధురైలో సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు, భవిష్యత్ కారాచరణపై చర్చలు జరుగుతాయని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము బలంగా ఉన్నచోట ఒంటరిగా పోటీ చేస్తామన్నారు. కలిసొచ్చే వామపక్ష, లౌకిక, అభ్యుదయ శక్తులతో కలిసి పనిచేస్తామని చెప్పారు. వారితో చర్చలు జరుపుతామని అన్నారు. అయితే ప్రజా సమస్యల విషయంలో సీపీఐ కలిసి రావాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డుపై 14 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్‌కార్డులను వెంటనే ఇవ్వాలని కోరారు. ఎల్‌ఆర్‌ఎస్ గడువు ఈనెల 31తో ముగియనుందనీ, గడువును మరో రెండు నెలలపాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

మూడేండ్లలో 14 ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు

- ఖమ్మం నగరానికి రింగ్ రోడ్
- భద్రాద్రి ఆలయాభివృద్ధికి రూ.34 కోట్లు
- సన్న వడ్లకు పూర్తిస్థాయిలో బోనస్ : వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉగాది సందర్భంగా ఆదివారం ఖమ్మం జిల్లాలో నూతన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్టు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాబోయే మూడేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 14 ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఖమ్మంలోని ఐడీవోసీలో శనివారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. సింగరేణి ఆధ్వర్యంలో గతంలో నడిచే మైన్స్ కాలేజిని ఇంజినీరింగ్ కళాశాలగా మార్చామన్నారు. జియోలజి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరగా, సీఎం నిపుణులతో చర్చించి, కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు రానున్నాయన్నారు. అమరావతి-భద్రాచలం జాతీయ రహదారి పనులు పూర్తి చేసుకున్నామని, హైదరాబాద్ - ఇల్లెందు - భద్రాచలం జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. భద్రాచలం-ఏటూరు నాగారం మీదుగా మహారాష్ట్రకు కూడా జాతీయ రహదారి వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఖమ్మం నుంచి రాజమహేంద్రవరం జాతీయ రహదారి పనులు పూర్తి అవుతాయన్నారు. కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. పాండురంగాపురం నుంచి విష్ణుపురం రైల్వేలైన్ మంజూరు అయిందన్నారు. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వే లైన్ వేస్తే భద్రాచలానికి రైల్వే కనెక్టివిటి వస్తుందన్నారు. ఖమ్మం జిల్లా ప్రధాన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం కింద రూ.600 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేశామని తుమ్మల తెలిపారు. సాగునీరు ఇబ్బందులు వచ్చినా వైరా, తల్లాడ, పెనుబల్లి వెంసూర్ మండలాలతోపాటు ఎగువన పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని పంటలు కూడా కాపాడుకుంటున్నామన్నారు. కాల్వల నిర్మాణ పనుల సవరణ అంచనాలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, దీని ద్వారా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల్లో సుమారు 1. 20 లక్షల ఎకరాలు, సాగర్ కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సుమారు 80 వేల ఎకరాలకు నీళ్ల ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. భద్రాద్రి దేవాలయ అభివృద్ధికి టెంపుల్ చుట్టూ భూసేకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొదటి దశ కింద భూసేకరణకు రూ.34 కోట్లు మంజూరు చేశారన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయితే ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డుగా ఉపయోగపడుతుందని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. రైతులు నిర్భయంగా ఆయిల్ పామ్ సాగు చేయొచ్చని సూచించారు. గ్రానైట్ పరిశ్రమ మీద ఆధారపడే యువకులకు లాభం చేకూర్చేలా నిబంధనలు, మార్గదర్శకాలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పాత నేలకొండపల్లి రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 కోట్ల మంజూరు చేశారని అన్నారు. సన్నబియ్యం ధాన్యానికి బోనస్ డబ్బులు ప్రభుత్వం విడుదల చేసిందని, ఎక్కడైనా గ్యాప్ ఉండి రైతులకు రాకపోతే కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. మార్చి నెలాఖరు నాటికి రైతు భరోసా నిధులు జమ చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవేస్ మేనేజర్ దివ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మీ ఆఫీసులో సర్వర్లు ఎందుకు పెట్టుకున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

ఏసీపీ, వెంకటగిరి నేతత్వంలో కేసు నమోదయ్యే కొద్ది రోజుల ముందు శ్రవణ్ రావు లండన్‌కు వెళ్లి అటు నుంచి అమెరికాకు వెళ్లినట్టు అధికారులకు సమాచారముంది. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఆరవ నిందితునిగా ఈయన పేరు చేర్చారు. అయితే తనకు ఈ కేసుతో సంబంధం లేదనీ, తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఇటీవల శ్రవణ్ రావు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు నిరాకరించింది. తర్వాత శ్రవణ్ రావు బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆయనను అరెస్టు చేయకుండా పోలీసులకు ఆదేశాలిచ్చిన అత్యున్నత న్యాయస్థానం, మరోవైపు విచారణకు సహకరించాలని శ్రవణ్ రావును ఆదేశించింది. ఆ మేరకు కేసు నమోదైన దాదాపు ఏడాదిన్నర తర్వాత జూబ్లీహిల్స్ పోలీసుల ముందు శ్రవణ్ రావు హాజరయ్యారు. ఇంతకు ముందు ఇతన్ని అరెస్ట్ చేయడానికి రాష్ట్ర పోలీసుల తరపున సీబీఐ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు కూడా జారీ అయింది. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితునిగా పేర్కొన్న అప్పటి ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్ రావు కోసం కూడా ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీస్ జారీ కాగా మరో వైపు ప్రభాకర్ రావు సైతం తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో వేసిన పిటీషన్ విచారణలో ఉంది. ఇదిలా ఉంటే తాము దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న శ్రవణ్ రావు విచారణకు హాజరు కావడంతో అప్పటికే రూపొందించుకున్న ప్రశ్నల జాబితాతో అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం సంధించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కోసం అత్యాధునిక పరికరాలను శ్రవణ్ రావు ఎలా సేకరించారు? వాటి ద్వారా ఎంత మంది ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు? ఆ ట్యాపింగ్ చేసిన సమాచారాన్ని ఏ, ఏ పోలీసు అధికారులకు అందించారు?, అప్పటి పొలిటికల్ బాస్‌లలో ఎవరెవరికి ఈ ఫోన్ ట్యాపింగ్ సమాచారం చేరవేశారు? .. తదితర ప్రశ్నలను కూడా అధికారులు వేయగా, కొన్నింటికి సమాధానమిచ్చిన శ్రవణ్ రావు మరి కొన్నింటికీ మౌనం వహించినట్టు తెలిసింది. ఏసీపీ, వెంకటగిరి స్వీయ పర్యవేక్షణలో సాగిన ఈ విచారణతో ఈ వ్యవహారంలో అప్పటి ఐజీ ప్రభాకర్ రావు నుంచి ఏవైనా సలహాలు, సూచనలు అందుకున్నారా?, ఏ ఏ ప్రజా ప్రతినిధులను టార్గెట్ చేయాలి? అన్న సూచనలు అందుకున్నారా? అనేది కూడా అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ముఖ్యంగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో ఫోన్ ట్యాపింగ్ పరికరాలను అమర్చి ఫోన్లను ట్యాప్ చేయడంలో శ్రవణ్ రావు తీసుకున్న చర్యల గురించి కూడా అధికారులు కూలంకషంగా ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా అప్పటి బీఆర్‌ఎస్ పొలిటికల్ బాస్ లలో ఎవరు ఈ ట్యాపింగ్‌లకు ప్రోత్సాహమిచ్చారనే విషయమై శ్రవణ్ రావు నుంచి సమాచారం రాబట్టడానికి అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్టు తెలిసింది. ఈ విషయంలో కొంత సమాచారాన్ని కూడా దర్యాప్తు అధికారులు సేకరించినప్పటికీ ఆ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది. ఉదయం 11.20 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు శ్రవణ్ రావును సుదీర్ఘంగా అధికారులు విచారించాక ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. అవసరమైతే మరోసారి విచారణ కోసం పిలుస్తామని అధికారులు ఆయనకు చెప్పినట్టు తెలిసింది.

శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజినీరింగ్ కళాశాల పెట్టాలి

- ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆందోళన



నవతెలంగాణ - కరీంనగర్

శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ శనివారం కరీంనగర్‌లో ఆందోళన నిర్వహించాయి. ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు యూనివర్సిటీ వద్ద నిరసన తెలిపి, అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల నెరవేరని కలగానే మిగిలిపోతుందా అని ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణలో విద్యా హబ్‌గా ఎదుగుతున్న కరీంనగర్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రయివేటు కళాశాలల వైపు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అధిక ఫీజులు చెల్లించలేని విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగున్నరేండ్లుగా విద్యార్థి సంఘాలు పోరాడి సాధించిన ఇంజినీరింగ్ కళాశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో విద్యాభివృద్ధిపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు మొండిచేయి చూపుతోందన్నారు. ముఖ్యమంత్రి పెద్దపల్లి యువ వికాసం సభలో స్వయంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కరీంనగర్ ఎంపీ పొన్నం ప్రభాకర్ నివాసాన్ని ముట్టడించి, జిల్లా కేంద్రానికి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపల్లి అరవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారాపు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, టౌన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాము, హేమంత్, నాయకులు సురేష్, సాగర్, సందీప్, సందేశ్, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగము
జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీర్, మహబూబాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
NIT No. 10/2024-25 to 31/2024-25, తేది : 27.03.2025
ఈ దిగువ సంతకముదారుచే CRR (SCP), FDR మరియు SDF పథకము క్రింద మహబూబాబాద్ డివిజన్ నందు (22) పనులకు గాను అంచనా విలువ రూ. 190.50 లక్షలు ఆన్ లైన్ టెండర్లు రిజిస్టర్ కాంట్రాక్టర్ల నుండి పిలువబడుచున్నవి. ఇతర వివరములు http://tender.telangana.gov.in నందు ది: 04-04-2025 నుండి లభించును.
సం./- జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీర్, పిఆర్, మహబూబాబాద్
DIPR R.O.No.12402-PP/CL/ADVT/1/2024-25, Dt:29.03.2025

బహిరంగ ప్రకటన

ICICI Home Finance | రిజిస్టర్డ్ ఆఫీస్: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబయి-400051
కార్పొరేట్ ఆఫీస్: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరీ కుర్లా రోడ్, అంధేరీ ఈస్ట్, ముంబయి-400059
బ్రాంచ్ ఆఫీస్ : గ్రౌండ్ ఫ్లోర్, ఉషాకిరణ్ కాంప్లెక్స్, ఎస్.డి.రోడ్, సికింద్రాబాద్-500003

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్("ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి") నుండి పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డీఫాల్ట్ అయినారు మరియు వారి రుణాలు నాన్- పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించుబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి గతంలో తెలిసిన చిరునామాలకు నోటీసు జారీచేయబడినది. అయితే,అది వారికి చేరలేదు మరియు అందువల్ల ఇక్కడ వారికి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాం.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నెంబర్) & చిరునామా	సెక్యూర్డ్ అసెట్ యొక్క ఆస్తి చిరునామా/ స్వాధీనం చేసుకొను అసెట్	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేదీనాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఏ తేదీ
1.	గుంజి అంకమరావు (రుణగ్రహీత), కోపూరి స్వప్న (సహ-రుణగ్రహీత), 6 99 5 బిసి కాలనీ, బీబీనగర్, యాదాద్రి నల్గొండ, నల్గొండ, నల్గొండ, తెలంగాణ-508126. LHSEC00001545014 .	నెం.10/పడమర భాగం కలిగిన ఓపెన్ ప్లాట్ మొత్తం, సర్వే నెం. 452/ఎ లో, విస్తీర్ణం : 75 చ.గజాలు లేదా 62.7 చ.మీటర్లు, బ్లాక్ నెం.6, బీబీనగర్ గ్రామం మరియు జి.పి వద్ద ఉన్నది, బీబీనగర్ మండలం, యాదగిరి భోనగిరి జిల్లా,నల్గొండ, తెలంగాణ రాష్ట్రం, తెలంగాణ 508126.,సరిహద్దులు:- ఉత్తరం: 25" రోడ్, దక్షిణం: ప్లాట్ నెం.9, తూర్పు: ప్లాట్ నెం.10/తూర్పు భాగం, పడమర: 20" వెడల్పు రోడ్,	17-03-2025 Rs. 19,24,123.1/-	10-03-2025
2.	గుంజి అంకమరావు (రుణగ్రహీత), కోపూరి స్వప్న (సహ-రుణగ్రహీత), 6 99 5 బిసి కాలనీ, బీబీనగర్, యాదాద్రి నల్గొండ, నల్గొండ, నల్గొండ, తెలంగాణ-508126. LHSEC00001545015 .	నెం.10/పడమర భాగం కలిగిన ఓపెన్ ప్లాట్ మొత్తం, సర్వే నెం. 452/ఎ లో, విస్తీర్ణం : 75 చ.గజాలు లేదా 62.7 చ.మీటర్లు, బ్లాక్ నెం.6, బీబీనగర్ గ్రామం మరియు జి.పి వద్ద ఉన్నది, బీబీనగర్ మండలం, యాదగిరి భోనగిరి జిల్లా,నల్గొండ, తెలంగాణ రాష్ట్రం, తెలంగాణ 508126.,సరిహద్దులు:- ఉత్తరం: 25" రోడ్, దక్షిణం: ప్లాట్ నెం.9, తూర్పు: ప్లాట్ నెం.10/తూర్పు భాగం, పడమర: 20" వెడల్పు రోడ్,	17-03-2025 Rs. 26,291.56/-	10-03-2025

నోటీసు సరిగ్గా బట్వాడా జరుగుట కొరకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (వర్తించునట్లుగా) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల కాల వ్యవధిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.
తేది: మార్చి 30, 2025, ప్రదేశం: నల్గొండ — అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్.

ఓ సాధారణ కార్యకర్తగా ప్రారంభమై కమ్యూనిస్టు నేతలుగా శిఖరాగ్రానికి చేరిన మహనీయులు వారు. ఎన్ని విద్రోహాలు..! ఎన్నెన్ని విచ్ఛిన్నాలు..! ఈ సంక్షోభాలన్నిటా పార్టీని, వామపక్ష ప్రభుత్వాలను కాపాడుకోవడానికి మొక్కవోని ధైర్యం, ఉక్కు సంకల్పంతో వారు చూపిన నిర్మాణదక్షత అద్భుతం. పార్లమెంటరీ విలువలను కాపాడుకుంటూ, తమ ప్రభుత్వాలను ప్రజారంజకంగా నడిపించిన వారి సామర్థ్యం అమోఘం. నిర్బంధాలూ, కుట్రలు ప్రభుత్వాలను అతలాకుతలం చేస్తున్నప్పుడు.. అంతులేని సంఘర్షణకు గురవుతూ కూడా ఆత్మస్థైర్యం కోల్పోకుండా గుండెనిబ్బరంతో ప్రభుత్వాన్ని నిలబెట్టడం వారికే చెల్లింది. మిన్ను విరిగి మీద పడ్డా చలించక.. ప్రజ సంక్షేమమే పరమావధిగా పాలన అందించిన ముఖ్యమంత్రులు వారంతా. ఎక్కడా ఇసుమంతైనా అవినీతి పంకిలం అంటని నిష్కళంక నేతలు. వారి సైద్ధాంతిక నిబద్ధత ముందు, కర్తవ్యదీక్ష ముందు వ్యక్తిగత విషయాలు ఏవైనా చాలా స్వల్పమైనవని చెప్పడానికి అనేక ఉదాహరణలున్నాయి. ముఖ్యమంత్రులుగా వారు తీసుకున్న వేతనాన్ని పార్టీకి ఇచ్చి... పార్టీ ఇచ్చే అలవెన్స్‌తో సాధారణ జీవితాలు గడిపిన సామాన్యుల ముఖ్యమంత్రులు వాళ్లు. సీఎంలకు ఉండే భారీ కాన్వాయ్‌లను, విలాసవంతమైన సౌకర్యాలను వారు త్యజించారు. నిరాడంబర పాలన సాగించిన ఆదర్శనేతలు. సీపీఐ(ఎం) ముఖ్యముంత్రుల సంక్షిప్త పరిచయం..





అసామాన్య సామాన్యులీ ముఖ్యమంత్రులు

తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి

1957 ఎన్నికలలో కేరళలో కాంగ్రెస్‌ను ఓడించి తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి రాగానే భూసంస్కరణలు అమలు చేశారు. భూస్వామ్య వ్యవస్థ నడ్డివిరిచే చర్యలు చేపట్టారు. కార్మికోద్యమాలు, ప్రజాందోళనల పట్ల పోలీసులు అణచివేత విధానాలు అనుసరించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శిస్తూ ప్రజాస్వామిక సంస్కృతి తీసుకొచ్చారు. భూసంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనలు రెచ్చగొట్టిన కాంగ్రెస్ 356 అధికరణ కింద ఇఎంఎస్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది. 1967లో మళ్లీ వామపక్ష ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆయన తిరిగి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఇంచుమించు మూడేండ్లు వున్న ఆ ప్రభుత్వం అంతకు ముందు అసంపూర్ణంగా మిగిలిపోయిన ప్రజానుకూల కర్తవ్యాలు, విధానాలు పూర్తిచేసింది. 1969లో ఆ ప్రభుత్వం కాంగ్రెస్ కుట్రలతోనే మరోసారి కూల్చబడింది. ఉద్యమ నిర్మాణం, సైద్ధాంతిక నిర్దేశంతో పాటు సామాజిక సంస్కరణలు, స్థానిక సంస్థల పటిష్టత, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వుండాలని నిరంతరం తపించడమే గాక అందుకు తగు పద్ధతులను కూడా ఆయన తీసుకొచ్చారు. కేరళ మానవాభివృద్ధి సూచికల్లో ముందు నిలవడానికి ఇదో ప్రధాన కారణం.



ఎల్లలు లేని ప్రజాభిమానం

2000 సంవత్సరంలో తొలిసారి ముఖ్యమంత్రి గా పగ్గాలు చేపట్టిన బుద్ధదేవ్.. ఏకంగా 11ఏండ్లు ఆ పదవిలో ఉన్నారు. ఆయన సారథ్యంలో రెండు ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ సాంతం కమ్యూనిస్టు యోధుడిగా పేరు తెచ్చుకున్న బుద్ధదేవ్.. మితభాషి. కానీ, చేతల్లో మాత్రం ఆయన దూకుడుగా ఉండేవారు. 1977లో తొలిసారిగా కోసిపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1987లో జాదవ్‌పూర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. దీని తర్వాత జాదవ్‌పూర్ నుండి ఎన్నికల్లో విజయపరంపర కొనసాగించారు. జ్యోతిబసు హయాంలో ఉప ముఖ్యమంత్రిగా, హెూంశాఖ బాధ్యతలు సైతం నిర్వహించారు. ఐదు దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగి 18 ఏండ్లు మంత్రిగా, 11 ఏండ్లు సీఎంగా ఉన్నా ఆయనకు సొంత బంగ్లా, కారు లేదు. జ్యోతి బసు తర్వాత పశ్చిమ బెంగాల్ పాలనను అందిపుచ్చుకున్న ఆయన.. ఎంత తగ్గి జీవించాలో.. ఈ ప్రపంచానికి నేర్పించారు. సాగులో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. గూర్ఖాలాండ్ తిరుగుబాటును ఎదుర్కోవడం, దానికి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనడం ముఖ్యమంత్రిగా ఆయన సాధించిన గొప్ప విజయాలలో ఒకటి. సాంస్కృతిక రంగం, పోలీసు శాఖలలో ఆయన కృషి ప్రశంసనీయం. ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ తీసుకున్న వేతనాన్ని పార్టీకి ఇచ్చేవారు. ఆయనకు పార్టీ నుంచి అప్పట్లో 3200 రూపాయలు వేతనంగా అందుకునే వారు. ముఖ్యమంత్రిగా భారీ కాన్వాయ్‌లు ఆయన పెట్టుకునేవారు కాదు. కేవలం రెండు కార్లు, నలుగురు సిబ్బందితో ఆయన పాలనను సాగించారు. ఆయనకు రెండుగదుల ఒకే ఒక్క ఇల్లు తప్ప మరెక్కడా స్థిరచరాస్తులు లేవు. ఎల్లలు లేని ప్రజాభిమానాన్ని ఆయన సంపాదించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆయన తిరస్కరించారు.



కొత్త శకానికి నాంది

కూతుపరంబ శాసనసభ నియోజకవర్గం నుంచి 1970, 1977, 1991 మూడు సార్లు పినరయి విజయన్ విజయదుంధుబి మోగించారు. 1996లో పయ్యన్నూర్ శాసనసభ్యుడిగా గెలిచి ఇ.కె. నాయనార్ మంత్రివర్గంలో ఆయన విద్యుత్, సహకార మంత్రిగా పనిచేశారు. 2016 శాసనసభ ఎన్నికలలో గెలిచి కేరళ 12వ ముఖ్యమంత్రి అయ్యారు. 2021లో రెండో సారి ధర్మదోం నుంచి ఎన్నికై రెండోసారి ముఖ్యమంత్రిగా కేరళ సంక్షేమానికి కృషి చేస్తున్నారు. 1996 నుంచి ఎల్డీఎఫ్ ప్రభుత్వంలో విద్యుత్, సహకార మంత్రిగా పినరయి విజయన్ పదవీకాలంలో రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తిలో అసాధారణ పెరుగుదలను చూసింది. రాష్ట్రంలోని వివిధ విద్యుత్ ప్రాజెక్టుల పంపిణీ సామర్థ్యంలో గణనీయమైన మెరుగుదల సాధించింది. విద్యుత్ రంగంలో కొత్త శకానికి నాంది పలికింది. ప్రజల అవసరాలను అర్థం చేసుకున్న మంచి రాజకీయ నాయకుడిగా పరిపాలనా చతురత, అనుభవం, రాష్ట్ర సహకార రంగంలో వివిధ విప్లవాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టడంలో ఆయనకు సహాయపడింది. ఆయన 1983 నుంచి 1992 వరకు కన్నూర్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడిగా పని చేశారు. RUBCO ఏర్పాటు వెనుక కూడా పినరయి విజయన్‌ది మార్గదర్శక స్ఫూర్తి. ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ పనితీరు అద్భుతమైన విజయం సాధించింది. అచంచలమైన స్ఫూర్తితో తనను తాను స్థిరపరచుకున్నారు. వరదలు, నిఫా వ్యాప్తి, కరోనా వంటి విపత్తులు ఎదురైన అన్ని సందర్భాల్లో కీలక పరిస్థితుల్లో ఆయన అసాధారణ ధైర్యంతో ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. దానికి తోడు, కేరళ అభివృద్ధి, సామాజిక సంక్షేమంలో గణనీయమైన వృద్ధిని సాధించారు. 2021 శాసనసభ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని వామపక్ష ప్రజాస్వామ్య ఫ్రంట్ విజయానికి ఆయన ప్రభుత్వ దృఢమైన, ప్రభావవంతమైన పనితీరు ప్రధాన కారణం.

జనరంజక పాలకుడు



దేశ రాజకీయాల్లోనే విశిష్ట నేతగా గుర్తింపు పొందిన, ప్రజా సంక్షేమానికి అలు పెరగని పోరాటం చేసిన నాయకుడు కామ్రేడ్ జ్యోతిబసు. 23ఏండ్లు నిరాటంకంగా ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన మార్క్సిస్టు దిగ్గజం. ముఖ్యమంత్రిగా జ్యోతిబసు ఆధ్వర్యంలో సాగించిన లెఫ్ట్ ఫ్రంట్ పాలన బెంగాల్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చింది. కరువు రాష్ట్రంగా కునారిల్లిన పశ్చిమ బెంగాల్‌ను అన్నపూర్ణగా చేసింది. ఇది ఆయన నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆచరించిన ప్రజాసంక్షేమ పాలన ఫలితమే. బిసి రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో అజయ్ ముఖోపాధ్యాయ ప్రభుత్వంలో 1967 నుంచి 1969 వరకు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ రెండేండ్లు కౌలుదార్లు వారి భూమిని వారనుభవించారు. కార్మిక పోరాటాల్లో పోలీసుల జోక్యం లేదు.

1977 ఎన్నికల్లో జ్యోతిబసు ఆధ్వర్యంలో లెఫ్ట్‌ఫ్రంట్ విజయ దుందుభి మోగించింది. అక్కడి నుంచి 2011 వరకు అంటే 34ఏండ్ల పాటు వామపక్ష కూటమి అధికారంలో కొనసాగింది. జ్యోతిబసు నేతృత్వంలో ప్రభుత్వం ఆపరేషన్ బర్గా కింద 14లక్షల మంది బర్గాదార్ల (కౌలుదార్ల)ను నమోదు చేయించారు. 11లక్షల ఎకరాల భూమిని శాశ్వతంగా వారి అధీనంలోకి తెచ్చి, సాగుచేసేవారి హక్కుకు రక్షణ కల్పించారు. భూ సంస్కరణల చట్టం కింద దాదాపు 13.7లక్షల ఎకరాల భూమిని సేకరించి, 10.4లక్షల ఎకరాలను 25లక్షల భూ వసతిలేని సాగుదారు కుటుంబాలకు పునఃపంపిణీ చేశారు. దాదాపు ఐదు లక్షల పేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా భూ సంస్కరణల కింద పునఃపంపిణీ చేసిన భూమిలో 20శాతం బసు నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వంలోనే పంపిణీ అయింది. భూ సంస్కరణల వల్ల దళితులు, ఆదివాసులు ప్రధానంగా ప్రయోజనం పొందారు. నివాస ప్రాంతాలకూ, పాఠశాలలకూ మధ్య సగటు దూరం తగ్గింది. సామాజిక సూచీలు కూడా ఎంతో మెరుగుపడ్డాయి. కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగాయి. మైనారిటీలకు సామాజిక భద్రత కల్పించడం, ఆర్థిక తోడ్పాటునందించడం ముఖ్య కర్తవ్యంగా పెట్టుకొని ఆ ప్రభుత్వం కృషి చేసింది.

మాస్ లీడర్



బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ... పొట్టగడుపుకున్న అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ రాష్ట్రంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రిస్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి...సీపీఐ(ఎం) ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపై ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. సినిమాల పైరసీ, లాటరీ మాఫియా, అవినీతికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేశారు.

నిరాడంబర నాయకుడు



1957లో త్రిపుర టెరిటోరియల్ కౌన్సిల్‌కు నృపేన్ చక్రవర్తి ఎన్నికయ్యారు 1962లో ప్రతిపక్ష నాయకుడయ్యారు. త్రిపుర పూర్తి రాష్ట్ర హోదా పొందిన తర్వాత, ఆయన 1972లో రాష్ట్ర విధానసభ సభ్యుడయ్యారు. 1977లో ఆయన వరుసగా రెండు స్వల్పకాలిక సంకీర్ణ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. 1977లో త్రిపుర ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ గెలిచినప్పుడు నృపేన్ చక్రవర్తి ముఖ్యమంత్రి అయ్యారు. 1988 వరకు పదవిలో కొనసాగారు. 1988 ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ఓటమి తర్వాత, ఆయన 1988 నుంచి 1993 వరకు త్రిపుర విధానసభలో ప్రతిపక్ష నాయకుడయ్యారు. 1993 ఎన్నికల్లో, లెఫ్ట్ ఫ్రంట్ మళ్ళీ త్రిపురలో అధికారంలోకి వచ్చింది. ఆయన రాష్ట్ర ప్రణాళిక బోర్డు చైర్మెన్‌గా సేవలందించారు. ముఖ్యమంత్రిగా ఆయన ఏ బట్టల సూట్‌కేస్‌తో వచ్చారో, అధికారిక నివాసం నుంచి వెళ్లిపోయేటప్పుడు ఆదే బట్టల సూట్‌కేసుతో వెళ్లిన నిరాడంబరుడు.

అ'సాధారణ' ముఖ్యమంత్రి



1972లో 23 ఏండ్ల వయసులో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలో చేరిన నేత మాణిక్ సర్కార్. ఆరేండ్ల తర్వాత, 1978లో, కమ్యూనిస్ట్ పార్టీకి త్రిపురలో మొదటిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయంలో ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు. 1980లో సర్కార్ అగర్తల నియోజకవర్గం నుంచి త్రిపుర శాసనసభలో అడుగు పెట్టారు. ఆ తర్వాత ఆయన సీపీఐ(ఎం) చీఫ్ విప్‌గా నియమితులయ్యారు. 1983లో కిషన్‌నగర్ నుంచి మరోసారి విజయం సాధించారు. ఆయన అత్యుత్తమ పనితీరు, నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, 1993లో అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ సర్కార్‌ను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. 1998లో సర్కార్ సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. అదే ఏడాది తొలిసారి త్రిపుర ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి సర్కార్ ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి వరుసగా నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా విశేష సేవలందించారు.

దీనితో భారతదేశంలో ఎక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రుల సమూహంలో సర్కార్‌కు స్థానం లభించింది. సీఎంగా ఆయన తనదైన ముద్ర వేశారు. శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమాలు చేపట్టారు. అత్యంత సాధారణ సీఎం మాణిక్ సర్కార్. ఏమాత్రం ఆడంబరాలు ఇష్టపడని సాధారణ ముఖ్యమంత్రి. తన పేరు మీద ఇల్లు లేదు, కారు లేదు. రిక్షాలోనే సెక్రటేరియట్‌కు వచ్చేవారు. అనవసర ఖర్చులకు అసలు ఇష్టపడని వ్యక్తి ఆయన. మాణిక్ సర్కార్ భార్య పంచాలి భట్టాచార్య2011లో కేంద్ర సాంఘీక సంక్షేమ మండలి ఉద్యోగిగా రిటైర్ అయ్యారు. ఆమె జీవితం కూడా సాధారణం. 'అత్యంత స్వచ్ఛమైన' ముఖ్యమంత్రిగా ప్రజల మన్ననలు పొందిన సీఎం మాణిక్ సర్కార్.

పాలనలో సోషలిజం మిళితం



కేరళ చరిత్రలో అత్యంత ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఇ.కె. నాయనార్ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. రాష్ట్రాన్ని గణనీయమైన సామాజిక, ఆర్థిక సంస్కరణలతో ముందుకు నడిపించారు. ఆయన నిబద్ధత అంకితభావంతో చేసిన పాలనతో కేరళ ప్రగతిశీల విధానాలవైపు దృష్టి సారించింది. మంచి హ్యూమర్ ఉన్న గొప్ప వ్యక్తిత్వం ఆయనది. పేదల అభ్యున్నతి, విద్యను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఆయన విధానాలు రూపొందించారు. సామాజిక న్యాయం, అభివృద్ధిపై దృష్టి పెట్టడం కార్మికవర్గంతో ఆయనకున్న లోతైన సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఆయన ప్రభుత్వం అందరికీ, ముఖ్యంగా బాలికలు, అల్ప ఆదాయ కుటుంబాలకు విద్యను ప్రోత్సహించే విధానాలను ప్రవేశపెట్టింది. ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను మెరుగుపరిచే ప్రయత్నాలు రాష్ట్రంలో అధిక ఆయుర్దాయంకు దోహదపడ్డాయి. నాయనార్ ఆకర్షణ పార్టీ శ్రేణులకు అతీతంగా ఉండేది. సాధారణ ప్రజలతో, ముఖ్యంగా కార్మికులు, రైతులతో కనెక్ట్ అయ్యే విధానం ఆయన ఎదుగుదలకు దోహదపడింది. ఎన్నికల విజయాల్లో ఆ సంబంధాలు కీలకపాత్ర పోషించాయి. అభివృద్ధి ఆధారిత పాలనతో సోషలిజాన్ని మిళితం ఎలా చేయాలో చేసి చూపించారు. కేరళ వామపక్ష రాజకీయ స్రవంతిలో నిరంతర ఔచిత్యంలో ఆయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ప్రవేశపెట్టడం, ప్రజలకు అవసరమైన వస్తువులను అందించడానికి 'మావేలి' సరసమైన ధరల దుకాణాలను ప్రారంభించడం, సంపూర్ణ అక్షరాస్యత ప్రచారం, ప్రజా ప్రణాళికతో సహా అధికారాల వికేంద్రీకరణ మొదలైనవి కొన్ని ముఖ్యమైన విజయాలు. ఒక సారి పాలక్కాడ్ నుంచి ఎంపీగా గెలిచారు.

త్రిపుర అభివృద్ధిలో తనదైన ముద్ర



'**రా**జా దశరథ్' అని గిరిజనులు ముద్దుగా పిలుచుకొనే దశరథ్ దేవ్ రహస్య జీవితం గడుపుతూనే 1952 జనరల్ ఎన్నికల్లో తూర్పు త్రిపుర నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీతో ఎంపీగా గెలిచారు. రహస్యంగా ఢిల్లీ వెళ్ళి, పార్లమెంటులో ప్రత్యక్షమై స్వతంత్ర భారతదేశంలో తాను స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఎందుకులేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీంతో ప్రధాని నెహ్రూ జోక్యంతో దశరథ్‌దేవ్, గణముక్తి పరిషత్ నాయకుల అరెస్ట్ వారెంట్లను రద్దుచేశారు. ఆయన 1952, 1957, 1962, 1967లలో ఎంపీగా ఎన్నికయ్యారు. 1978లో రామ చంద్రఘాట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. దశరథ్‌దేవ్, నృపేన్ చక్రవర్తి, బిరేన్‌దత్తాల నాయకత్వాన గిరిజనుల నాలుగు ముఖ్యమైన డిమాండ్లపై జరిగిన పోరాటం ఫలితంగా 1978లో విస్తృత ప్రజామోదంతో నృపేన్ చక్రవర్తి నాయకత్వంలో ఏర్పడిన వామపక్ష సంఘటన ప్రభుత్వంలో విద్యా, గిరిజన సంక్షేమశాఖల మంత్రిగా పనిచేశారు. వామపక్షసంఘటన ప్రభుత్వంలో 1983 నుంచి 1988 వరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పనిచేశాడు. 1988 నుంచి 1993 వరకు ప్రతిపక్ష నాయకునిగా ఆయన కీలకపాత్ర పోషించారు.

1993 ఎన్నికల్లో 60 స్థానాలకు గానూ 44 స్థానాలు సాధించి సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. 1993 ఏప్రిల్ 10న దశరథ్‌దేవ్ రాష్ట ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 1998 మార్చి11 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. అధికారానికి వచ్చిన వెంటనే త్రిపురలోని వివిధ తిరుగుబాటు గ్రూపుల సభ్యులకు ప్రభుత్వం క్షమాభిక్షను ప్రకటించింది. త్రిపుర రాష్ట్రానికి మొదటి గిరిజన ముఖ్యమంత్రిగా ఆయన గిరిజనుల, పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. గిరిజనుల భాష అయిన కోక్‌బోరక్‌ను రాష్ట్రంలో రెండవభాషగా గుర్తించారు. రాష్ట్రంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య స్నేహ, సామరస్యాల్ని నెలకొల్పటంలో దశరథ్‌దేవ్ ముఖ్యపాత్ర పోషించారు. ఆయన ప్రభుత్వం గ్రామీణపేదలకు పనికి ఆహారం పథకాన్ని అమలు చేసింది. మూడెకరాలలోపు భూమివున్న రైతులకు భూమిశిస్తును రద్దుచేసింది. అమలులో ఉన్న చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు బదిలీచేసిన గిరిజనుల భూములను తిరిగి వారికి అప్పగించింది. గిరిజన స్వయం ప్రతిపత్తి మండలిని ఏర్పాటుచేస్తూ చట్టం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆయన రచించిన "నాస్మృతిపథంలో ప్రజా ఉద్యమాల చరిత్ర, జ్ఞాపకాలు", "గణముక్తి పరిషత్ చరిత్ర" పుస్తకాలు రాష్ట్ర ప్రజా ఉద్యమాల చరిత్రకు సంబంధించి అత్యంత విలువైన పుస్తకాలు.



గంధపు చెక్కలా సమాజ సేవలో అరిగిపోగాని,
ఇసుప ముక్కలా తుప్పపట్టకు - మోక్షగుండం విశ్వేశ్వరయ్య

సంపాదకీయం

ప్రాణాలతో 'యాపా'రం!

మహాభారత యుద్ధం ఎందుకు జరిగిందని మనకు మనమే ప్రశ్న వేసుకుని ఆలోచిస్తే, జూదంలో కోల్పోయిన రాజ్యాన్ని , ఆఖరికి భార్యను కూడా కోల్పోవడం, తిరిగి రాజ్యాన్ని పొందేందుకు కురుక్షేత్ర యుద్ధమే తప్పలేదు. అది భారత కథ. రాజుల నాటి కథ. రాజులు జూదం ఆడటం రివాజు ఆనాటికి. ఎప్పుడయినా జూదం ఆశతో, అత్యాశతో కూడుకుని దురాశగా పరిణామం చెందుతుంది. ఆఖరికి అందరినీ ముంచుతుంది. జూదమూ ఓ రకమైన పందెమే! బానిస సమాజంలోనైతే పందెం కాసి, ఇద్దరు బానిసలను బల ప్రయోగానికి, చంపుకోవడానికి పురికొల్పేవారు. పందాల్లో చంపడం, చావడం ఖాయంగా ఉండింది. ఇప్పటి కోడి పందేలలాంటిదన్నమాట. ఇదొక భూస్వామిక విధానపు క్రూరవినోదం. ప్రజలు దీనికి సమిధలు, ప్రజాధనం దీనికి సమర్పణం. ఇప్పుడిక ఆధునిక

2017లో ప్రమోట్ యాడ్‌లో పాల్గొన్నానని, తర్వాత అది మోసమని తెలిసి రద్దు చేసుకున్నానని ప్రకాశ్‌రాజ్ ప్రకటించాడు. మిగతా ఎవరూ ఇంకా స్పందించలేదు. కొందరు మాత్రం తెలియక చేశామంటున్నారు. ప్రభుత్వం కూడా అసెంబ్లీలో ప్రకటన చేసింది. ఈ బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రచారం కల్పించేవారినీ విచారిస్తామని తెలిపింది. ఇటీవలే మొదలైన ఐపిఎల్ క్రికెట్‌పైన కూడా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. లక్షల రూపాయలు కోల్పోయిన ఓ యువకుడు మొన్న ఆత్మహత్య చేసుకున్నాడు.

వ్యాపార సమాజంలో లాభాల ఆశల ఎరకు చిక్కి బలైపోతున్న సామాన్య ప్రజల దీనగాథలు కోకొల్లలు. ఈ దోపిడీ వ్యవస్థలో కునారిల్లిపోతున్న, దారిద్ర్యం ముంచెత్తుతున్న సామాన్య ప్రజల ఆశలను, ఆవేశాలను వినియోగించుకుని మరింత దోపిడీకి పాల్పడుతున్న పాచికే ఈ పందెం, బెట్టింగ్, మల్టీ లెవల్ మార్కెటింగ్ మొదలైన సాధనాలు. ప్రపంచీకరణ, రియలెస్టేటు బూమ్‌లు సమాజంలో 'ఈజీమని'ని పరిచయం చేశాయి. ఆ భ్రమలో పడి అనేకమంది తమ జీవితాలను, సంసారాలను, కుటుంబాలను ధ్వంసం చేసుకుంటున్నారు.



ఇప్పుడీ డిజిటల్ యుగంలో బెట్టింగ్‌యాప్‌ల రూపంలో సైబర్ దోపిడీకి తెరలేపారు నయాజూదగాళ్లు. వేల కోట్ల రూపాయల్ని సామాన్యుల నుండి కొల్లగొట్టే సంస్థలు వేలకొలది పుట్టుకొచ్చాయి. మన రాష్ట్రంలోనే వందలమంది ప్రాణాలను ఈ బెట్టింగ్ యాప్‌లు బలితీసుకున్నాయి. భర్తలకు తెలియకుండా భార్యలు, భార్యలకు తెలియకుండా భర్తలు ఈ ఆటలకు బానిసలై కుటుంబాలనే హతమార్చుకున్నారు. డబ్బులు ఎక్కువొస్తాయని ఆశ పడుతున్న వాళ్లకు అత్యాశను కల్పిస్తూ, వారి కండ్లముందే గొప్ప కథనాలను వినిపించి, మెస్మరిజానికి గురిచేస్తూ లక్షాధికారులు కోటీశ్వరులు అయిపోయినట్లుగా భ్రమాత్మక ఊహలోకి తీసుకు వెళతారు. మొదట చిన్నచిన్నగా లాభాల ఎర చూపిస్తారు. ఆ తర్వాత పెద్ద బెట్టింగులకు పూనుకోగానే ముంచి ఊరుకుంటారు. యాప్‌లే కాదు, సోషల్ మీడియాలో స్పాన్సర్స్ ప్రకటనలు విపరీతంగా ప్రసారం అవుతున్నాయి. రాష్ట్రపతి ముర్ము, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, సుధ, ముఖేష్ అంబానీలాంటి ప్రముఖులు చెబుతున్నట్టుగానే వీడియోలు ఫేక్‌వి వచ్చాయి. రూ.21వేలు ఇన్వెస్ట్‌చేస్తే నెల, రెండునెలల్లోనే పదిహేను లక్షలు సంపాదిం చవచ్చని దాని సారం. 'డబ్బులెవరికీ ఊరకనే రావు' అన ప్రకటన తప్పక గుర్తుకు రావాల్సిన అవసరం ఉంది. వీటిని అరికట్టడం ఎలాగో ప్రభుత్వం ఆలోచించాలి.

ఈ బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్లలో దేశంలోని ప్రముఖులతో పాటు సినీతారలు, ఆటగాళ్లు పాల్గొంటున్నారు. భారతరత్న సచిన్ టెండూల్కర్, షారుఖ్‌ఖాన్, కోహ్లీలపైనా యాప్‌లు ప్రమోషన్ చేశారని ఫిర్యాదు చేశారు. మన తెలుగు సినీ తారలు బాలకృష్ణ, ప్రభాస్, గోపిచంద్, రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, శ్యామల, విష్ణుప్రియ ఇలా ఎన్నో పేర్లు బయటకి వచ్చాయి. ఫన్-88 యాప్ ద్వారా కోట్లాది రూపాయలు తరలించుకుపోయారని ఆరోపణలొచ్చాయి. ఈ మధ్య హైదరాబాద్ పోలీసులు సైబర్‌క్రైం విభాగం ఈ బెట్టింగ్ యాప్‌లపై తీవ్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు. ఇప్పటిదాకా 385 కేసులు పెట్టారు. ప్రమోటర్లను ప్రశ్నిస్తున్నారు. ఇంతెందుకు మన మెట్రోరైళ్లోనే ఈ బెట్టింగ్ యాడ్స్ పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. 2017లో ప్రమోట్ యాడ్‌లో పాల్గొన్నానని, తర్వాత అది మోసమని తెలిసి రద్దు చేసుకున్నానని ప్రకాశ్‌రాజ్ ప్రకటించాడు. మిగతా ఎవరూ ఇంకా స్పందించలేదు. కొందరు మాత్రం తెలియక చేశామంటున్నారు. ప్రభుత్వం కూడా అసెంబ్లీలో ప్రకటన చేసింది. ఈ బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రచారం కల్పించేవారినీ విచారిస్తామని తెలిపింది. ఇటీవలే మొదలైన ఐపిఎల్ క్రికెట్‌పైన కూడా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. లక్షల రూపాయలు కోల్పోయిన ఓ యువకుడు మొన్న ఆత్మహత్య చేసుకున్నాడు. తక్కువ సమయంలోనే భారీ లాభాలిస్తామని డెయిరీఫామ్ నిర్వహిస్తున్నామని రూ.20కోట్లతో బిచాణా ఎత్తేసింది ఓ ఫేక్ సంస్థ. మల్టీ లెవల్ మార్కె టింగ్‌లో భాగంగా మొదట కొందరి పెట్టుబడులకు లాభాలందిస్తూ క్రమంగా అందరినీ మోసానికి గురిచేస్తున్నారు. ఈ ఆర్థిక సైబర్ నేరగాండ్ల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. డబ్బులపై ప్రజలకున్న ఆశను, ఆసరా చేసుకుని ఇలాంటి మోసాలకు పాల్పడటం ఈ మధ్యకాలంలో పెరిగింది. వీటికి తారలూ, ప్రముఖులు ప్రచారం చేయడం వల్ల ప్రజలింకా నమ్మకం పెంచుకుంటున్నారు. వీటి ఉచ్చులో పడకుండా ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలి.

ముందుకు దారి చూపనున్న 24వ పార్టీ మహాసభలు




ప్రకాశ్ కరత్

మధురైలో ఏప్రిల్ 2-6 తేదీల మధ్య సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలు జరుగనున్నాయి. డోనాల్డ్ ట్రంప్ అమెరికా పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అంతర్జాతీయంగా తీవ్ర మార్పులు వస్తున్నాయి. భారతదేశంలో బీజేపీ పాలన హిందూత్వ కార్పొరేట్ నియంతృత్వానికి దారులు పరుస్తున్నది. ఆ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, ఇతర కష్టజీవులు సమైక్యంగా ప్రతిఘటనకు పూనుకుంటున్నారు.

గత రెండు నెలల కాలంలోనే ట్రంప్ ప్రభుత్వం అల్లకల్లోల పరిస్థితులను సృష్టించింది. ఇవి గత ముప్పయ్యేళ్లలో ఎప్పుడూ లేవు. "అమెరికాని మళ్లీ గొప్పగా చేద్దాం", "అమెరికా ఫస్ట్" వంటి నినాదాల ద్వారా తన సామ్రాజ్య ప్రతిష్టను పెంచుకోవాలనే పనిలో ఆ దేశముంది. ఇది నాటోలోని దేశాలతోపాటు, ఇతర ఐరోపాలోని మిత్ర దేశాలపైనా ప్రభావం చూపుతోంది; దక్షిణాఫ్రికా వంటి దక్షిణ భూమండల దేశాలతో శత్రుత్వం పెంచేందుకు, ఉదాహరణకు పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు సహకరించేందుకు దారితీస్తుంది.

ఈ ట్రంప్ పాలనా కాలంలో ఇప్పటివరకు నిశ్శబ్దం (మ్యూట్ చేయబడిన)గా ఉన్న సామ్రాజ్యవాద దేశాల మధ్య ఉండే వైరుధ్యంతో సహా అన్ని సామాజిక వైరుధ్యాలూ తీవ్ర స్థాయిలో ముందుకు వస్తాయి. ఈ అంతర్జాతీయ పరిస్థితిపై పార్టీ మహాసభ తన విశ్లేషణను తాజాపరుచుకుంటుంది.

భారతదేశంపై టారిఫ్‌లు విధిస్తానని, వీసాల రద్దుపై ట్రంప్ ప్రకటనలను పట్టించుకోకుండా దాని అడుగులకు మడుగులొత్తడానికి మోడీ సర్కార్ ప్రవర్తిస్తున్నది. ఈ ప్రభుత్వం ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి నిరోధ శక్తుల్లో ఒకటిగా ఉంది. ఈ పదకొండేండ్ల మోడీ పాలన అత్యంత అభివృద్ధి నిరోధక, మతోన్మాద, నియంతృత్వ శక్తులు నయాఫాసిస్టు లక్షణాలతో సంఘటితపడేందుకు దారితీసింది. మోడీ పాలన హిందూత్వ శక్తులు బడా కార్పొరేట్లతో చెట్టపట్టాలేసుకున్నారు. ఈ విశ్లేషణపై ఆధారపడిన రాజకీయ ఎత్తుగడల పంథా హిందూత్వ కార్పొరేట్ శక్తులపై పోరాటమే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకుంటుంది.



పార్టీ 23వ మహాసభ కొన్ని సంస్థాగత కర్తవ్యాలను నిర్ణయించింది. పార్టీ సభ్యుల నాణ్యతను మెరుగుపరచడం, పార్టీకి మొదటి మెట్టయిన శాఖను చురుకుగా పని చేయించడం, శాఖ - వర్గ, ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాలకు నాయకత్వం వహించే లాగా ప్రజాపంథాను ఆమోదింపచేయటం. హిందూత్వ సిద్ధాంతానికి, దాని కార్యకలాపాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పని నిర్వహించటం గురించి నొక్కిచెప్పింది. ఈ కర్తవ్యాలపై జరిగిన పనిని సంస్థాగత నివేదికలో సమీక్షించింది. ఈ పనిలో అభివృద్ధి, లోటుపాట్లను గురించి పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఆత్మ విమర్శనాత్మకంగా పరిశీలించింది. ఇది పార్టీ సమర్థవంతంగా రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించడానికి, పోరాటాలు ఉద్యమాలు అభివృద్ధి చేయడానికి, సైద్ధాంతిక పోరాటం నడపటానికి ఉపయోగపడుతుంది.

రాజకీయ పంథా

24వ మహాసభ రాజకీయ తీర్మాన చిత్తుప్రతిలో కింది విధంగా ఉంది.

2.86 : బీజేపీని, హిందుత్వ శక్తులను ప్రజల నుండి వేరు చేసి ఓడించాలంటే వాటిపై నిరంతర పోరాటం అవసరం. పార్టీ ఈ హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా అన్నిరకాల లౌకిక శక్తులను ఒకతాటిపైకి తెచ్చే విశాల ఐక్యవేదికను నిర్మాణం చేయాలి.

2.87 : హిందూత్వ నయా ఉదారవాద శక్తులపై మన పోరాటం సీపీఐ(ఎం) యొక్క, ఇతర వామపక్షాల స్వతంత్ర శక్తి పెరుగుదలపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం హిందూత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అంతర్భాగం చేయాలి.

2.88 : కార్పొరేట్ల అనుకూల, నయా ఉదారవాద విధానాలు ప్రజల జీవన పరిస్థితుల్ని దారుణంగా దెబ్బతీస్తున్నాయి. శ్రమజీవులు తీవ్ర దోపిడీకి గురౌతున్నారు. ఇవన్నీ మోడీ ప్రభుత్వం మరియు బీజేపీ విధానాల ఫలితమే. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని, ప్రయివేటీకరణ పేరుతో జాతి సంపదను దోచుకునే ప్రయత్నాల ప్రతిఘటనలో మన పార్టీ శ్రేణులు ముందు పీఠిన ఉండాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో 'ఇండియా' బ్లాక్ వంటి సెక్యులర్ ప్రతిపక్షపార్టీల కూటమి కొనసాగేలా చూడాలి.

పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచండి

గత 23వ మహాసభలో ఆమోదించుకున్న రాజకీయ ఎత్తుగల మీద ఆధారపడి నేడు రాజకీయ సమీక్ష, నివేదికను కేంద్ర కమిటీ సిద్ధం చేసింది. ఆ నివేదిక పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడాన్ని నేటి దశలో అత్యంత ప్రాధాన్యత ఉన్న అంశంగా గుర్తించింది. జరుగనున్న పార్టీ మహాసభ దీన్నే కీలక అంశంగా చర్చించబోతుంది. ఎందుకంటే పార్టీ స్వతంత్ర పెరగకపోతే బీజేపీ, ఆరెస్సెస్‌లను శక్తివంతంగా ఎదుర్కోలేము.

పార్టీ బలాన్ని పెంచుకోవటం అంటే పునాది వర్గాల్లో మన కృషి పెరటమే. గ్రామీణ ప్రాంతాల్లోని ధనికుల ముఠా గ్రామీణ పేదలపై సాగిస్తున్న దోపిడీని చైతన్యవంతంగా ఎదుర్కోవాలి. సంఘటిత రంగంలోని కార్మికుల్లో మరీ ముఖ్యంగా వ్యూహాత్మకమైన తయారీ రంగంలోని కార్మికుల్లోను, సంఘటిత రంగంలో కాంట్రాక్టు కార్మికుల్లోను పార్టీ తన ప్రభావాన్ని పెంచుకోవాలి.

పార్టీ రాజకీయ వేదిక నుండి స్వతంత్ర క్యాంపెయిన్‌లు చేపట్టాలి. రాజకీయ అవగాహనలు, మైత్రి పేరున మన స్వతంత్ర పోరాటాన్ని మకిల పరచరాదు. ఆరెస్సెస్, హిందూత్వ శక్తుల కార్యకలాపాల్ని ఎదుర్కోవటానికి మన స్వతంత్ర సైద్ధాంతిక ప్రచారాన్ని కొనసాగించాలి.స్థానిక సమస్యల మీద నిరంతర పోరాటాలు చేయడంపై నొక్కి చెప్పాలి.

కుల అణచివేత, లింగ వివక్ష వంటి అంశాలపై నేరుగా పార్టీగానే పోరాటాలు చేయాలి. సామాజిక అణచివేతలపై జరిగే పోరాటాలను వర్గ దోపిడీపై జరిగే పోరాటాలతో అనుసంధానం చేయాలి. యువతను పెద్ద సంఖ్యలో పార్టీ వైపు ఆకర్షించాలి. దీనికి యువతకు సంబంధించిన కీలక డిమాండ్లను రూపొందించాలి.

పోరాటాలు, ప్రతిఘటనలు

2024 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో బీజేపీ మెజారిటీ కోల్పోయి, లౌకిక ప్రజాస్వామ్య ప్రతిపక్షానికి పాక్షిక విజయం కలిగినప్పటికీ, మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన హిందూత్వ కార్పొరేట్ ఎజెండా అమలు చేయ టంలో ఏమాత్రం సడలింపును కనబరచటం లేదు. మోడీ ప్రభుత్వం ఆర్థిక, హిందూత్వ అనుకూల విధానాలను బలంగా, విస్తృతంగా ప్రతిఘటించటానికి ఉన్న ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తున్నది.

23వ పార్టీ కాంగ్రెస్ కాలం నుంచి కార్మికవర్గం, రైతాంగం, మహిళా, యువజన, విద్యార్థి పోరాటాలు, ఐక్య ఆందోళనలు చూస్తున్నాము. బహుళ జాతి కంపెనీకి వ్యతిరేకంగా తమిళనాడు, కాంచీపురంలో 38 రోజుల పాటు శాంసంగ్ కార్మికులు చేసిన విజయ వంతమైన పోరాటం దీనికి గొప్ప ఉదాహరణ. విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నడుస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో స్కీం కార్మికుల పోరాటాలు అసంఖ్యాకంగా జరిగాయి, వాటిలో అనేక పోరాటాలు కొన్ని విజయాలను సాధించాయి. ఉపాధి హామీ వేతనాలు, భూమి, ఇళ్లపట్టాల వంటి సమస్యలపై వివిధ ప్రాంతాల్లో పోరాటాలు జరిగాయి.

చట్టబద్ధమైన కనీస గిట్టుబాటు ధర, ఇతర డిమాండ్లపై రైతు సంఘాల ఐక్య వేదిక- ఎస్‌కెఎమ్- తన పోరాటాన్ని కొనసాగిస్తున్నది. మైనింగ్ ప్రాజెక్టుల కారణంగా నివాసిత ప్రాంతాలను వదిలివెళ్లటానికి వ్యతిరేకంగా ఆదివాసీలు, రైతులు పోరాటాలు చేస్తున్నారు. ఆహారభద్రత, మహిళలపై నేరాలు, జాతీయ విద్యావిధానం, నిరుద్యోగంలాంటి సమస్యలపై మహిళలు, విద్యార్థులు, యువజనులు పోరాడుతున్నారు.

రానున్న రోజుల్లో, నూతన ఆర్థిక విధానాల ప్రతిఘటనకు విస్తృతమైన తీవ్రమైన ప్రతిఘటన పోరాటాలు చేయాలి. ప్రభుత్వం రుద్దిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను నిరసిస్తూ మే 20న ఒకరోజు సార్వత్రిక సమ్మె చేయడానికి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

రాజకీయంగా వారిని తయారు చేయటంలో పార్టీ యూనిట్లు శ్రద్ధ చూపాలి. పోరాటాలనుంచి పెద్దసంఖ్యలో సమరశీల, కార్యకర్తలకు రాజకీయ విద్య గరిపి పార్టీలోకి తీసుకున్నప్పుడే పార్టీ బలం సొంతంగా పెరగగలదు.

ట్రంప్ అధ్యక్షత కింద దాని దుష్ట పన్నాగాలకు మోడీ వంత పాడటానికి ఇష్ట పడుతున్నది. ఆ కారణంగా దేశంలో సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయడం, మోడీ ప్రభుత్వం అమెరికా అనుకూల విధానాలను వ్యతిరేకించడం అవసరంగా ఉన్నది. ఈ కర్తవ్యాన్ని సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు మాత్రమే నిర్వర్తించగలవు.

కేరళ ఎల్డీఎఫ్ ప్రభుత్వం

"నవ కేరళ" నిర్మాణంలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయటానికి చేస్తున్న కృషి చెప్పుకోదగినది. ప్రయత్నం అంతా కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న శత్రు పూరిత వివక్ష వైఖరిని ఎదురుకుంటూ జరుగుతున్నది. కేరళ సీపీఐ(ఎం) లౌకిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం మద్దతుకు నిరంతరం ప్రజలను సమీకరిస్తూ ఉన్నది. దేశంలోని ప్రజాస్వామ్య శక్తులన్నిటిని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి మద్దతుగా సమీకరించాలి.

శక్తివంతమైన పార్టీని నిర్మిద్దాం

పార్టీ నిర్ణయించిన రాజకీయ సైద్ధాంతిక కర్తవ్యాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ మహాసభ చర్చించి, పార్టీని సరిదిద్దడానికి, విస్తృతం చేయడానికి అవసరమైన చర్యలను నిర్ణయిస్తుంది.

పార్టీ 23వ మహాసభ కొన్ని సంస్థాగత కర్తవ్యాలను నిర్ణయించింది. పార్టీ సభ్యుల నాణ్యతను మెరుగుపరచడం, పార్టీకి మొదటి మెట్టయిన శాఖను చురుకుగా పని చేయించడం, శాఖ - వర్గ, ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాలకు నాయకత్వం వహించే లాగా ప్రజాపంథాను ఆమోదింపచేయటం. హిందూత్వ సిద్ధాంతానికి, దాని కార్యకలాపాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పని నిర్వహించటం గురించి నొక్కిచెప్పింది. ఈ కర్తవ్యాలపై జరిగిన పనిని సంస్థాగత నివేదికలో సమీక్షించింది. ఈ పనిలో అభివృద్ధి, లోటుపాట్లను గురించి పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఆత్మ విమర్శనాత్మకంగా పరిశీలించింది. ఇది పార్టీ సమర్థవంతంగా రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించడానికి, పోరాటాలు ఉద్యమాలు అభివృద్ధి చేయడానికి, సైద్ధాంతిక పోరాటం నడపటానికి ఉపయోగపడుతుంది. వామపక్ష శక్తుల మధ్య మరింత ఐక్యత పెంచుకోవడంలోను, ఒక వామపక్ష ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకుపోవడం ద్వారా, వాటితో పాటే సీపీఐ(ఎం) బలం కూడా పెరుగుతోంది. అన్ని వర్గాల, తరగతుల శ్రామిక ప్రజలను, వారి ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలను కూడగట్టడంలో వామపక్ష, ప్రజాస్వామ్య వేదిక ఓపికతో నిర్మించాలి.

24వ మహాసభ అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ప్రతిఘాత చీకటి శక్తులను తిప్పికొట్టడానికి, ప్రత్యామ్నాయ అభివృద్ధికై లౌకిక, ప్రజాస్వామ్య అభ్యుదయ మార్గానికి పిలుపునిచ్చే వేదికగా తయారుకావాలి.

(స్వేచ్ఛానువాదం)

కాలిపోయింది నోట్లకట్టలా? న్యాయమా?



సిజెఐగా పనిచేసిన జస్టిస్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వస్తే కేంద్రం ఏ చర్య తీసుకోలేదు. తర్వాత ఆయనకు మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ పదవి దక్కింది. బీజేపీ హయాంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఛటర్జీని కూడా అభిశంసించిన పరిస్థితి ఏర్పడితే ఆయన రాజీనామా చేసి బయటపడ్డారు. సిజెఐగా ఉండగానే జస్టిస్ రంజన్‌గోగోయ్ పాలనా నిర్వహణ తీరుపై సహచర న్యాయమూర్తులే తీవ్రంగా తిరగబడినా, ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా సురక్షితంగా పదవీ కాలం పూర్తి చేసుకుని కొద్ది రోజుల్లోనే మోడీ సర్కారు నామినేషన్‌తో రాజ్యసభకు వెళ్లారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు, కాషాయ నేతలూ న్యాయవ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని చూస్తున్న నేపథ్యంలో ఉన్నత న్యాయమూర్తులే ఆరోపణలకు గురవుతున్న స్థితిలో రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సవాలును ఎదుర్కొవలసి ఉంటుంది.



తెలకపల్లి రవి

ఢిల్లీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు కట్టలకొద్ది కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించాయనే కథనాలు దేశంలో సంచలనం కలిగించాయి. న్యాయవ్యవస్థలో అవినీతి పెరిగిపోతుందనే అభిప్రా యాలు అనేకసార్లు వ్యక్తమవుతున్నా, కొన్ని ఉదాహరణలు కనిపిస్తున్నా కోర్టు ధిక్కారం గురించిన సంకోచాలు, వ్యవస్థపై గౌరవం కారణంగా ఒక పరిధికి మించి అది చర్చకు రాలేదు. కానీ ఇప్పుడు మీడియాలో ఒక్కసారిగా ఈ ఉదంతం బయటకు రావడం, దానిపై నేరుగా భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ సంజీవ్‌ఖన్నా జోక్యం చేసుకుని ముగ్గురు హైకోర్టు సిజెలతో కమిటీని నియ మించి విచారణ ప్రక్రియ ప్రారంభించడం, తగలబడినట్టు చెప్పబడే నోట్ల కట్టలను అత్యున్నత న్యాయస్థానమే పోస్టు చేయడం, ఇవన్నీ సంచలనం కలిగించాయి. ఈ తరహా ఘటనలు గతంలో ఎప్పుడూ జరిగి ఉండలేదన్నది వాస్తవం. ఇది న్యాయవ్యవస్థలో, నివేదించే మీడియాలో, పార్లమెంటులో, రాజకీయ వర్గాల్లో అన్ని విధాలా చర్చ నీయమైంది. ఎప్పుడూ న్యాయవ్యవస్థపై వ్యాఖ్యల్లో ముందుండే రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ దీనిపైనా తీవ్రంగా స్పందించడమే గాక అన్ని పార్టీలతో చర్చించే బాధ్యత బీజేపీ అధ్యక్షుడైన కేంద్రమంత్రి జెపి నడ్డాకు అప్పగించారు. అయితే గమనించాల్సినదేమంటే ఇప్పటికీ ఈ విషయమై న్యాయవ్యవస్థ అంతర్గత పరిధిలో విచారణ ప్రక్రియ తప్ప మరే దర్యాప్తు మొదలు కాలేదు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని కోరుతూ మాథ్యూ జె.నెడుంపర అనే సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఓకా ధర్మాసనం కొట్టివేసింది. విచారణ గురించిన వివరాలు తెలియరాకుండా దీన్ని చేపట్టడం తొందరపాటే అవుతుందని వ్యాఖ్యానించింది. అదే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఒక మీడియా సదస్సులో పాల్గొంటూ సిజెఐ అనుమతి లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రశ్న ఉత్పన్నం కాదని ప్రకటించారు.మరోవైపున సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు కేంద్రం జస్టిస్ వర్మను ఆయన మాతృస్థానమైన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది.కానీ వర్మకు న్యాయపరమైన బాధ్యతలు అప్పగించవద్దని అంతకుముందు ఢిల్లీ హైకోర్టు సిజెను, ఇప్పుడు అలహాబాద్ హైకోర్టు సిజెను కూడా ఆదేశించారు. సంచలన వార్తలు వచ్చాక అత్యున్నత జోక్యం తర్వాత కూడా జరుగుతున్న దేమిటనేది గానీ, ఏం చేయబోతున్నారనేది గాని స్పష్టత లేని పరిస్థితి ఏర్పడింది.

తప్పులకు రక్షణలు

జస్టిస్ వర్మ ఉదంతంలో కోర్టుల మల్లగుల్లాలు ఒకటైతే, పాలక బీజేపీ స్పందనలు మరో కోణంలో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఎందుకంటే గతంలోనూ కొన్ని అవినీతి ఆరోపణలూ, తీవ్ర వివాదాలు వచ్చిన ఉదా హరణలు ఉన్నాయి. కానీ నేరుగా చర్య తీసుకున్న సందర్భాలు దాదాపు లేవు. ఎందుకంటే పైకి ఏమి చెప్పినా పాలకవర్గాలు ఎప్పుడూ న్యాయవ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికే పాకులాడతాయి. 'చట్టం వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది గానీ, వ్యవస్థ చట్టంపై ఆధారపడి ఉండదని' కారల్ మార్క్స్ చెప్పిన మాట ఎప్పుడూ మర్చిపోకూడదు. దీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ హయాంలో ఒక విధంగా న్యాయవ్యవస్థ ఒత్తిడికి గురైతే బీజేపీ హయాంలో అది మరింత బాహాటంగా కళ్లకు కడుతున్నది. నిబద్ధ న్యాయ వ్యవస్థ(కమిటెడ్ జ్యుడిషియరీ) ఉండాలనేది ఇందిరాగాంధీ తరచూ చెప్పినమాట. ఆఖరుకు ఆమె ప్రకటించిన ఎమర్జెన్సీ రాజ్యానికి కూడా అప్పటి సుప్రీంకోర్టు ఆమోద ముద్రవేసింది. ఎప్పుడూ ఆ విషయాన్ని వల్లించే బీజేపీ హయాంలో ఇది మరింత దారుణంగా తయారైంది. పీవీ నరసింహారావు హయాంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిని అభిశంసిం చేందుకు పార్లమెంటు చర్యలు తీసుకున్నా నాటి ప్రభుత్వం బయటపడేసింది. సిజెఐగా పనిచేసిన జస్టిస్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వస్తే కేంద్రం ఏ చర్య తీసుకోలేదు. తర్వాత ఆయనకు మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ పదవి దక్కింది. బీజేపీ హయాంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఛటర్జీని కూడా అభిశంసించిన పరిస్థితి ఏర్పడితే ఆయన రాజీనామా చేసి బయట పడ్డారు. సిజెఐగా ఉండగానే జస్టిస్ రంజన్‌గోగోయ్ పాలనా నిర్వహణ తీరుపై సహచర న్యాయమూర్తులే తీవ్రంగా తిరగబడినా, ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా సురక్షితంగా పదవీ కాలం పూర్తి చేసుకుని కొద్ది రోజుల్లోనే మోడీ సర్కారు నామినేషన్‌తో రాజ్యసభకు వెళ్లారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు, కాషాయ నేతలూ న్యాయవ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని చూస్తున్న నేపథ్యంలో ఉన్నత న్యాయమూర్తులే ఆరోపణలకు గురవుతున్న స్థితిలో రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సవాలును ఎదుర్కొవలసి ఉంటుంది.

కేంద్రానికి తాళాలివ్వాలా?

వివిధ పాలక పార్టీల ప్రభుత్వాధినేతలూ ఆయా సమయాల్లో తమ అనుకూలతను బట్టి న్యాయవ్యవస్థ క్రియాశీలతపైన ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు లేదా కొనియాడుతుంటారు. న్యాయమూర్తులు కూడా పరిపరివిధాలా స్పందిస్తుంటారు. నీతివంతమైన న్యాయమూర్తులు అనేకమంది ప్రజాస్వామిక స్ఫూర్తి, విశ్వసనీయత, ప్రజల పట్ల నిబద్ధత కోసం కృషి చేస్తుంటారు కూడా. అయితే పాలకవర్గ వ్యవస్థ తన వ్యూహాలకు అనుగుణంగానే అడుగులు వేస్తుంటుంది. ఇదే రాజ్యాంగ మౌలిక స్వభావం గురించిన ప్రస్తావన వచ్చినపుడు ఇదే ధంకర్ కోర్టులపై దాడి చేయడం చూశాం. ఎప్పుడు ఎలాంటి వివాదం వచ్చినా న్యాయమూర్తుల నియామకం కేంద్రం చేతుల్లోకి తీసుకోవడమే పరిష్కారమన్నట్టు మాట్లాడేవారిని చూస్తుంటాం. చూడటమే కాదు, నిజంగానే న్యాయమూర్తుల నియామకం జాప్యం చేస్తూ ముప్పుతిప్పలు పెట్టడం వాస్తవం. ఈవిషయంలో సుప్రీంకోర్టు మాజీ సిజేఐ డివై చంద్రచూడ్ ధర్మాసనం గత సెప్టెంబరులో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు కోర్టు ఆగ్రహాన్ని వెల్లడించాయి. సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను పక్కన పెట్టడానికి కారణం ఏమిటని ఆయన కేంద్రాన్ని నిలదీసింది. ఎడతెగని ఆలస్యం చేసి గుండుగుత్తగా వెనక్కు పంపితే ఏమని అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టుకు జస్టిస్ సురేష్ కుమార్, పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టుకు జస్టిస్ శాంతాబాయి అను, జమ్మూ కాశ్మీర్ అండ్ లడక్ హైకోర్టుకు జస్టిస్ దర్శి రాబిన్సన్‌ను పంపిం చాలంటూ చేసిన సిఫార్సులను వెనక్కు తీసుకోవడానికి కూడా న్యాయస్థానం సిద్ధపడింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జాన్ సత్యంను సుప్రీంకోర్టు కొలీజియం 2022 ఫిబ్రవరిలో సిఫార్సు చేసింది, 2023 జనవరిలో పునరుద్ఘాటిం చింది అయినప్పటికీ ఇవి జరగలేదు. జార్ఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ సారంగి పేరును ఆలస్యంగా ఖరారు చేయడంవల్ల ఆయన పదిహేను రోజులు మాత్రమే సిజెగా పనిచేసి దిగిపోవాల్సి వచ్చింది! 2024 ప్రారంభంలో కొలీజియం పిఎం మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక చేస్తే ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనీ, రెండుసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆయన్ను ప్రభుత్వ న్యాయవాదిగా నియ మించిందనీ కేంద్రం ఆ సిఫార్సు వెనక్కు పంపింది. అయితే ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనే వాదన అస్పష్ట మైందని, లంకేశ్ చంద్రగౌరి బీజేపీలో ఆఫీసుబేరర్‌గా ఉన్నా 2023 ఫిబ్రవరిలో ఆమెను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియ మించిన సందర్భాన్ని పేరు తీయకుండా కొలీజియం గుర్తు చేసింది. న్యాయవ్యవస్థలో సంఘ పరివార్ పట్టు పెరిగిపోవడం, న్యాయమూర్తులు నిబంధనలను ఉల్లంఘించేలా వ్యాఖ్యలు చేయడం కూడా చాలాసార్లు చూశాం. కనుక న్యాయ మూర్తుల నియామక అధికారం కేంద్రానికి అప్పగించడమే పరిష్కారమన్న వాదనలోనూ వాస్తవికత లేదు.న్యాయ విషయాలన్నిటిపైనా ఒక కమిషన్ ఆధ్వర్యం వహించాలన్న మౌలిక ప్రతిపాదనను కేవలం న్యాయ మూర్తుల నియామకాలకు పరిమితం చేస్తూ ఎన్‌జాక్ (నేషనల్ కమిషన్ ఫర్ జుడిషియల్ అపాయింట్ మెంట్స్) మోడీసర్కారు తీసుకొచ్చిన బిల్లును సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయవ్యవస్థ స్వతంత్ర తనూ, ప్రజాస్వామిక నియామక ప్రక్రియనూ సమతుల్యం చేయడం చాలా అవసరమనేది నిర్వివాదాంశం.

న్యాయమూర్తుల్లో యాభైశాతం మంది అవినీతిపరులున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖట్జూ ఒకసారి వ్యాఖ్యానించారు. దానికి ఆయన విచారణకు కూడా హాజరయ్యారు. ఇదే అలహాబాదు హైకోర్టు నుంచి వచ్చిన ఖట్జూ అవినీతిపరుల జాబితా ఒకటి అప్పటి సిజెఐ లహోటీకి ఇచ్చానని కూడా చెప్పారు.వారి అవినీతిని తాను వెల్లడిస్తానంటే సిజెఐ వద్దని వారించారని ఖట్జూ పేర్కొన్నారు.తాజాగా ఒక కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా తీర్పులు చెప్పినట్టు ఆరోపణలకు గురైన ఒక న్యాయమూర్తిపై లోక్‌పాల్ విచారణకు ఆదేశాలిస్తే నిబంధనలు ఒప్పుకోవంటూ సుప్రీంకోర్టు అడ్డుపడింది. ఇక్కడ లోక్‌పాల్‌గా ఉన్నది కూడా సుప్రీం మాజీ జడ్జి ఖాన్విల్కర్ కావడం గమనించదగింది. కనుక జస్టిస్ శర్మపై ఆరోపణలు గానీ, వాటిపై విచారణ ప్రహసనం గానీ ఆశ్చర్యం కలిగించదు.

కింకర్తవ్యం?

న్యాయమూర్తులలో యాభైశాతం మంది అవినీతిపరులున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖట్జూ ఒకసారి వ్యాఖ్యానించారు. దానికి ఆయన విచారణకు కూడా హాజరయ్యారు. ఇదే అలహాబాదు హైకోర్టు నుంచి వచ్చిన ఖట్జూ అవినీతిపరుల జాబితా ఒకటి అప్పటి సిజెఐ లహోటీకి ఇచ్చానని కూడా చెప్పారు.వారి అవినీతిని తాను వెల్లడిస్తానంటే సిజెఐ వద్దని వారించారని ఖట్జూ పేర్కొన్నారు.తాజాగా ఒక కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా తీర్పులు చెప్పినట్టు ఆరోపణలకు గురైన ఒక న్యాయమూర్తిపై లోక్‌పాల్ విచారణకు ఆదేశాలిస్తే నిబంధనలు ఒప్పుకోవంటూ సుప్రీంకోర్టు అడ్డుపడింది. ఇక్కడ లోక్‌పాల్‌గా ఉన్నది కూడా సుప్రీం మాజీ జడ్జి ఖాన్విల్కర్ కావడం గమనించదగింది. కనుక జస్టిస్ శర్మపై ఆరోపణలు గానీ, వాటిపై విచారణ ప్రహసనం గానీ ఆశ్చర్యం కలిగించదు. ఈ వ్యవహారంలో ఇప్పటికే అనేక ట్విస్టులు చోటు చేసుకున్నాయి. అసలు ప్రమాదం, అగ్నిమాపక బృందాలు వెల్లడం మార్చి 14న రాత్రి జరిగితే, వారికి కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించాయన్న అనధికారిక కథనాలు 21నగానీ బయటకు రాలేదు. ఆ తర్వాత అగ్నిమాపక అధికారులు నోట్లకట్టలు కని పించినట్టు తాము చెప్పలేదని తమతో చెప్పినట్టు పిటిఐ వార్త ఇచ్చింది. తర్వాత సదరు అధికారి అతుల్ గార్గ్ తాము ఆ మాట తను చెప్పింది కాదని వివరణ ఇచ్చారు. ఇక నోట్ల కట్టలు పెట్టిన గదులు అందరూ వాడుకునేలా ఉంటాయని జస్టిస్ వర్మ వివరణ ఇస్తే అందుకు భిన్నంగా దానికి ఎప్పుడూ తాళాలు వేసి ఉంటాయని భద్రతా సిబ్బంది చెప్పారు.వర్మను బదిలీ చేయడానికి ఈ విచారణకూ సంబంధం లేదని ఆగమేఘాల మీద స్పష్టత విడుదల చేసిన సుప్రీంకోర్టు కేంద్రం ఒప్పుకున్నాకే బదిలీ ఖరారు చేసి న్యాయవిధులకు దూరం పెట్టింది. మరోవైపున ఆయన్ను తమమీద మళ్లీ ఎందుకు రుద్దుతున్నారని అక్కడ బార్ అసోసియేషన్ ఆందోళనకు దిగింది. ఏమైనా విచారణ జరిపే న్యాయమూర్తుల బృందం నివేదిక అందేవరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవ కాశం కనిపించడం లేదు. ఈలోగా జస్టిస్ వర్మ న్యాయవాదుల సలహాలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఆయన రాజీనామా వంటివి చేస్తారేమో తెలియదు. కనుక ఈ ఉదంతంలో చివరకు జరిగేదేమిటో వేచిచూడవలసిన అంశాలు చాలా ఉన్నాయి. న్యాయమూర్తుల మంచి చెడ్డల చర్చగా గాక వ్యవస్థలో రావలసిన మౌలిక సంస్క రణలు, మరో వైపు దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడం ఇక్కడ కీలకం. వ్యక్తిగతంగా న్యాయమూర్తుల లేదా న్యాయాధికారుల అవినీతి ఒకటైతే క్విడ్ ప్రోకో తరహాలో పాలకులు ఆ వ్యవస్థతో అనధికార అవగాహనకొచ్చే పరిస్థితిని నివారించడం మరింత ముఖ్యం. జస్టిస్ వర్మ ఉదంతం చివరకు ఎలా ముగుస్తుందో చూశాక మరింత లోతైన చర్చ చేయవలసి ఉంటుంది. ■

ఉగాది శుభాకాంక్షలు

- కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లా ప్రజలకు సకల శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు, జిల్లా కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు, తీపి చేదు కలిసిందే జీవితం, కష్టం, సుఖం తెలిసిందే జీవితం, మీ జీవితంలో ఈ ఉగాది మరెన్నో ఆనందోత్సవాలను ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరారు.

పీహెచ్‌సీకి నిధులు నిల్

వేధిస్తున్న 'సిబ్బంది కొరత'

- 13 ఏళ్లుగా 4 హెల్త్ అసిస్టెంట్ల పురుషుల పోస్టులు ఖాళీ

నవతెలంగాణ-బోనకల్


మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


రక్షణ లేని చిరునోముల సబ్ సెంటర్

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిబ్బంది కొరత వేధిస్తుంది. 2012 నుంచి నాలుగు హెల్త్ అసిస్టెంట్ల మేల్ పోస్టులు ఖాళీగా ఉంటూ వస్తున్నాయి. దేనికి తోడు మండల పరిధిలోగల వివిధ సబ్ సెంటర్లలో పోస్టులు కొరత తీవ్రంగా ఉంది. అయినా వైద్యశాఖ ఖాళీలను భర్తీ చేయడం లేదు. పోస్టులు కొరత వేధిస్తున్నప్పటికీ ఉన్న సిబ్బందితో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు సిబ్బంది అందిస్తున్నారు. బోనకల్ మండలంలో 22 గ్రామపంచాయతీలు, 9 సబ్ సెంటర్లు ఉన్నాయి. బోనకల్, చిరునోముల, ముష్టికుంట్ల, రావినూతల, గోవిందాపురం ఎల్, కలకోట, పెద్ద బీరవల్లి, బ్రాహ్మణపల్లి, మోటమర్రి గ్రామాలలో సబ్ సెంటర్లు ఉన్నాయి. బోనకల్ సబ్ సెంటర్లో రెండవ ఏఎన్ఎం పోస్టు గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉంటుంది. పెద్ద బీరవల్లి సబ్ సెంటర్లో మొదటి ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. మోటమర్రి సబ్ సెంటర్లో మొదటి ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. మోటమర్రి సబ్ సెంటర్లో ఏఎన్ఎం పోస్టు, గోవిందపురం ఎల్ సబ్ సెంటర్లో ఒకటవ ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉన్నాయి. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానంగా ఏడు పల్లె దవాఖానాలు (ఎంఎల్ హెచ్‌పి) ఉన్నాయి. పల్లె దవాఖానాలకు మెడికల్ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేశారు. అయితే కలకోట, బ్రాహ్మణపల్లి పల్లె దవాఖానాలకు మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా బ్రాహ్మణపల్లి, పెద్దబీరవల్లి, బోనకల్, మోటమర్రిలలో నాలుగు హెల్త్ అసిస్టెంట్ (మేల్) పురుషులు పోస్టులు 2012 నుంచి ఖాళీగా ఉన్నాయి. అంటే 13 సంవత్సరాల నుంచి ఈ నాలుగు ప్రధాన పోస్టులు ఖాళీగా ఉంటూ వస్తున్నాయి. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు నెలలగా స్వీపర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని, సిబ్బంది స్వీపర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల క్రితం స్వీపర్ ఆనందరావు గుండెపోటుతో మృతి చెందటంతో ఆ రోజు నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంటుంది. అదేవిధంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ఓ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇటీవల వరకు సిహెచ్ఓగా పనిచేసిన పెద్దినేని శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఖాళీ పోస్టని నేటి వరకు వైద్య శాఖ అధికారులు భర్తీ చేయలేదు. ఇది ఇలా ఉండగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయటం లేదు. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అయితే మండల ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి ఉన్న సిబ్బందితో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ వైద్య సేవలలో జిల్లాలోని అగ్రభాగాన ఉన్నారని వైద్య శాఖ ఉన్నతాధికారులే కితాబ్ ఇవ్వటం కూడా విశేషం. దేశ రాష్ట్రస్థాయిలో అనేక ఉత్తమ అవార్డులు పొందిన బోనకల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కొరతతో అవస్థలు పడుతుండటం జిల్లా వైద్యశాఖకే అవమానకరమని మండల ప్రజలు అంటున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అయితే మండల ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించే అవకాశం బోనకల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుందని, వెంటనే ఉన్నతాధికారులు ఖాళీ పోస్టులను భర్తీ చేసి రోగులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని మండల ప్రజల కోరుతున్నారు. గ్రామాలలో గల హెల్త్ సబ్ సెంటర్‌లకు రక్షణ కరువైంది. చిరునోముల, ముష్టికుంట్ల, బోనకల్ తదితర సబ్ సెంటర్లకు ప్రహరీ గోడ లేక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముష్టికుంట్ల సబ్ సెంటర్ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వర్షాకాలం వస్తే ఆ సబ్ సెంటర్ లోకి వర్షపు నీరు చేరి వైద్యం చేసే పరిస్థితి కూడా ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం వైద్యశాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేసి, అవసరమైన నిధులను మంజూరు చేయాలని మండల ప్రజల కోరుతున్నారు.

ఎర్రజెండా పోరాటాలతోనే... సమస్యలు పరిష్కారం





- ఎన్నికల హామీలను అమలు పరచాలి
- రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గత అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో అధికారం పొందడం కోసం ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులైన ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, గెలిచిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు పరచకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని, ఎర్రజెండా పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ప్రజలకు అన్నారు. ఈ నెల అంతా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించి వాటి పరి ష్కారానికి ధర్నాలు నిర్వహించాలని పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎర్రుపాలెం మండలంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలతో ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ప్రజలు కదలిరాగా ధర్నా కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ మన్నే ఉష శారదకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నున్నా నాగేశ్వరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక వాగ్దానాలు, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు పరుస్తానన్న ఆరు గ్యారెంటీలు అటక ఎక్కించారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి ఆరు గ్యారంటీల కార్డులను గ్రామాలలో ఇంటింటికి పంచిపెట్టి పెద్ద ఎత్తున ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చాక ప్రజలకి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు కాలం గడుస్తున్న ఒక్క హామీనీ కూడా అమలు పరచలేక విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అయ్యవారిగూడెం వ్యవసాయ సహకార పరపతి సంఘ పరిధిలోని 190 మంది రైతులకు సాంకేతిక లోపం నేపంతో వడ్డీ మాత్రమే రుణమాఫీ చేసి అసలు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రుణమాఫీ కోసం రైతుల పక్షాన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక దపాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించగా రుణమాఫీ సమస్య పరిష్కరించడంలో స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లాకు చెందిన మంత్రులు రైతులకు రుణమాఫీ కల్పించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు కలగజేసుకుని అయ్యవారిగూడెం సహకార పరపతి సంఘ రైతులకు 190 మందికి వెంటనే రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో రైతులను పెద్ద ఎత్తున ఖ మ్మం తరలించి డిసిసిపి బ్యాంక్‌ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఆ సంఘ సభ్యుడైన మందరపు వీరబాబు మృతిచెందగా రైతు భీమా రాలేదని, రైతు బీమాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నూటికి 70 శాతం మంది రైతులు వ్యవసాయం మీద ఆధార పడ్డారని, వారికి సరైన సదుపాయాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విఫలమైతున్నాయని విమర్శించారు. పండించిన పట్టుకు గిట్టు బాటు ధర లేక రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తిగా అమలు పరచలేదని రైతు భరోసా రైతులకు అందలేదని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందటం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని ఆవేదన వ్యక్తపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేలు నిర్వహించగా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలు కొట్ట వచ్చినట్లుగా కనపడుతున్నాయని, దీనికి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క నియోజకవర్గంలో స్థానికంగా అనేక సమస్యలతో ప్రజల కొట్టుమిట్టాడుతున్నారని, కట్లేరుకు నీళ్ల లేక రైతు పంటలు ఎండిపోతుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక దపాలుగా నిరసన, ధర్నా కార్యక్రమాలు చేస్తే తప్ప ఎండిపోతున్న రైతుల పంటలకు నీరు విడుదల చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటాలు తప్పవని, భవిష్యత్తులో ప్రజలను పెద్ద ఎత్తున సమకూర్చి మిలిటెన్ పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలకు తహసీల్దార్ ఉషా శారద అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కమిటీ సభ్యులు రామిశెట్టి సురేష్, ఆంగోతు వెంకటేశ్వర్లు, సగ్గుర్తి సంజీవరావు, నల్లమోతు హనుమంతరావు, దూదిగం బస వయ్య, గామాసు జోగయ్య, షేక్ నాగుల్ మీరా, మేడగాని తిరుపతిరావు, షేక్ లాలా, గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, కిషోర్, గురవయ్య, కూడెల్లి నాగేశ్వరరావు, మందడపు ప్రభాకర్, రామాల మోక్షానందం, గొర్రెరాజు రాములు, షేక్ ఫకీర్, కోటి సుబ్బారెడ్డి, లబ్ధి దారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హేతువాది ఐవీకి ఘన నివాళి

నవతెలంగాణ-ఖమ్మం


నగరంలోని రోటరీనగర్‌లో మరణించిన సైన్స్ –హేతువాదం పత్రిక సంపాదకుడు ఇంటి వెంకటేశ్వరరావుకు పలువురు ప్రముఖులు నివాళు లర్పించారు. ఐవిగా పిలువబడే ఇంటి వెంకటేశ్వరరావు (70)శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గత పదేళ్ళుగా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ హేతువాద ఉద్యమం నడుపుతున్నారు. సైన్స్–హేతువాదం పత్రిక సంపాదకులుగా ఒక దశాబ్ద కాలంగా పనిచేశారు. అభ్యుదయ వాదిగా పేరుంది. ఆయన మృతదేహం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఖమ్మంకు అందజేశారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఆమ్‌ఆద్మీపార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖ రచయితలు ఎస్.తిర్మల్, బుగ్గవీటి శ్రీధర్, రౌతు రవి, బివి రాఘవులు, కన్నెబోయిన అంజయ్య, బిసి సంఘం నాయకులు పాల్వంచ రామారావు, సీపీఐ(ఎం) నాయకులు జట్ల ఆనందరావు, జర్నలిస్టు రవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ జిల్లా అధికారులకు సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లా విద్యుత్ శాఖ అధికారిగా గత మూడు సంవత్సరాల నుంచి పనిచేసి బదిలీపై వరంగల్ వెళ్లిన సురేందర్, నూతనంగా జిల్లా విద్యుత్ అధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఇనుగుర్తి శ్రీనివాసాచారికి విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సన్మానం చేశారు. సురేందర్ జిల్లాలో విద్యుత్ శాఖ అభివృద్ధికి చేసిన సేవలను అందరూ కొనియాడారు. అదే విధంగా గతంలో పనిచేసి అనతి కాలంలో వరంగల్, హైదరాబాద్‌లో పనిచేసి ,విశేష అనుభవం గడించి నేడు మళ్ళీ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆత్మీయ ఆహ్వానం తెలుపుతూ విద్యుత్ శాఖను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా పనిచేయలాని ఉద్యోగులు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు జిల్లా లోని డివిజనల్ ఇంజనీర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.



'సర్వజ్ఞ'లో ఉగాది, రంజాన్ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని విడివోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో శనివారం ముందస్తుగా ఉగాది, రంజాన్ ఐక్యత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి. నాగేంద్ర కుమార్ మాట్లాడారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

2న ముత్తారం దేవాలయ భూములకు వేలంపాట

- దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రెంటాల సమంత

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో ముత్తారం సీతారామచంద్రస్వామి దేవాలయ భూములకు ఏప్రిల్ 2న దేవాలయ ఆవరణంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఇన్స్‌ఫెక్టర్ రెంటాల సమత శనివారం ప్రకటనలో తెలిపారు. సీతారామచంద్రస్వామి దేవాలయంకు 150 ఎకరాల భూమి ఉండగా,సేద్యమయ్యే భూమి సుమారు 102 ఎకరాలు ఉన్నదని ఆమె పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ. 20 వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొవాలని రెంటాల సమత చెప్పారు.

సీపీఐ(ఎం) పోరాటంతోనే.. వరద బాధితుల ఇంటి పన్నులు రద్దు

- ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించాలి
- పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



మున్నేరుకు వరదలు వచ్చిన కారణంగా రామన్నపేట నుంచి అగ్రహారం వరకు చాలా ప్రాంతాలు నీటి ముంపునకు గురి అయ్యాయని, వరద బాధితుల ఇంటి పన్నులు రద్దు చేయాలని సీపీఐ(ఎం) పోరాటం చేయడంతో పన్నులు రద్దు అయ్యాయని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం అన్నారు. శనివారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహించామని లక్ష రూపాయలు నష్టపరిహారం ఇప్పివ్వాలని ధర్నా నిర్వహించడంతో కొంతవరకు నష్టపరిహారం ఇప్పించగలిగామని తెలిపారు. ఇప్పుడు సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా నష్టానికి గురైన వారికి ఇంటి పన్ను రద్దు చేశారని, కట్టి ఉంటే మరల తిరిగి ఇస్తామని, కట్టకుంటే తీసుకోమని మున్సిపల్ అధికారులు తెలియజేశారని చెప్పారు. ఇలా సానుకూలంగా స్పందించినందుకు మున్సిపల్ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ పోరాటం ఫలితంగానే ప్రజలకు లాభం జరిగిందని అన్నారు. అంతేకాకుండా వరదలు వచ్చిన సందర్భంలో ప్రజలను ఆదుకోవడంలో, నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడంలో, మంత్రులను కలిసి సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలను సీపీఐ(ఎం) పరిష్కరించిందని అన్నారు. అంతేకాకుండా ఎల్ఆర్ఎస్ గడువు కూడా పెంచాలని పార్టీ డిమాండ్ చేస్తుందని, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని ఎల్ఆర్ఎస్‌లో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలో దరఖాస్తులు చేసుకున్న వాటిని అన్నిటినీ పరిష్కరించాలన్నారు. చెరువు శిఖం భూముల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని, కానీ వాటిని అమలు చేయటంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని, ఈ విషయం పైన మేయర్, మున్సిపల్ కమిషనర్ దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమామ్, ప్రవీణ్‌రెడ్డి, వజినపల్లి శ్రీనివాసరావు, వెల్లంపల్లి వెంకట్రావు, నల్లా రమేష్, నాయకులు పాల్గొన్నారు.

రామోజీ ఫిల్మ్ సిటీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- జాన్ వెస్లీ అక్రమ అరెస్టును ఖండించండి
- సీపీఐ(ఎం) త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



పేదల ఇండ్ల స్థలాలను భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, భూములు పరిశీలించటానికి పేదల పక్షాన వెళ్లి పోరాటం నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అక్రమ అరెస్టులు ఖండించాలని శనివారం సీపీఐ(ఎం) త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఫిష్ బొమ్మ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడారు. రామోజీ ఫిల్మ్ సిటీ పరిధిలోని 360 ఎకరాల్లో 870 పేద కుటుంబాలకు గత ప్రభుత్వం పట్టలిచ్చింది. ఆ భూమి దగ్గరికి పేదలను పోనీయకుండా అడ్డంగా గోడ కట్టిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం చర్యలను ఖండిస్తూ పట్టాలున్న పేదలు ప్రతిఘటించి చేస్తున్న పోరాటానికి అండగా వెళ్లిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీనీ స్థానిక పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పట్టా బూములున్న పేదలకు, ధనవంతులకు(రామోజీ ఫిల్మ్ సిటీ యజమాని) మధ్య జరుగుతున్న ఈ పోరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి పక్షాన ఉండాలనుకుంటున్నదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులు, వారి భూమి దగ్గరికి పోనీయకుండా అడ్డుకుంటున్న రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యాన్ని నిలువరించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పేద ప్రజలకు పట్టాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాస్‌రావు, 35వ డివిజన్ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, డివిజన్ కమిటీ సభ్యులు ఎస్‌కే.హిమం, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కే.సైదులు, యర్రా మల్లికార్జున్, త్రీ టౌన్ కమిటీ సభ్యులు వేల్పుల నాగేశ్వరరావు, పాశం సత్యనారాయణ, ఎస్కే.మస్తాన్, ఎస్కే అమీనా, జి.పున్నయ్య, బండారు సునీత, మీనాల మల్లికార్జున్, హెచ్.పీరయ్య, ఆంటోనీ, సోమనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-బోనకల్



రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు గుడిపూడి వెంకటేశ్వర్లు విమర్శించారు. సీపీఐ(ఎం) రామాపురం గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ముదు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుంకర నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమలకు అణువు గాని వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతూ మాయ మాటలతో మోసం చేస్తుందని విమర్శించారు. గూడు లేని నిరుపేదలకు 16 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క ఇందరమ్మ ఇల్లు ఇవ్వలేదని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ. 2500 ఇంతవరకు అమలుకు నోచుకోలేదని, రెండు లక్షల రుణమాఫీ సగానికి పైగా రైతులకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి గార్లపాటి రమేష్ మాజీ సర్పంచులు ఎడ్లపల్లి రామారావు, కొండ నాగేశ్వరరావు, నాయకులు గుడిపూడి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మేకల ఉప్పలయ్య, మేకల రామకృష్ణ, మేకల లక్ష్మీనారాయణ, కొమ్మినేని సైదేశ్వరరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



టీడబ్ల్యూ జేఎఫ్‌లో 15 మంది చేరిక

నవతెలంగాణ-ఖమ్మం

వివిధ పత్రికలు చానల్లో పనిచేస్తున్న జర్నలిస్టు సోదరులు శనివారం ఖమ్మంలో టీడబ్ల్యూజేఎఫ్‌లో సుమారు 15 మంది జర్నలిస్టులు సభ్యత్వం తీసుకొని తమ అభిప్రాయాలను టిడబ్ల్యుజేఎఫ్ నేతలతో పంచుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక యూనియన్ ఫెడరేషన్ అని తాము భావిస్తున్నామని, అందుకే తమ ఇష్టపూర్తిగా ఫెడరేషన్‌లో సభ్యత్వం తీసుకుంటున్నట్లు జర్నలిస్టు సోదరులు పేర్కొన్నారు. జర్నలిస్ట్ నగేష్ ఆధ్వర్యంలో 15 మంది జర్నలిస్టు సోదరులకు టీడబ్ల్యూ నేతలు జెఎఫ్ నేతలు శ్రీనివాసరెడ్డి సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, సివిఆర్ శ్రీనివాస్‌లు, యాకేష్, మానుకొండ రవి కిరణ్, సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు యాకేష్, జానీపాషా, అర్షద్, యాకూబ్ పాషా, యెగినాటి మాధవ్, సుభాన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ కిడ్జ్‌లో ఉగాది సంబురాలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం శ్రీ విశ్వా వసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రెజోనేన్స్ శ్రీనివాస నగర్ స్కూల్‌లో ఉగాది, రంజాన్ సంబురాలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని శ్రీనివాస నగర్ రెజోనేన్స్ స్కూల్ చిన్నారులు భక్తి శ్రద్ధలతో ఉగాది, రంజాన్ సంబురాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ ఆర్‌వి.నాగేంద్రకుమార్, నీలిమా మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయ, ఉపద్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ తోఫాలు పంపిణీ

ముదిగొండ : మండలపరిధిలో కమలాపురంలో ముస్లిం ఐక్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో 400 తోఫాలు నిరుపేద ముస్లిం కుటుంబాలకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య సంఘం మధిర సెంట్రల్ కమిటీ అధ్యక్షులు షేక్ మౌలానా ముజాహిద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ముస్లిం ఐక్య సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం మధిర సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్,ప్రధాన కార్యదర్శి గౌసిద్దీన్, సలహాదారుడు మస్తాన్, మండల అధ్యక్షులు షేక్ మహబూబ్, ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ రెహమాన్,జనరల్ సెక్రెటరీ షేక్ తాజుద్దీన్ బాబా, జాయింట్ సెక్రెటరీ షేక్ సలావుద్దీన్, కోశాధికారి షేక్ ఖాసిం, కమిటీ సభ్యులు షేక్ పాషా,సయ్యద్ సత్తార్మియ,పలు గ్రామాల మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అలరించిన ఉగాది కవి సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మం
శ్రీ విశ్వావసు నామ ఉగాది పండుగను స్వాగతిస్తూ తెలంగాణ సాహితీ నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. పలువురు కవులు 'సామాన్యుడు ఉగాది' అనే అంశంపై తమ కవితలు వినిపించారు. శనివారం ఖమ్మం లోని మంచికంటి మీటింగ్ హాల్‌లో సాయంత్రం ప్రముఖ కవి డాక్టర్ కటు కోజ్వల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనంలో పలువురు కవులు తమ గళాలను వినిపించారు. సభలో చిన్నారి బి.సుగంధిని రచించిన 'చిన్నారి చిట్టి కథలు' పుస్తకాన్ని సాహితీ పెద్దలు అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేకూరి శ్రీనివాసరావు, ప్రముఖ కవి జీవన్, టిపి ఎస్కె ఝాన్సీ కుమారి, ప్రముఖ కవయిత్రి వురిమళ్ల సునంద, వేముల సదానందం, కపిల రాం కుమార్, పసుమర్తి లక్ష్మణ్ రావు, మనోరమ, పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అంగన్‌వాడీలకు అవగాహన

నవతెలంగాణ-మధిర
మండలంలోని మాటూరుపేట, అంబర్పేట, ఇల్లూరు అంగన్వాడీ కేంద్రాలలో జరిగిన సెక్టార్ మీటింగ్లో హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు (కెవిఆర్), కోట అంజయ్య, సీడీపీఓ బాల త్రిపుర సుందరి అధ్యక్షతన అంగన్వాడీ టీచర్లకు మానవ హక్కులు-మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మానవ హక్కులను ప్రచారం చేయడానికి స్వచ్ఛందంగా మహిళలకు, విద్యార్థులకు, అంగన్వాడీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నమన్నారు. మహిళల హక్కులు, వినియోగదారుల హక్కులు, పోక్సో, బాల్య వివాహాలు మొదలగు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



రెజొనెన్స్ స్కూల్‌లో ఘనంగా 'ఉగాది' వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం
నగరంలోని శ్రీనగర్ కాలనీలో రెజొనెన్స్ స్కూల్లో తెలుగు సంవత్సరాది(ఉగాది) వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన తెలుగు సంవత్సరాది ఐన ఉగాది పండుగను విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి, మామిడి తోరణాలను తరగతి గదులకు అలంకరించి, నవ వసంతాన్ని స్వాగతిస్తూ షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తమ స్నేహితులకు, ఉపాధ్యాయులకు పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు మాట్లాడుతూ యుగానికి నాంది ఉగాది అని, ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పాడ్యమి నాడు ఎంతో భక్తిశ్రద్ధలతో తెలుగువారందరూ జరుపుకునే తొలి పండుగ అంటూ తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు ఆరు రుచుల కలయికతో ఉగాది పచ్చడి చేసి కుటుంబమంతా సేవించి, ఆ ఆరు రుచులను జీవితంలో వచ్చే కష్టసుఖాల కలయికగా భావించి ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొగల వ్యక్తిత్వాన్ని అలవాటు చేసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సానుభూతిపరుడు రామయ్య మృతి

- నివాళులర్పించిన పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్
మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరుడు జక్కుల రామయ్య(75) శనివారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. రామయ్య మృతదేహాన్ని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు. మృతుని మనవడు సూర్య ప్రకాష్ డీవైఎఫ్ఐలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, మండల నాయకులు నందిగామ కృష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు, షేక్.రంజాన్, మడిపల్లి వెంకన్న, జక్కంపూడి కృష్ణ, దొనకొండ ముత్తయ్య, మల్లెబోయిన రాజశేఖర్, కృష్ణస్వామి, కార్తీక్ తదితరులు ఉన్నారు.



ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

నవతెలంగాణ-కామేపల్లి
ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామంలోని కోట మైసమ్మ తల్లి దేవాలయంలో ఉగాది ఉత్సవాలను శనివారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఐకెపి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన టీ స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చిన్న కోరుకొండ గ్రామ కార్యదర్శిపై విచారణ

నవతెలంగాణ-కల్లూరు
చిన్న కోరుకొండి గ్రామ కార్యదర్శి విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించడం లేదని ఆ గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విచారణ జరపాలని ఎంపీడీవోను ఆదేశించడంతో ఎంపీడీవో డి.చంద్రశేఖర్, ఎంపీఓ రంజిత్ కుమార్ శనివారం విచారణ చేశారు. నివేదిక జిల్లా కలెక్టర్ పంపనట్లు వారు తెలిపారు.

నర్సిరెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్

నవతెలంగాణ-మధిర
మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చొరవతో దెందుకూరు గ్రామానికి చెందిన భీమనపల్లి వివేక్‌కు సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్ రావు ద్వారా చెక్కును శనివారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ ప్రజలకు వైద్య ఖర్చులు పెద్ద ఎత్తునపెరుగుతున్నాయని అన్నారు. ఈ ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్యాన్ని పేదలకు అందించే కృషి ప్రభుత్వం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మండల కార్యదర్శి మంద సైదులు, పార్టీ నాయకులు అనుమోలు భాస్కరరావు, దెందుకూరు



గ్రామ శాఖ కార్యదర్శి అల్లూరి నాగేశ్వరరావు మరియు ఇతరులు పాల్గొన్నారు.



"ఉగాది పచ్చడి తిందాం రాజ్యాంగ పఠనం చేద్దాం"

నవతెలంగాణ-ఖమ్మం
స్థానిక మంచి కంటి హాల్ నందు ఉగాది పండుగను పురస్కరించుకొని తెలంగాణ ప్రజా సంస్కృతి కేంద్రం (టీపీఎస్‌కే) ఖమ్మం ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠిక చదువుతూ చదివిస్తూ అందరితో ప్రతిజ్ఞ చేయించటం జరిగింది. మన దేశ భవిష్యత్తు అభివృద్ధి కోసం మనం ఒక ప్రణాళికను 75 సంవత్సరాల క్రితం రాసుకున్నాము అందులో హక్కులు, ఆదేశిక సూత్రాలు ప్రతి సంవత్సరం ఏ విధంగా సాధించుకోవాలో రాసి ఉంది. విశ్వావసు నామ తెలుగు సంవత్సరం నాడు రెండు తెలుగు రాష్ట్రాలు రాజ్యాంగ పరిరక్షణకై అదే పంచాంగ శ్రవణంగా భావిస్తూ తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం జిల్లా కన్వీనర్ పి ఝాన్సీ కుమారి పిలుపునిచ్చారు. ఈ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం నాడు కేంద్రం వ్యవసాయానికి మరింతగా బడ్జెట్‌ని కేటాయించి రెండు తెలుగు రాష్ట్రాలను సర్వతో ముఖంగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పిల్లలమర్రి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఇందులో వై.శ్రీనివాసరావు, అద్దంకి విప్లవ కుమార్, మల్లిక, వాసిరెడ్డి వీరభద్రం, సీతా, గుంటుపల్లి శ్రీదేవి, శివన్నారాయణ, మోహన్, వడ్లమూడి వెంకట్రావు రామకృష్ణ, రామారావు, కొండలరావు పాల్గొన్నారు.

రాజదాని బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొణిజర్ల
స్కూటీని బస్సు ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మండల పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన నంచర్ల శివయ్య చారి(58) పాలకోసం పాలకేంద్రానికి తన స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరి రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న రాజదాని ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో శివయ్య చారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శివయ్యకి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన రాజదాని బస్సుని స్టేషన్ కి తరలించి డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

వైరా చెరువు బజారును అభివృద్ధి చేసేదెప్పుడు..?

- మున్సిపాలిటీ సుడా నిధుల వినియోగం చేసుకుంటుందా?
- రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపునకు అఖిల పక్షం చేసిన పోరాటానికి ఫలితం ఎప్పుడు?
- పట్టణ ప్రజల మనసుల్లో మెదులుతున్న ప్రశ్నలు

నవతెలంగాణ-వైరా
రెండు సంవత్సరాల కిందట వైరా మున్సిపాలిటీకి సుడా (స్తంబాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) ఒక కీలకమైన రోడ్డు అభివృద్ధికి కోటి రూపాయలను మంజూరు చేసింది. అట్టి రోడ్డుకు అసలు మోక్షం ఉందా లేదా అన్న ప్రశ్నలు పట్టణ ప్రజల మెదళ్లను తొలుస్తున్నవి. ఈ రోడ్డు ఆక్రమణలు పోను మిగిలిన వంకర టింకరగా ఉన్న రోడ్డునే పూర్తి చేయాలని మున్సిపాలిటీ అప్పటి పాలక వర్గం పూనుకొంటున్న విషయం తెలుసుకున్న రాజకీయ పార్టీలు అఖిల పక్షంగా ఏర్పడి చెరువుకు వెళ్లేందుకు నైజాం సర్కార్ 100 అడుగుల రోడ్డు వేసిందని, ఆక్రమణలను తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసింది. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞాపనలు చేసింది. అధికారుల వత్తిడి కూడా పాలక వర్గం, అధికారులపై పడింది. ఆ మేరకు మెయిన్ రోడ్డుపై ఒక షాపు నిర్మించి అద్దెకిచ్చిన ఒక కౌన్సిలర్ రోడ్డు విస్తరణకు షాపును తొలగించాల్సిన పరిస్థితులను అఖిల పక్షం కల్పించింది. అందరూ భావించినట్లు నిజాం కాలం నాటి 100 అడుగులు లేదు కానీ అనేక తర్జన బర్జనల మధ్య 60 అడుగుల రోడ్డు నిర్మాణానికి అన్ని ఆక్రమణలను తొలగించారు. రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు రోడ్డును జెసిబీలతో చదును కూడా చేశారు. సంవత్సరం గడిచినా రోడ్డు నిర్మాణానికి పూనుకోలేదు.
రోడ్డును సదును చేసిన తర్వాత మరిచిపోవడంతో గతం కంటే అధ్వాన్నం అయింది. ఆ రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మత్స్య శాఖ కార్యాలయం, వైరా ప్రాజెక్ట్, మున్సిపల్ చెత్త వాహనాలు డంపింగ్ యార్డు కు వెళ్ళు రహదారి, ప్రయివేటు కోల్డ్ స్టోరేజి ప్రధానంగా ఉదయం సాయంత్రం వాకింగ్ కు వెళ్ళే వందల మందికి, ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే వారితో ఈ రోడ్డు ఎల్లవేళలా రద్దీగా ఉంటుంది. ఇప్పుడు వచ్చీ పోయే వాహనాల రద్దీతో దుమ్ము లేచి పోతుంది. జిల్లాలో ప్రస్తుతం ఒకటీ రెండు గ్రామపంచాయతీలను తప్ప మొత్తం జిల్లాను సుడా పరిధిలో చేర్చుకుంది. రెండు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీ లోని ఒక కీలకమైన రోడ్డుకు మంజూరు చేసిన కోటి రూపాయలను మున్సిపాలిటీ వినియోగించుకోలేక పోయిందని విమర్శలను నెత్తికెత్తుకుంది. ప్రతిపక్షమే లేని మున్సిపాలిటీ పాలన అసమర్థంగా సాగిందని, అందుకు నిదర్శనమే మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్ల రూపాయలలో 10 కోట్ల తో పనులు పూర్తి చేసే దశలో 10 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకు పోయినా పాలక వర్గానికి చీమ కుట్టినంత బాధకలగలేదు. అలాగే సుడా మంజూరు చేసిన కోటి రూపాయలు ఉన్నాయా, అవి కూడా వెనక్కి వెళ్ళాయా అన్న సందేహాలు పట్టణ ప్రజలకు



కలుగుతున్నవి.

10రోజుల్లో పనులు ప్రారంభిస్తాం
: కమిషనర్ చింతా వేణు

ఈ విషయమై నవతెలంగాణ మున్సిపల్ కమీషనరును వివరణ కోరింది. సుడా కోటి రూపాయలు మంజూరు చేసిన మాట నిజమే మనని, అట్టి రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయని నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు పూర్తి చేసుకుని పనులు ప్రారంభించుటకు రెడీగా ఉన్నట్లు కమీషనర్ చింతా వేణు తెలిపారు. రోడ్డు విస్తరణ, డివైడర్,సెంట్రల్ లైటింగ్‌తో సహా అన్ని హంగులతో నిర్మించుటకు 10రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి ఉద్యమాభివందనాలు

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి

నవతెలంగాణ-మధిర
ఎమ్మెల్సీగా నిజాయితీ, నిబద్ధతలతో ఆరేళ్ళు ఆదర్శవంతమైన పనితీరు కనబరిచి విద్యా, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి తనవంతు కృషి చేసి శనివారం రిటైర్ అయిన సందర్భంగా అలుగుబెల్లి నర్సిరెడ్డికి టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, మధిర ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఏ వినోద్ రావు లు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 317కు నిరసనగా జరిగిన ఉద్యమాల్లో అగ్రభాగాన నిలిచి పోరాడారన్నారు. దీర్ఘకాలం పెండింగ్లో ఉన్న సమస్యలైన పదోన్నతులు, బదిలీల సాధనకు నిరంతరం శ్రమించారన్నారు. జిఓ 317 స్పౌజ్ మరియు మ్యూచువల్ల బదిలీలకు చేసిన అనేక ప్రాతినిధ్యాలు, పోరాటాలు నేడు కార్యరూపం దాల్చాయన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో నిరంతరం గళం విప్పారన్నారు. అంతేకాక ప్రజా వేదిక- పౌరస్పందన ద్వారా నిరంతరం సమాజం కోసం పనిచేస్తున్నారని ఈ కృషి భవిష్యత్తులో మరింత విస్తృతం చేయాలని వారు అభిలాషించారు. ఈ ప్రకటనలో మధిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. నాగరాజు, ఈ.వీరయ్యలు ఒక ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా, సంఘ రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా, గౌరవ శాసనమండలి సభ్యునిగా ఆదర్శనీయంగా ఎలా ఉండాలో ఆచరణలో నిరూపించారన్నారు. మా అందరికీ రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. మధిర మండల శాఖ ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, కాజా సునీత, కోశాధికారి బి.చెన్నయ్య, ఎండి రఫీ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ మల్ల రాజు, కార్యదర్శులు జిబిఎంఎస్ రాణి, డి.కవిత, షేక్ లాల్ అహ్మద్, డి.భాస్కరరావు, వి.కొండలరావు, కె.రమేష్, ఎల్.నాగేశ్వరరావు, ఎస్. గోపిచంద్, పి.రాంబాబు, చేడె రాణి, ఎస్ కృష్ణాంజనేయులు, బి.రమేష్ బాబు, డి మహేంద్ర కుమార్‌లు ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో... ప్రతిరోజూ పండగే

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన

నవతెలంగాణ-ఖమ్మం
తెలంగాణ ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతిరోజూ పండగ రోజే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడిచిన 15 నెలల కాలంలో ఇందిరమ్మ ప్రభుత్వం చేసిన పాలనపై తెలంగాణ ప్రజలందరూ సంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కావాల్సిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతుందని తెలిపారు. మహిళల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు బంధుతో పాటు సన్నాలకు బోనస్ కల్పించిన ఘనత తమదేనన్నారు. ఇళ్లు లేని పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లను విడతల వారీగా మంజూరు చేస్తూ వస్తున్నామని దీనిపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువకుల ఉపాధి కోసం రాజీవ్ యువవికాస్ పేరుతో రూ. 50 వేల నుంచి రూ.4 లక్షల రుణం ఇచ్చే పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లోని సుమారు 5 లక్షల మందికి పైగా యువతకు ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న 'శ్రీ విశ్వావసు నామ' సంవత్సరంలోనూ ఇదే రకమైన పాలనను కొనసాగిస్తూ తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దరిచేరుస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



భూమిలేని పేదలకు... రూ.12వేలు అందిస్తాం

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టరు రాగమయి దయానంద్
- రుద్రాక్షపల్లిలో ఉపాధి కూలీలను కలుసుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సత్తుపల్లి
భూమిలేని పేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా యేడాదికి రూ.12వేలు కాంగ్రెస్ ప్రభుత్వం అందించనుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలో ఉపాధి కూలీలను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ శనివారం పనుల ప్రదేశం వద్ద కలుసుకొని వారితో మాట్లాడారు. ఉపాధి కూలీల సమస్యలపై ఇటీవల అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా మంచినీళ్లు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఎమ్మెల్యే ఆదేశించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే ముందుగానే సరిచేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా మరెన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందుతాయన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో రుద్రాక్షపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు బత్తుల భరత్‌కుమార్, ఒగ్గు భూపతిరెడ్డి, హలావత్ అర్జున్, దరావత్ కృష్ణ పాల్గొన్నారు.



ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం
తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం పార్టీ కార్యాలయంలో ఖమ్మం పార్లమెంట్ హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరిష్ చంద్ర అధ్యక్షతన ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం చేతుల మీదుగా కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయం నుండి డీజే పాటలతో ర్యాలీగా బయలుదేరి ఎన్టీఆర్ సర్కిల్ లోని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి, కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ రామనాథం మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఇదే రోజు మార్చి 29న 1982లో టిడిపి పార్టీని స్థాపించి 9 నెలల్లోనే 294 అసెంబ్లీ సీట్లలో 202 గెలుచుకొని పార్టీని అనతి కాలంలోనే ప్రభుత్వాన్ని చేపట్టడం వారికే సాధ్యం అయిందని అన్నారు. రూ. 2కే కిలో బియ్యం, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు, పింఛన్లు వంటివి పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు, మహిళలకు రాజకీయాల్లోనూ తండ్రీ ఆస్తిలో వాటా ఇచ్చి అనేక కొత్త పథకాలతో పలు సంస్కరణలు తీసుకొచ్చిందని, పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 10 సార్లు ఎన్నికలు జరగగా అందులో 6 సార్లు అధికారం చేజిక్కించుకుందని గర్వంగా తెలిపారు. అనంతరం పార్టీ కోసం శ్రమించిన సీనియర్ కార్యకర్తలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుత్తా సీతయ్య మంద వెంకటనారాయణ, చుండూరు రాజేశ్వరి, మల్లెంపాటి అప్పారావు, మేకల సత్యవతి, మీగడ రామారావు, మందపల్లి రజిని, చంద్ర రవికుమార్, నల్లమల రంజిత్, అబ్దుల్ మజీద్, పాలడుగు కృష్ణ ప్రసాద్, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, తీగుళ్ల రమణ, మురళి, జీజీబాతరాజు కనకయ్య, గుండెపిన్ని నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్, తాడిశెట్టి స్వాతి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.





హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియూ రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్

నవతెలంగాణ-వైరాటౌన్
హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటియూ రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో సిఐటియూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు అధ్యక్షతన హమాలీ కార్మికుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియూ రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ హమాలీ కార్మికుల జీవన పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కష్టపడితే వచ్చేది రెండు మూడు వందలేనని అన్నారు. హమాలీ కార్మికులకు ఎలాంటి ప్రభుత్వ సౌకర్యాలు కూడా లేవని, పని సమయంలో ఎలాంటి ప్రమాదం జరిగినా సంక్షేమ పథకాలు లేని కారణంగా వారు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం హమాలీ కార్మికులకు వయస్సు రీత్యా పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో వారికి అవకాశం కల్పించాలని, అలాగే హమాలీ కార్మికులకు ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా నాయకులు సుంకర సుధాకర్, ఎర్ర మల్లికార్జున్, హమాలీ కార్మికులు గిరి, శ్రీనివాసరెడ్డి, సైదులు, కృష్ణారావు, లింగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

నవతెలంగాణ కల్లూరు
జమాతే ఇస్లామీ హిందూ ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శనివారం ట్రస్ట్ నిర్వాహకులు సయ్యద్ అమిరుద్దీన్ ఆధ్వర్యంలో మిత్ర బృందం ఆర్థిక సహకారంతో పట్టణంలోని పేద ముస్లింలకు 50 వేల విలువ గల నిత్యవసర వస్తువులతో 100 మందికి రంజాన్ తోఫా ఆర్డీవో రాజేంద్ర గౌడ్ చేతుల మీదగా రంజాన్ తోఫా కిట్లను నిరుపేద ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మండల సదర్ సయ్యద్ అలీ, మజీద్ కమిటీ సదర్ ఎండి హనీఫ్, ఎస్‌డి జలాలుద్దీన్ ఎస్.కె కమ్లి, ఎస్‌డి ఇసాక్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

సీతారామ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆరు గ్యారంటీలు నీటి మూటలేనా..?



- ప్రజలను ఎంతకాలం మభ్య పెడతారు..?
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-కొత్తగూడెం

సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు పెంచి, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మంచికంటి భవన్‌లో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఉన్న సాగు భూములన్నింటికీ గోదావరి జలాలు సాధించడం కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా గోదావరి నీళ్ళు ఎలా తీసుకువస్తారని...? ప్రశ్నించారు. గోదావరికి గండి కొట్టడం వల్ల ఉపయోగం లేదన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలను భ్రమలకు గురి చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీలపై సమరశంఖం పూరించనున్న సీపీఐ(ఎం)

ఆరు గ్యారంటీలు-నీటి మూటలేనా...? ప్రజలను ఎంతకాలం మభ్య పెడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు సూటిగా ప్రశ్నించారు. రాబోయే కాలంలో ప్రభుత్వ హామీల అమలుకోసం పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముగ్గురు మంత్రులు ఉండి జిల్లా సాగునీటి ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం అదిక నిధులు సాధించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. ప్రతి గ్రామానికి వెళ్ళి సీపీఐ(ఎం) కార్యకర్తలు సమస్యలు అధ్యయనం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజె.రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్,



జిల్లా కమిటీ సభ్యులు బి.చిరంజీవి, వీర్ల రమేష్, నిమ్మల వెంకన్న, మర్మం చంద్రయ్య, గడ్డం స్వామి, ముదిగొండ రాంబాబు, గద్దల శ్రీనివాస్, ఎస్ఏ.నబీ, భూక్యా రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు, యాసా నరేష్, సత్రపల్లి సాంబశివ రావు, మోరంపూడి శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు పాయం నర్సింహారావు, మచ్చ రామారావు, ఆలేటి కిరణ్, పాకాలపాటి వెంకట్రావు, తులసీరాం, వాంకుడోత్ కోబల్, దుబ్బ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ



నవతెలంగాణ-కొత్తగూడెం

యువకులు దురువ్యసనాలకు దూరంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన లక్కినేని సత్యనారాయణను పవర్ హౌస్ జిమ్ నిర్వాహకులు, కోచ్ షమీఉద్దీన్ శాలువ, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్కినేని మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమమైన మార్గంలో వెళ్తూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా ధృఢంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. షమీ ఉద్దీన్ కోచ్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ నెగ్గడం, ఎన్నో ఏళ్ళుగా తన శిక్షణలో వందలాది మంది యువతి, యువకులను రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యెర్రా కామేష్, మారపాక రమేష్, నున్న శివ, అజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



తరుణ్ రెడ్డిని సన్మానించిన రెడ్డి సంక్షేమ సమాఖ్య

నవతెలంగాణ-మణుగూరు

రెడ్డి సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు వాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన తరుణ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. మణుగూరులోని రెడ్డి సంక్షేమ సమాఖ్య ఆఫీస్ నందు అధ్యక్షులు వాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తరుణ్ రెడ్డిని పూలబొకేతో ఆహ్వానించి శాలువా షీల్డ్, పూల దండతో సన్మానించారు. ఈ కార్యాక్రమంలో రెడ్డి సంక్షేమ సమాఖ్య చక్రటరీ ఆలేటి అశోక్ రెడ్డి, ట్రెజరర్ గాయం అవినాష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి, గణేష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి (రైస్ మిల్), బద్దం శ్రీనివాస రెడ్డి, సురేందర్ రెడ్డి, రాంరెడ్డి, గ్యాస్ కొండా రెడ్డి, రాఘవ రెడ్డి, ఉడుముల తిరుపతి రెడ్డి, దేవిరెడ్డి ఆదిరెడ్డి, కోట రాము, ఆదినారాయణ రెడ్డి, రెడ్డెమ్ శంకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మౌనిక బేకరీ రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు

- స్వామివారి నిత్య కల్యాణాలకు బ్రేక్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు విశ్వ వాసు నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి ఉగాది పర్వదినం నుండి ఏప్రిల్ 12 వరకు కొనసాగనున్నాయి. నేడు విశ్వ వాసు నామ సంవత్సరాది ఉగాది పండుగను సందర్భంగా ఉదయం ఉగాది ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి తొమ్మిది గంటల నుండి ఉత్సవాలను ఆరంభిస్తారు. ఇప్పటికే శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించి అంకురార్పణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన ఆలయ అర్చకులు పసుపు కొట్టి స్వామివారి కల్యాణ మహోత్సవ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. స్వామివారి కల్యాణ మహోత్సవాలకు వినియోగించే తలంబ్రాలను సైతం సిద్ధం చేస్తుండగా వివిధ ప్రాంతాల నుండి గోటితో ఒలిచిన తలంబ్రాలను స్వామివారికి భక్తులు



పాదయాత్రతో వచ్చి సమర్పిస్తున్న విషయం తెలిసిందే.

ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణ మహోత్సవం

సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 5వ తారీఖున ఎదుర్కోళ్ళు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారికి గరుడవాహ సేవను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 5000 నుండి 6000 వరకు భక్తులు హాజరవుతారన్న అంచనాలతో కావలసిన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఏప్రిల్ 6 ఉదయం 10:30 నుండి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించనున్నారు. సాయంత్రం శ్రీరామ పునరసు దీక్ష ప్రారంభం కానుంది. ఏప్రిల్ 7న స్వామివారికి మహా పట్టాభిషేకం రాష్ట్ర గవర్నర్ సమక్షంలో నిర్వహించి అనంతరం రాత్రి రథోత్సవం కార్యక్రమం జరగనుంది. ఈ సంవత్సరం స్వామివారి కల్యాణోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు క్యాబినెట్ మంత్రుల బృందం హాజరుకానున్న నేపథ్యంలో పలుమార్లు జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు కావలసిన సలహాలు, సూచనలు అందించారు.

నేటి నుండి నిత్య కల్యాణాలకు బ్రేక్

నేటి నుండి సీతారాముల తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతున్న నేపథ్యంలో స్వామివారి నిత్య కళ్యాణాలను ఆలయ అధికారులు నిలిపివేయనున్నారు. అంతే కాకుండా నేటి నుండి 12వ తేదీ వరకు దర్బార్ సేవలు కూడా నిలిపివేయడంతో పాటు ఏప్రిల్ 21 వరకు పవళింపు సేవలు కూడా నిలిచిపోనున్నవి. ఏప్రిల్ ఆరో తారీకు రామ భక్తులు శ్రీరామ పునరసు దీక్షను చేపట్టి మే మూడో తారీఖున దీక్ష విరమణ కార్యక్రమాన్ని నిర్వహించి ఉన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలి
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం బడ్జెట్‌లో 15% నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచలో యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15% కేటాయించాలని క్రమంగా దేనిని 20%కు పెంచాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం ప్రత్యేక కేంద్రీకరణ జరగాలని, పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బకాయి పడిన ఐదు వాయిదాల డీఏను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ పథకం సక్రమంగా అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి షేక్ పాషా, మండల అధ్యక్షుడు ఎ.విజయభాస్కర్, సీనియర్ నాయకులు బి.జానకి రాములు, ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం మండలంలో పర్యటించారు. ఈక్రమంలో మండలంలోని గండుగులపల్లి, సీతారా మపురం గ్రామ పంచాయతీలలో ముఖ్య మంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు ఆయన చేతులు మీదుగా అందించారు. రెడ్యాలపాడు గ్రామంలో మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించి ప్రస్తుత పరిస్థితిని గమనించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముష్టిబండ గ్రామంలో కుందుల ప్రభాకర్-పావని దంపతుల కుమారుడు ప్రణయ్ పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అదే గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన దాంట్ల శ్రీను కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించి ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

6వ దశ నిర్మాణ కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్



నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం ధర్మం పవర్ స్టేషన్ ఆరవ దశ నిర్మాణ కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్లో దీక్షలు చేపట్టిన 6వ దశ నిర్మాణంలో పనిచేసిన కార్మికుల నిరశన శిబిరం దగ్గరకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ దశ నిర్మాణంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి పునాది దగ్గరనుండి ఉత్పత్తి జరిగే వరకు పనిచేసిన కార్మికులను నిర్దాక్షిణ్యంగా బయటకు వెల్లగొట్టారని అన్నారు. సిఐటియు మిగతా కార్మికసంఘాలతో కలిసి ఆందోళన చేయగా 7 వదశలో వారిని మెయింటెనెన్సు క్యాజువల్ లేబర్‌గా తీసుకొంటామని హామీ ఇచ్చారు. కానీ హామీని అమలుచేయకుండా గ్రామసభలు ద్వారా నిర్మాణంతో సంబంధం లేనివారిని తీసుకొని వారికి ఆర్టిజన్లుగా అవకాశం కల్పించారాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేటీపీఎస్ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి నిర్మాణ కార్మికులుగా పనిచేసి ఉపాదిలేక ఇబ్బందులు పడే 418 మందిని బేషరతుగా ఆర్టిజన్లుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పాల్వంచ కార్యదర్శి కాతోజు సత్య, జెన్కో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంకిరెడ్డి, నరసింహ రావు, నిర్మాణ కార్మికుల నాయకుడు హాథిరామ్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఈవో పై చర్యలు శూన్యం



- బిల్డింగ్ పడిపోయిన ఘటనపై బాధ్యుల్ని శిక్షించాలి
- మాస్ లైన్ పార్టీ డిమాండ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గ్రామ పంచాయతీ ఈఓపై చర్యలు శూన్యమని, బిల్డింగ్ పడిపోయిన ఘటనపై బాధ్యుల్ని శిక్షించాలని సీపీఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రంగారెడ్డి, టీయూసీఐ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కె.కల్పన అన్నారు. పార్టీ ఆఫీసులో శనివారం ప్రెస్ మీట్ మునిగేలా శివ ప్రశాంత్ అధ్యక్షన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భద్రాచలం పట్టణంలో మార్చి 26 మధ్యాహ్నం రెండు గంటలకు ఆరు అంతస్తుల భవనం కుప్ప కూలిన ఘటనలో ఇద్దరు భవన నిర్మాణ కార్మిక మేస్త్రిలో ఉపేందర్, కామేశ్వరరావు మృతి చెందారన్నారు. భద్రాచలం షెడ్యూల్ ప్రాంతంలో ఉన్నందున బహుళా అంతస్తులు భవనాలు నిర్మించుట చట్ట విరుద్ధం అని అన్నారు. బిల్డింగ్ ఓనర్ శ్రీపతి శ్రీనివాసరావుకు విషయం తెలిసినా డబ్బులతో చట్టం ఉల్లంఘనకు పూనుకోవడం వల్ల ఇద్దరు కార్మికుల ప్రాణాలు కోల్పోవుటకు కారణమైనందున తనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని సహకరించిన గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్ పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎద్దులాపురం గోపాలరావు, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద బోయిన సతీష్, జిల్లా సహాయ కార్యదర్శి మునిగేల శివ ప్రశాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సోంపల్లి, అయోధ్య భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదానికి గురైన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి
- స్వచ్ఛంద సంస్థలు సహాయాన్ని అందివ్వాలి
- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణం రెవెన్యూ కాలనీలో శుక్రవారం సుమారు 9:30 సమయంలో సంభవించిన అగ్నిప్రమాదంలో కటారి సుబ్రహ్మణ్యం ఇల్లు పూర్తిగా అగ్నిప్రమాదంలో దగ్ధమైందని, బిల్డింగు కొంత భాగం ధ్వంసం అయిందని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. పార్టీ నాయకులు అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆ ఇంటిలో అద్దెకి ఉంటున్న కుటుంబం కూలీ చేసుకుని జీవనం గడిపే కుటుంబమని అగ్నిప్రమాదం వల్ల బట్టలు, వస్తువులు పూర్తిగా దగ్ధం అవడంతో కట్టుబట్టలతో రోడ్డుపైన పడ్డారన్నారు. వారికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, ఇల్లు ధ్వంసం అయినందున ఇంటి యజమానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల చిరకాల వాంఛ నెరవేరుస్తా

- 10 ఎకరాల 18 గుంటలకు రక్షణ కల్పిస్తా
- ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం
- దీక్ష శిబిరాన్ని సందర్శించి, దీక్షను విరమిపజేసిన ఎంఎల్ఏ కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా వుంటానని, వారి చిరకాల వాంఛ ఇంటి స్థలం ఇప్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గంగా బిసన్ బస్తీలో గత 10 రోజులుగా జర్నలిస్టులు చేస్తున్న ఇళ్ల స్థలాల సాధన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉద్యమాలకు తాను వ్యతిరేకం కాదని, ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేసారు. జర్నలిస్టు చేస్తున్న దీక్ష ఐక్యతను తీసుకు వచ్చిందని, ప్రభుత్వం జర్నలిస్టులకు ఇవ్వాలని అనుకున్న 10ఎకరాల 18గుంటల భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేయించి బోర్డు పెట్టించే పని చేపడతానని, ఆ తర్వాత భూమి జర్నలిస్టులకు ఎలా పంపిణీ చేయాలనే అంశంపై కలెక్టర్, యూనియన్‌లకు అతీతంగా కూర్చొని మాట్లాడి నిర్ణయం తీసుకుందామన్నారు. అనంతరం జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులతో మాట్లాడుతూ మీలోని ఐక్యత, ఇలా అందరూ ఒకదగ్గర చేరడం చూస్తుంటే నేను జర్నలిస్టుగా పని చేసిన రోజులు గుర్తుకు వస్తున్నాయని...గత స్మృతులు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, సీనియర్ పాత్రికేయులు జనుమాల రమేష్, టివి. నాగా చారి, కల్లోజి శ్రీనివాస్, డీ.వి, డి.రవీందర్, రవి, ప్రవీన్, తారక్, వీరు, దుర్గ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

నవతెలంగాణ-పినపాక

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందుతాయని గిర్దావర్ గణపతి అన్నారు. శనివారం ఉదయం తహసీల్దార్ అద్దంకి నరేష్ ఆదేశాలతో మండల కేంద్రంలో నూతనంగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సేకరించారు. దరఖాస్తుదారుల్లో అర్హులకు కచ్చితంగా ప్రభుత్వం నుండి రేషన్ కార్డులు అందుతాయని తెలిపారు. మధ్యదలారులను ఎవరు నమ్మవద్దని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హుల వివరాలను ఆన్లైన్ చేస్తున్నట్లుగా తెలియజేశారు.

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య



నవతెలంగాణ-దమ్మపేట

రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో తంగేళ్ళమూడి నాగు ఇంటి వద్ద పార్టీ మండల కమిటీ సమావేశం కొప్పుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పుల్లయ్య మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోనికి వస్తే 6 గ్యారంటీ పథకాలతో పాటు వ్యవసాయ కూలీలకు, మహిళలకు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని, విద్య వైద్యానికి పెద్ద పేట వేస్తామని ఇలా అనేక హామీల వర్షం కురిపించారని అన్నారు. ఇచ్చిన అన్ని అమలు చేసే వరకు పార్టీ ప్రజా పోరాటాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్‌రావు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎంబ్రాతి అప్పారావు, కొలికిపోగు శ్రీనివాసరావు, మొరంపూడి కేశవరావు, తంగెళ్ళమూడి రమేష్, జగన్నాథం శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | మార్చి 30, 2025 | www.navatelangana.com

యువవికాస్ పథకానికి గడువు తేదీని పెంచాలి

- జూలూరుపాడు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువవికాస్ పథకానికి ప్రధానంగా కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం నిరుద్యోగ యువతీ, యువకులు మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, అవి ఆఫీస్ కార్యాలయాల్లో గుట్టలుగుట్టలుగా పడివున్నాయని, గడువు తేదీని పెంచాలని సీపీఐ(ఎం) జూలూరుపాడు మండల కార్యదర్శి యాస నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటికీ వారం రోజులుగా నూతనంగా ఒక్క కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు ఇచ్చిన దాఖలాలు లేవు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సుమారుగా 1200 దరఖాస్తులు గుట్టలుగా పడివున్నాయన్నారు. ఏప్రిల్ ఐదో తారీకు చివరి రోజు అని ప్రభుత్వం చెబుతోందని, రేపటినుండి మూడు రోజులపాటు సెలవు దినాలు ఉన్నాయి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం నందు అడిగితే సర్వర్ పనిచేయట్లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారన్నారు. కావునా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకుల్ని కూడా రాజీవ్ యువ వికాస్ పథకానికి అర్హులుగా చేర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం గడువు తేదీని పెంచాలని ఆయన కోరారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- బాలుడికి తలలో నీరు చేరడంతో కుటుంబ సభ్యులు ఆందోళన
- తమ కుమారుని ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు



నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం సీతంపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బట్టా వెంకటేశ్వరి-రవి దంపతుల రెండవ కుమారుడైన గనన్ దీపక్ 11 నెలల చిన్నారుడికి తలలో నీరు చేరింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. గత మూడు నెలల నుండి బాలుడికి ఈ జబ్బు రావడంతో తల్లిదండ్రులు ఆనాటి నుండి ఆసుపత్రుల వెంట తిరుగుతూనే ఉన్నారు. కూలీ, నాలి చేసుకొని బతికే ఆ కుటుంబంలో బాలుడికి ఆరోగ్యం బాగ లేకపోవడంతో తల్లిదండ్రులు ఉన్నది మొత్తం అమ్మి బాలుని ఆరోగ్యానికి ఖర్చుపెట్టిన పరిస్థితి ఏర్పడింది. ఇక స్థోమత లేకపోవడంతో సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సహాయం చేసే స్వచ్ఛంద సంస్థలు కానీ, దాతలు ఎవరైనా ఉంటే 8309359189 నెంబర్‌కి ఫోన్ పే, గూగుల్ పే చేయాలని బాలుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విశ్వనాథం

- హర్షం వ్యక్తం చేసిన పాల్వంచ రైతు సంఘం కమిటీ



నవతెలంగాణ-పాల్వంచ

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 24 నుండి 27 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభలలో ఈ ఎన్నిక జరిగినట్లు రైతు సంఘం పాల్వంచ అధ్యక్ష, కార్యదర్శులు కొంగర అప్పారావు, బానోత్ రంజిత్ తలిపారు. ముత్యాల విశ్వనాథంతో పాటు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చంద్ర నరేంద్రే కుమార్‌ను, రాష్ట్ర సమితి సభ్యులుగా కుమారి హనుమంతరావు, నరాటి రమేష్, గిరి, వాడే లక్ష్మి ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జరుపుల మోహన్, బాదే చెన్నయ్య, ఎడవల్లి క్రిష్ణ, భీమా నాయక్, ఆడెపు పెద్ద వెంకట్రామయ్య, అంగోత్ బాలాజీ, ఈసం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత కార్డులో పేరు లేదు...కొత్తది రాకపాయే

రాజీవ్ యువ వికాసంకు అడ్డంకిగా మారిన రేషన్ కార్డు

- ఈ ఉగాది కైనా రేషన్ కార్డులు అందేనా



నవతెలంగాణ-పినపాక

రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం పెట్టిన రేషన్ కార్డు నిబంధన లబ్ధిదారులకు పెను ఆటకంగా మారింది. గత పది సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డులు రాక, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పుడు వస్తాయో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలిగే నక్క పై తాటికాయ పడ్డట్టుగా యువతకు రేషన్ కార్డ్ నిబంధన తీవ్ర ఆవేదనకు గురిచేస్తుంది. కొత్త రేషన్ కార్డులు గత మూడు నెలలుగా ప్రజా ప్రభుత్వం అందిస్తానని చెబుతున్న ఇంతవరకు ఆ ఊసే లేదు. నేడు ఉగాది సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా అందుతాయో లేదో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. రేషన్ కార్డు లేకపోతే రాజీవ్ యువ వికాసానికి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదు. ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు నెంబర్ టైప్ చేయగానే ఆటోమేటిగ్‌గా రేషన్ కార్డ్ నెంబర్ కూడా కనిపిస్తుంది. దీనితో ప్రభుత్వం అందిస్తాను అని చెబుతున్న రాజీవ్ యువ వికాసం పథకం యువతను ఊసూరుమనిపిస్తున్నది. కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమేగాక, రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హులని సర్కారు షరతులు విధించడమే అందుకు కారణం అవుతుంది. ఈ పథకానికి సంబంధించి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు స్వీకరించి, జూన్ 2లోపు లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తామని సర్కారు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. కొత్త రేషన్ కార్డులు ఈనెల అందితే లబ్ధిదారులకు చాలామందికి ప్రయోజనంగా ఉండే అవకాశం ఉంది. గత పది రోజుల నుండి దరఖాస్తులు ప్రారంభం అయ్యాయి. కానీ చాలామంది దీనికోసం అప్లై చేసుకోలేక పోతున్నారు. అందుకు కారణం రేషన్ కార్డులు. రేషన్ కార్డులో పేరులేని వారు దీనికి అనర్హులా... అర్హులా అన్నది ప్రభుత్వం ప్రకటించాల్సిన అవసరం ఉన్నది. కొత్త కార్డు కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండటం లేదు. డీఎస్‌ఓ పెండింగ్ ఉండడంతో దీంతో చాలామంది నష్టపోతున్నారు. తహసీల్దార్లు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చాలామందికి పెళ్లిళ్లు అయ్యాయి. కల్యాణ లక్ష్మి పథకాన్ని సైతం అందుకున్నారు. దీంతో నూతన జంటలు కొత్త రేషన్ కార్డులు రావడం కోసం తమతమ కుటుంబాలకు రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించుకున్నారు. కొత్త కార్డుల కోసం అప్లై చేశారు. కానీ అవి ఇప్పటివరకు రాలేదు. గత ప్రభుత్వంలో వీటి ఊసే లేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించింది. మళ్లీ మీసేవా కేంద్రాల ద్వారా అప్లై చేసుకునే వెసులుబాటు కల్పించింది. కానీ కొత్త కార్డులు ఇంకా జారీ చేయలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వకాలం నుంచి కొత్త కార్డులు అందించకపోగా చేర్పులు, మార్పులకు నోచుకోని పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి హామీ ఇచ్చినా ప్రకటనలే తప్ప సరైన స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాత రేషన్‌కార్డులో పేరు డిలీట్ కావడంతో ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలు పొందలేకపోతున్నామని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు ఉన్న పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నా లేని పేదల సంగతేమిటనే ప్రశ్న పెను సవాలుగా మారింది. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా కనీసం ఆ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పేదలు నష్టపోతున్నారు.

మాగంటి కళాపీఠం ఆధ్వర్యంలో కవి గాయక సమ్మేళనం

40 మంది కవులతో మనోరంజకంగా సాగిన కవి సమ్మేళనం

- మాగంటి సూర్యం స్ఫూర్తితో కళలను, కళాకారులను ప్రోత్సహిస్తున్నాం
- లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల కో డైరెక్టర్ సాయి సూర్య



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ విశ్వ వాసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు కలలు, కళాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో శ్రీ మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన కవి గాయక సమ్మేళనం మనోరంజకంగా కొనసాగింది. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల కో డైరెక్టర్ మాగంటి సాయి సూర్య నేతృత్వంలో నిర్వహించిన ఈ కవి గాయక సమ్మేళన కార్యక్రమానికి సుమారు 40 మంది కవులు కళాకారులు హాజరై ఉగాది ప్రత్యేకతను తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కవితలను తెలుగు భాషా ప్రాముఖ్యతను తెలియపరిచే పద్యాలను పాడి అర్థాలను వివరించి తెలుగు భాష గొప్పతనాన్ని తెలుగు నామ సంవత్సర ప్రత్యేకతను ఉగాదికి ఉన్న విశిష్టతను తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ ప్రేమికులు గొల్ల భూపతి రావు అధ్యక్షత వహించగా విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు తిప్పన సిద్దులు, ప్రముఖ కవయిత్రి చిట్టి లలితలు మాట్లాడారు. మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే విధంగా మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల వారు ఇటువంటి కవి సమ్మేళనాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా జీవితంలో ఉగాది రుచులదిరిగానే సంతోషాలు, సుఖాలు, కష్టాలు, దుఃఖాలు సమపాలనలో ఉంటాయని తెలియపరచటమే ఉగాది ప్రత్యేకత అని అన్నారు.

మాగంటి సూర్యం జీవించిన కాలంలో కళాకారులను, కవులను అనేక సందర్భాలలో ప్రోత్సహిస్తూ సాహితీ స్రవంతి మాగంటి కళాపీఠంలతో పాటు భద్రాద్రి కళావేదికలను ప్రోత్సహిస్తూ మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలిసే విధంగా ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కవులు, కళాకారులు వివిధ అంశాలపై తమ కవితలను పాటలను వినిపించగా హాజరైన కవులందరినీ మాగంటి కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పామరాజు తిరుమలరావు, కవి ప్రసాద్, ఎర్రంశెట్టి పూర్ణిమ, తదితర కవులు, కళాకారులు పాల్గొన్నారు.

మాగంటి సూర్యం స్ఫూర్తితో తెలుగు కళా రంగ అభివృద్ధికి కృషి చేస్తాం

లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల కో డైరెక్టర్ మాగంటి సాయి సూర్య



కళలు అన్నా కళాకారులు అన్న మాగంటి సూర్యంకి అమితమైన ప్రేమ అనురాగాలు ఉండేవి కళాకారులను ప్రోత్సహించేందుకు లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆవరణలో అనేక కళా సమ్మేళనాలు ఇష్ట గోస్టులు కవితా చర్చ కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించేవారు. ఎంతోమంది ఏజెన్సీ ప్రాంత కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చి వారి ప్రతిభను ప్రపంచానికి తెలిసేలాగా మాగంటి సూర్యం కృషి చేశారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుండి కళాకారులను కవులను భద్రాచలం తీసుకువచ్చి వారి ప్రతిభను ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేయడంలో మాగంటి సూర్యం కృషి మరువలేనిది. మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో అనేక రకాల కళాసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తెలుగు భాష ప్రాముఖ్యతను తెలుగు నామ సంవత్సరం ప్రత్యేకతను ఉగాది వంటి తెలుగు సంవత్సరాది విశిష్టతను నేటితరం వారికి తెలిసేందుకు ఇటువంటి కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సుమారు 40 మంది కవులు, కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి ఉగాది విశిష్టతను తెలియజేశారు. భవిష్యత్తులో మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో మరిన్ని కళా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాము.



కార్పొరేషన్ ఏర్పాటు కావడం శుభపరిణామం

- అన్ని వ్యవస్థలు పెరిగే అవకాశం ఉంది
- అభివృద్ధికి రూ.250 కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తుంది
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు కావడం శుభపరిణామని, కార్పొరేషన్ ఏర్పాటు వలన అన్ని వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందని, కార్పొరేషన్ ద్వారా అభివృద్ధికి రూ.250 కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్‌లోని ఏడు పంచాయతీలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. దీని ద్వారా రూ.250 కోట్ల నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని చెప్పారు. కొత్తగూడెం, పాల్వంచలోని డిగ్రీ కళాశాల ఆధునికరణకు రూ.4 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఇప్పటికే సుజాతనగర్‌లో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చిందని, సుమారు రూ.74 కోట్లతో భవన నిర్మాణం జరగనున్నట్లు తెలిపారు. కొత్తగూడెంలో ఉన్న మైనింగ్ కళాశాలను అప్డేట్ చేస్తూ ఎర్త్ యూనివర్సిటీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇది గర్వకారణమన్నారు. పాల్వంచ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లను నియోజకవర్గంలోని సాగుకు అనువుగా అందే విధంగా కృషి చేయనున్నట్లు, కొత్తగూడెం నియోజకవర్గంలో 250 ఎకరాల్లో జూ పార్క్ ఏర్పాటుకు అనుమతులు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే సంబంధిత అటవీశాఖ ఢిల్లీకి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు విషయంలో కొంత టెక్నికల్ సమస్య ఉన్నప్పటికీ మరో కోణంలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి జరుగుతుందని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్ పాష, రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాస్, దుర్గరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, వీర స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-దమ్మపేట

తెలంగాణ రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాలు ముగించుకొని ఇంటికి విచ్చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణను యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాక రమేష్ శాలువాతో సత్కరించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అదే విధంగా శాసన సభలో ద్రవ్య వినిమయ బిల్లు గురించి మాట్లాడటం, మరొక ప్రత్యేక విషయం డిమాండ్స్ సందర్భంలో శాసన సభలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకి మాట్లాడే అవకాశం రావడం గొప్ప విషయం. నియోజకవర్గ అభివృద్ధికి, శాంతి భద్రతలకు కావాల్సిన సదుపాయాలను, నిధులను కల్పించాలని జిల్లా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి, నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించడం విశేషం అని అన్నారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యేకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, వాసం శ్రీను, పీఏ నరేష్, కొర్స సాగర్, మడకం రాజేష్, తంగెళ్ళ విశ్వనాథ్, చంద్రశేఖర్, కామేశ్వరరావు, నందిగాం గౌతం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారెను కలిసిన ఉపాధ్యాయ గృహ నిర్మాణ సంఘు నాయకులు

జిల్లా ఉపాధ్యాయ పరస్పర సహాయక సహకార గృహ నిర్మాణ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మండలంలోని గండుగులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జారెను కలుసుకున్న వారు ప్రభుత్వ నామినల్ ధరలతో ఇంటిస్థలాలకై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గల ప్రత్యేక చట్టాలు, భూమి పట్టా డీడ్ సరిగా లేకపోవడం తదితర కారణాల దృష్ట్యా జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటి నిర్మాణానికి హౌసింగ్ లోన్స్ మంజూరి నిర్మించుకోలేకపోతున్నారని అన్నారు. కొందరు టీచర్‌లు అధికవడ్డీలకు తెచ్చి ఇబ్బందులు పడుతున్నారని మరికొందరు వలస వెళ్ళి ఖమ్మం పరిసర ప్రాంతాల్లో ఇంటినిర్మాణం చేస్తున్నారని అన్నారు. కావునా ఈ జిల్లాలో పనిచేస్తున్న గిరిజన, గిరిజనేతర ఉపాధ్యాయులకు ప్రభుత్వ నామినల్ ధరతో ఇంటి స్థలాలు కేటాయించేందుకు కృషిచేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దేవరపు వెంకటేశ్వరావు, బణోత్ రవి, వాకా వెంకటేశ్వరావు, జంగా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి నిర్మించిన భవనాలను కూల్చివేయాలి

నవతెలంగాణ-పాల్వంచ



భద్రాచలంలో ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆదివాసీ అడ్వకేట్ అసోసియేషన్ నాయకులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వితేష్ వి.పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భద్రాచలం పట్టణంలోని ఎలాంటి అనుమతులు లేకుండా, ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి కొంతమంది వలస గిరిజనేతర వ్యక్తులు వ్యాపారాల నిమిత్తం 6, 7 బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారని అన్నారు. ఇప్పటికే కొన్ని నిర్మించి ఉన్నాయని వాటిని కుల్చివేయాలి డిమాండ్ చేశారు. పట్టణంలోని గిరజనేతరులు నిర్మించే గృహాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో రెగ్యులేషన్ 1/70 నిభందనలకు లోబడి మాత్రమే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ నెల 26న భద్రాచలం పట్టణంలో 6 అంతస్తుల భవనం కూలిన సంఘటనకు సంబంధించి సదరు యజమాని శ్రీపతి శ్రీనివాస్, అతనికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి కోరారు. ఇప్పటికే సత్రాల పేరుతో నిర్మించిన వాటిలో వ్యాపారాలు చేస్తున్నారని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. దీంతో .స్పందించిన కలెక్టర్ కచ్చితంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. పాయం రవివర్మ, దనసరి నరసింహారావు, వలవల సురేష్, పూనెం వీరభద్రం, పూనెం కృష్ణ దొర, ముర్ల రమేష్ రెడ్డి, పూనెం నాగేశ్వరరావు, కోర్స చిన్నబాబు దొర, జగ్గా పుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తాయి

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దొడ్డి భద్రయ్య



నవతెలంగాణ-మణుగూరు

నేటి సమాజంలో అత్యంత ప్రమాదకరంగా మారి యువత భవిష్యత్తును వినాశనం చేస్తున్న డ్రగ్స్ పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని లేనిపక్షంలో యువత కోలుకోలేని నష్టాన్ని పొందాల్సి వస్తుందని డ్రగ్స్ వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కిక్ బ్యూరో సహకారంతో ప్రచారం సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత యువశక్తి కలిగిన భారతదేశంలో నేడు డ్రగ్స్ మహమ్మారి యువత శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం చేస్తుందని, దాని పట్ల జాగ్రత్తగా ఉంటే మంచి భవిష్యత్తు విద్యార్థులకు లభించే అవకాశం ఉందని ప్రిన్సిపల్ అన్నారు. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా డ్రగ్ చేకూర్చే నష్టాన్ని తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాల్య, డాక్టర్ రమేష్ బాబు, రామ తిరుపతి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సాంబమూర్తి, నాగిరెడ్డి, డాక్టర్ అశోక్, జబ్బర్, సతీష్, శిరీష, నవీన, నవీన్, శ్రీకళ, నరసింహారావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మనపల్లిలో ముందస్తు ఉగాది సంబురాలు

నవతెలంగాణ-టేకులపల్లి

బాల్య దశ నుంచే విద్యార్థుల్లో మన సంస్కృతి, సాంప్రదాయాలను ఎల్లప్పుడూ కొనసాగించే ఆలోచనతో ఉగాది పండుగ ప్రాముఖ్యత, కొత్త తెలుగు సంవత్సరాది గురించి విద్యార్థులకు చాటి చెప్పే విధంగా బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది సంబురాలు శనివారం నిర్వహించారు. ఉగాది ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఉగాది పచ్చడిని తయారుచేసి, విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. హెచ్ఎం ఎం.జ్యోతిరాణి విద్యార్థులకు ఉగాది పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. టీచర్ జర్పుల పద్మ ఎండీమ్ నిర్వాహకులు సరోజ, పార్వతిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక కౌంటర్స్

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం పట్టణ ప్రజలు చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, నల్లా బిల్లుల చెల్లింపుకు సంబంధించి వెంటనే చెల్లించాలని, 30వ తేదీ ఉగాది పండగ, 31వ తేదీ రంజాన్ పండుగ సెలవు దినములు అయినప్పటికీ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత తెలిపారు. కావునా పట్టణ ప్రజలు ఇట్టి కౌంటర్ నందు ఆస్థి పన్నులు, నల్లా బిల్లులు చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నులు,

ప్రభుత్వ బడులను కాపాడుకోవడం మనందరి బాధ్యత

పినపాక : ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్య అందిస్తున్నామని ఎంఈఓ నాగయ్య అన్నారు. శనివారం పినపాక మండలం ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో విద్యార్థుల ఇండ్లకు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ పాల్వంచ

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నట విశ్వవిఖ్యాత సార్వభౌముడు నందమూరి తారక రామారావు విగ్రహం దగ్గర పట్టణ నాయకుడు కళ్యాణం లక్ష్మీపతి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం నియోజకవర్గం కన్వీనర్ శ్రీకాపా కృష్ణమోహన్ పాల్గొని అన్నగారికి పూలమాలతో నివాళి అర్పించారు. నేడు వారి అడుగుజాడల్లో జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు, మహిళలకు అభివృద్ధికి పాటుపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వడ్లమూడి పూర్ణచంద్రరావు, కత్తి శీను, కనగల చిన్న, అనంతరాములు, మండల పార్టీ నాయకుడు వై.ఆర్.అప్పారావు, ట్రేడ్ యూనియన్ నాయకుడు కట్టా శ్రీధర్, బీసీ నాయకులు పగిడిలా వెంకటేశ్వరరావు, రత్నాకర్, ఎస్టి నాయకులు బాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నాయుడుపేట జంక్షన్‌లో స్వర్గీయ ఎన్‌టి రామారావు విగ్రహం దగ్గర సీనియర్ టిడిపి నాయకులు ఎలమంచిలి అప్పయ్య, నారం సుబ్బారావుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డ చిన సత్యనారాయణ (చిన్న సత్యం), సాయిల రామారావు, పార్టీ మండల కార్యదర్శి మట్టా స్టాలిన్, దొడ్డ సుమన్, ములకలపాటి ప్రసాద్, బాల శీను, బాల రామారావు, మాదాల శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

గండుగులపల్లిలో : గండుగులపల్లిలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వట్టి రమేష్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండి వలీపాషా తెలుగు రైతు అధ్యక్షులు గడ్డిపాటి సత్యనారాయణ, సొసైటీ ఉపాధ్యక్షులు కట్టం ఎర్రప్ప, పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : నియోజక వర్గం భాద్యులు కట్రం స్వామి దొర నేతృత్వం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోడ్ల ప్రధాన కూడలిలో గల పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు భారీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించిననంతరం పార్టీ మండల అధ్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యకర్తలు బాణసంచా కాల్చి,స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో అంకోలు వెంకటేశ్వరరావు, ఉప్పల బ్రహ్మేంద్ర రావు, ప్రసాదు, బన్ను, రామకృష్ణ, రమాదేవి, బుచ్చి రాజు, ఉదయ్ కుమార్, సురేష్, సాయి, వెంకటేశ్వరరావు, మల్లేష్‌లు పాల్గొన్నారు.

పినపాక తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో అద్భుతమైన విజయంతో ఎవరూ చెరపలేని రికార్డు అని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ధర్మరాజుల శంకర్ అన్నారు. శనివారం జానంపేట ప్రధాన రహదారిపై గల ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలను వేసి నివాళులర్పించి, మాట్లాడారు. అనంతరం గ్రామ పెద్దలు వెంకన్న చౌదరి, శంకర్రావు, ప్రతాపరెడ్డి, శ్రీను ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక

భద్రాచలంలో భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం కూలిన ఘటన పైన పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలన్నారు.

జర్నలిస్టులకు టీడబ్ల్యూజేఎఫ్ పరామర్శ



నవతెలంగాణ-ఖమ్మం

ఎన్టీవి టౌన్ రిపోర్టర్ సాయి, దిశ పత్రిక జర్నలిస్ట్ ఉపేందర్‌లు ఖమ్మం నగరంలో రోడ్డు ప్రమాదంలో గాయాలపాలు కావడంతో సమాచారం తెలుసుకున్న టీడబ్ల్యూజేఎఫ్ బృందం హుటాహుటిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు సమాచారం అందించి మెరుగైన వైద్య సేవలు అందించాలని టిడబ్ల్యూజేఎఫ్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సివిఆర్ శ్రీనివాస్, యాకేశ్, జానిపాషా, సుభాన్, మూర్తి తదితరులు ఉన్నారు.

శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్పర్సన్ నిష్టాశర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి .శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుధా హెర్బల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో... చిరు వ్యాపారులకు స్టాండ్ గొడుగులు అందజేత

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆ ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టరు కొనకళ్ల సుధారాణి పట్టణంలో రహదారిపై చిరు వ్యాపారాలు చేసుకొనే వారికి శనివారం స్టాండ్ గొడుగులను అందించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పండ్లు అమ్ముకోవడానికి సత్తుపల్లికి వస్తూ రోడ్డు పక్కగా ఎండలోనే నిలబడి వ్యాపారాలు చేసుకుంటూ ఎండ వేడిమితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో గొడుగులు కొనుక్కొనే స్తోమత లేకుండా పోయిందన్నారు. నేపథ్యంలో ట్రస్ట్ తరపున స్టాండ్ గొడుగులు కొనుగోలు చేసి వారికి అందించినట్లు సుధారాణి చెప్పారు. గొడుగులు అందుకున్న చిరు వ్యాపారులు సుధారాణికి ధన్యవాదాలు తెలిపారు.

బీటెక్ ఫైనలియర్ ఫస్ట్ సెమిస్టరు ఫలితాల్లో... ఉమ్మడి జిల్లాలోనే అగ్రస్థానంలో 'సాయిస్ఫూర్తి' విద్యార్థులు

- అభినందనలు తెలిపిన ఎంపీ డాక్టరు బండి పార్థసారథిరెడ్డి



నవతెలంగాణ-సత్తుపల్లి

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్ టీయూహెచ్) శనివారం ప్రకటించిన బీటెక్ నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టరు ఫలితాల్లో సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచి కళాశాల ఘనతను పునరావృతం చేశారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఊటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. విద్యార్థులు సాధించిన ఫలితాలు సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (ఎస్‌జీపీఏ)ను బ్రాంచీల వారీగా ప్రిన్సిపాల్ విడుదల చేశారు. ట్రిపుల్‌ఈ విభాగంలో వాడపల్లి అనూష 8.38/10, నిమ్మటూరి హేమ మాళవిక 8.05/10 ఎస్‌జీపీఏను సాధించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో దేవత మోక్షిత్ 8.43/10, కర్రి శామ్యూల్ 7.71/10, ఈసీఈ విభాగంలో రిమ్మనపూడి చైత్రిక 8.67/10, షేక్ కరిష్మా 8.48/10, తాళ్ల వేణు 8.48/10, గోనెల స్వాతి 8.43/10, కొత్తూరు చంద్రిక 8.43/10, ఊకే భవాని 8.43/10, క్షత్రియ హేమంత్ సింగ్ 8.81/10, పానుగంటి అభినయ 8.62/10, చల్లపల్లి కావ్య 8.52/10 చొప్పున ఎస్‌జీపీఏను సాధించారు. సీఎస్ఎం విభాగంలో సయ్యద్ రుమానా తహ్రీన్ 8.62/10, కడెం నవ్య 8.52/10, దాసరి ఆకాంక్ష 8.48/10, వంకదారు కీర్తి 8.48/10 చొప్పున ఎస్‌జీపీఏను సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టరు వీఎస్ఆర్ కుమారి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎంపీ డాక్టరు బండి పార్థసారథిరెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను ఆ కళాశాల ఛైర్మెన్, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, రాజ్యసభ సభ్యులు డాక్టరు బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా అభినందించారు. ఉత్తమ ఫలితాలు రావడానికి అధ్యాపకులు, తల్లిదండ్రుల కృషి అభినందనీయమన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ జేఎన్‌టీయూహెచ్ పరిధిలో మంచి అకడమిక్ ఎక్స్‌లెన్స్‌ను సాధించే అతికొద్ది కళాశాలల్లో సాయిస్ఫూర్తి కళాశాల ఉండటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను దాసరి అభినందించారు. కళాశాల పరీక్షల విభాగాధిపతి డాక్టరు పాముల శేఖర్‌బాబు మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను శేఖర్‌బాబుతో పాటు అన్ని ఇంజినీరింగ్ విభాగాల హెచ్‌ఓడీలు అభినందించారు.



విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శనివారం స్పెషల్ సబ్ జైలు భద్రాచలంను సందర్శించారు. ఈ సందర్భంగా విచారణ ఖైదీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన నేరాలతో ఖైదీలుగా మారి జైలు జీవితం గడపాల్సి వస్తుందని తద్వారా తమ విలువైన భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్నటువంటి ఖైదీలను విచారించి న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదులకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. జైలు పరిసరాలు, ఖైదీలకు వడ్డించే ఆహారం, సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితిల గురించి విచారించారు. ఖైదీలలో మార్పుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు పాల్గొన్నారు.

'త్రివేణి'లో ఘనంగా పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని త్రివేణి పాఠశాలలో ఉగాది పండుగ సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పూజానంతరం పురోహితులు పంచాంగ శ్రవణం చేయించారు. అనంతరం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా ఇచ్చారు. ఈ సందర్భంగా పురోహితులు ఉగాది పండుగ , ప్రాశస్త్యం , షడ్రుచులు ఏ విధంగా మానవ జీవితానికి ప్రతీకలుగా ఉంటాయి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

- మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సౌకర్యం కల్పించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ దగ్గర పనిచేస్తున్న కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, వడదెబ్బకు మెడికల్ సౌకర్యం మంచినీటి సౌకర్యం నీడకు టెంటు సౌకర్యం కల్పించాలని, సుదూర ప్రాంత పనులకు ఆటో సౌకర్యం చార్జీలు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు సందర్భంగా ఆటోలల్లో ప్రమాదాలు ఏర్పడుతున్నాయని అన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, క్షతగాత్రులు అవుతున్నారని, ప్రయాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిబంధనలు పాటించాలని, ఏప్రిల్, మే నెలలు తీవ్రంగా ఎండలు ఉండబోతున్నాయి..కనుక కూలీలకు తగిన టెంట్లు, మంచినీటి సౌకర్యం, ఓరోస్ ప్యాకెట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయిలు లేకుండా ఉపాధి పనికి సంబంధించిన వేతనాలు వెంటనే మంజూరు చేయాలని, కఠినమైన పనులు నిర్ణయాలు అధికారులు మానుకోవాలని, ఉపాధి పనిలో లేని నిబంధనలన్నీ పెడుతూ కార్మికులకు తీవ్ర ఇబ్బంది కల్పిస్తున్నారని, అలా చేయడం సరికాదన్నారు. వామపక్ష పార్టీలు వ్యవసాయ కార్మిక సంఘాలు పోరాటాల ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం చట్టం వచ్చిందని, ఆనాటి మన్మోసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని నేడు బిజెపి ప్రభుత్వం నిధులు కేటాయింపులో లోపం జరుగుతుందని, ఉపాధి పనులు అనేక షరతులు విధిస్తున్నారని క్రమక్రమంగా కార్మికులను తగ్గిస్తున్నారని ,ఇది దుర్మార్గమైన చర్య అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ భావిస్తుందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పని కల్పించాలని ,సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకి 800 రూపాయలు కూలి వేతనం ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్లో 2,50,000 కోట్లు కేటాయించాలని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానం మేరకు సంవత్సరానికి 150 రోజులు పని కల్పిస్తామన్నారు. రోజుకి 400 రూపాయలు ఇస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఏ షరతు లేకుండా వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లు వేగంగా కొనసాగాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- నవమి ఏర్పాట్లు పరిశీలన



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

వచ్చే నెల 6న జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం, పట్టాభిషేకానికి ముఖ్యమంత్రివర్యులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగినట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం జరిగే మిథిలా స్టేడియంలో సీఎంతో పాటు వివిఐపీలు వీఐపీలు సౌకర్యంగా కూర్చుని కళ్యాణం తిలకించడానికి జరుగు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కళ్యాణం తిలకించడానికి 250 మంది వివిఐపీలు 500 మంది వీఐపీలు మరియు సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లు, హైకోర్టు, సుప్రీం కోర్ట్ జడ్జిలు వారి కుటుంబాలతో వచ్చే అవకాశం ఉన్నందున వారి హోదాలకు తగ్గట్టు కూర్చోవడానికి సీట్లు అమర్చాలని అన్నారు. అలాగే భక్తులకు కూడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ చల్లని గాలి వీచే విధంగా ఫాగ్ ఏర్పాటు చేస్తున్నామని కళ్యాణం తిలకించడానికి వచ్చే భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా చూసి దర్శనము చేసుకొని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరాలన్నారు. అందరికీ తలంబ్రాలు, ప్రసాదాలు దొరికే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులందరికీ మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు గ్యాలరీలోనే అందించడానికి సిబ్బందిని నియమించామన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు చూపరులకు కనువిందు చేసేలా మ్యూజియంను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సారథ్యంలో ముస్తాబు చేస్తున్నారని ఆ మ్యూజియం కూడా సీఎం చేత ప్రారంభం చేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రవీందర్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ బ్రహ్మయ్య, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఈ రవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో గన్యా, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-బోనకల్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోనే అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్ విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయనందుకు నిరసనగా రావినూతల గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) రావినూతల గ్రామ శాఖల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2500 వంటి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని, పాక్షికంగా అమలు చేసిన రైతు రుణమాఫీ, రైతుబంధు వంటి పథకాలను అర్హత ఉన్న ప్రతి రైతుకి సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన దీక్ష లో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు దొండపాటి సత్యనారాయణ, గుగులోతు నరేష్, రావినూతల శాఖ కార్యదర్శి కొంగర గోపి, సీనియర్ నాయకులు దొండపాటి వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సభ్యులు జోనిబోయిన గురవయ్య, ఎర్రగాని నాగరాజు, అజ్మీర గోపి, లావూరి హుస్సేన్, లావూరి వెంకటేశ్వర్లు, వంగ నాగేశ్వరరావు, వట్టికొండ రమేష్, మిరియాల నాగేశ్వరరావు, కొండ పూర్ణచంద్రరావు, తాళ్లూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని ఇబ్బందులు వచ్చినా కాంగ్రెస్‌ను వీడలేదు

మాది కాంగ్రెస్ కుటుంబం

- బీఆర్ఎస్‌లోకి రావాలని ఒత్తిడి చేశారు.. వెళ్లలేదు..
- గరీబ్ పేట మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం



నవతెలంగాణ-సుజాతనగర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ జెండాను వీడలేదని గరీబ్ పేట మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం అన్నారు. శనివారం నవతెలంగాణతో మాట్లాడుతూ నాకు ఊహ తెలిసిన దగ్గర నుండి మా కుటుంబం కాంగ్రెస్ కుటుంబం కావడంతో నేను కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితుడినైనాను చెప్పారు. నా ఊహ తెలిసిన కాడినుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో నేను పాల్గొంటున్నానన్నారు. నా మీద గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టడం పెట్టిందన్నారు. ఎన్ని నిర్బంధాలు వచ్చిన కాంగ్రెస్ జెండాను విడవలేదన్నారు. 2013లో నేను కాంగ్రెస్ పార్టీ తరపున గరీబ్ పేటలో రెండో వార్డు మెంబర్‌గా గెలుపొందాను. 2019లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీగా గెలుపొందాను. నిత్యం స్థానిక ప్రజలను అంటుకొని వారి సమస్యలపై పనిచేస్తూ ఉండేవాడిని కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోకి మారమని ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసిన నేను మారలేదన్నారు. సుజాతనగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ తరపున ముగ్గురు ఎంపీటీసీలుగా గెలుపొందగా ఇద్దరు ఎంపీటీసీలు బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారు. ఒకరికి ఎంపీపీ, ఇంకొకరికి వైస్ ఎంపీపీ ఇచ్చారు. అయినా నేను కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని నిలబడ్డాను. బీఆర్ఎస్‌లోకి వస్తేనే నీకు మండల పరిషత్ నిధులు కేటాయిస్తామని చెప్పినా నేను లొంగలేదు. ఈ అంశంపై మండల పరిషత్‌లో ప్లే కార్డ్ పట్టుకొని ఒకరోజు మొత్తం నిరసన తెలియజేశానని గుర్తు చేశారు. ఎన్ని అవరోధాలు వచ్చిన కాంగ్రెస్ పార్టీని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు.



మండల పరిషత్‌లో ప్లే కార్డ్ పట్టుకొని నిరసన(ఫైల్)

ఇంత పార్టీ కమిట్మెంట్‌తో పనిచేసే నాయకుడు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి పని చేసిన నాయకుడికి కాంగ్రెస్ పార్టీ గుర్తించి నామినేట్ పదవి ఇస్తే బాగుంటుందని అక్కడ ప్రజలు భావిస్తున్నారు.

సారపాకలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు



నవతెలంగాణ- బూర్గంపాడు

మండలంలోని సారపాకలో శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల కమిటీ, ఐటిసి టీఎన్టియుసిల ఆధ్వర్యంలో ఈ వేడుకలను చేశారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ జెండాను టీఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చిరునామాగా మారిందని ఆయన అన్నారు. అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టిడిపికే దక్కిందని ఆయన పేర్కొన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు కు దక్కిందని ఆయన అన్నారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారం దక్కించుకున్న ఘన మైన చరిత్ర తెలుగుదేశం పార్టీకే ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి టిఎన్‌టియుసి అధ్యక్షులు, ఐటిసి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు కనక మేడల హరి ప్రసాద్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి జగదీశ్వరరావు, జిల్లా నాయకులు గల్లా నాగ భూషయ్య, చావ మహేశ్వర రావు, మైనార్టీ నాయకులు అజీజ్, కంచేటి వెంకటేశ్వర రావు, కాకర్ల సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు నెట్టెం భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కరి రాజేంద్ర ప్రసాద్, కార్యవర్గ సభ్యులు చావ రవి, బి.వి. సుబ్బారావు, పిడుగు కొండల రావు, పోటు నరేష్, కుందేటి శ్రీనివాస్, సాయి బాబు, టీడీపీ నాయ కులు నరసింహారావు, టిడిపి, టిఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ మాజీ కార్యదర్శి ఇంటి వెంకటేశ్వర్లు మృతి

- మండలంలో పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శిగా...
- సైన్సు హేతువాద పత్రిక సంపాదకులుగా..
- ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ



ఫైల్



ఫైల్

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ మండలంలో పలు గ్రామపంచాయతీలకు కార్యదర్శిగా పనిచేసిన ఇంటి వెంకటేశ్వర్లు (70) శనివారం అనారోగ్యంతో ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించారు. అయితే ఆనాటి ప్రభుత్వం డిప్యూటేషన్ పై గ్రామపంచాయతీ కార్యదర్శులను నియమించింది. దీంతో ఇంటి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ వృత్తి నుంచి గ్రామపంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్ పై బోనకల్ మండలానికి వచ్చారు. బోనకల్ మండలంలో చిరునోముల, బోనకల్, పెద్ద బీరవల్లి, ముష్టికుంట్ల, ఆళ్లపాడు తదితర గ్రామపంచాయతీలకు సుదీర్ఘకాలం పాటు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శిగా ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారు. 2001లో ఆళ్లపాడు గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఆయా గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర నిర్వహించారు. అనంతరం పంచాయతీరాజ్ వ్యవస్థ నుంచి తన మాతృ సంస్థకు వెళ్లారు. ఖమ్మం దానవాయిగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ 12 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం ఖమ్మంలోని రోటరీ నగర్‌లో నివాసము ఉంటున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం 'సైన్స్ హేతువాద పత్రిక' స్థాపించి అనేక సంవత్సరాలు సంపాదకులుగా వ్యవహరించారు. మృదుస్వభావిగా పేరు సంపాదించుకున్నారు. అయితే గత పది రోజుల క్రితం వెంకటేశ్వర్లు ను అనారోగ్య సమస్యలతో ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. ఆసుపత్రిలోనే వైద్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బోనకల్ మండలం నుంచి ఆనాటి సర్పంచులు ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

టేక్‌మెట్ అడవుల్లో ఎన్‌కౌంటర్

- ఒక మావోయిస్టు మృతి
- బీజాపూర్ జిల్లాలో ఘటన

నవతెలంగాణ-చర్ల

చత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా బాసగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ టేక్‌మెట అడవుల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఘటనా స్థలం నుంచి పేలుడు పదార్థంతో పాటు ఆయుధం స్వాధీనం చేస్తున్నామన్నారు. డీఆర్‌జీ బీజాపూర్ కోబ్రా 210 సంయుక్త బృందం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కోసం నర్సాపూర్ టేకమెట్ల వైపు వెళ్ళిందని ఎస్పీ తెలిపారు. పరిసర ప్రాంతాల్లో ఇంకా పెట్రోలింగ్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఎస్పీ వివరించారు.

గంజాయిని పట్టుకున్న మణుగూరు పోలీసులు



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు హనుమాన్ టెంపుల్ క్రాస్ రోడ్ వద్ద ఇన్‌చార్జ్ ఎస్సై రాజ్ కుమార్ పట్టుకున్నారు. సిఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం హనుమాన్ టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేయు క్రమంలో ఒక ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అశ్వాపురం వైపు నుండి మణుగూరు వైపు వస్తుండగా నిషేధిత గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితుల నుండి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సీలేరు వద్దనున్న నాగులూరులోని త్రిమూర్తుల వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్ తీసుకెళ్తుతుండగా పట్టుకున్నారు. నిందితుల భీమిశెట్టి మహేష్ సూర్యాపేట, షేక్ ఉమర్ హైదరాబాద్‌గా గుర్తించామన్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేశామన్నారు.

అక్రమ ఇసుక రవాణా..

నవతెలంగాణ-మణుగూరు

మునుపెన్నడు లేని విధంగా అక్రమ ఇసుక రవాణా మాఫియా ముఠాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని మణుగూరు అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూణెం సరోజినీ తీవ్రంగా ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అధికారులకు ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన పట్టించుకోవట్లేదు అన్నారు. అక్రమ ఇసుక రవాణా వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించకపోతే మహిళా మండలి కార్యకర్తల ద్వారా ప్రభుత్వ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షబానా సౌజన్య, శ్యామల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ లేని క్రికెట్ ఆట-ఐపీఎల్

'నేతి బీరకాయలో నెయ్యి లేదు, మైసూర్ బోండంలో మైసూర్ లేదు, ఐపీఎల్ క్రికెట్‌లో క్రికెట్ లేదు' అంటే కోపగించుకోవద్దు.

అది నిజం, పచ్చి నిజం.


మన తెలుగు సినిమాల్లో హీరో విలన్ల బందాన్ని-ఎంత మందైనా ఉండనీ-వొంటి చేత్తో లేపి లేపి కొడతాడు. సినిమా సక్సెస్, బాక్సాఫీస్ బద్దలు ఖాయం.

అదే సక్సెస్ ఫార్ములా ఐపీఎల్ కిరికేటుకు కూడా. దీనితో బీసీసీసీఐ గదులు డబ్బు సంచులతో కిక్కిరిసిపోతున్నాయి, క్రికెట్ స్టేడియంల లాగా.

ఇప్పుడు ఐపీఎల్‌లో హీరో బ్యాటర్ మాత్రమే. బౌలరుకు పెద్ద విలువలేదు. ఎందుకంటే ఎంత గొప్ప బౌలర్ వేసిన బంతినైనా సునాయాసంగా 30 అడుగుల ఎత్తుకు కొట్టి 100 అడుగుల దూరంలో ప్రేక్షకుల మధ్య పడేట్టు చేయగల ఘనాపాటి బ్యాటర్లు ఉన్నారు. 20 బంతుల్లో 50 పరుగులు చేస్తారు. అందులో ఫోర్లు, సిక్సర్లతో వచ్చిన పరుగులే ఎక్కువ. దానితో స్టేడియం అంతా కేరింతలు, అరుపులు, టీమ్ జెండా రెపరెపలు.

ఇది చూసే పిల్లా, పెద్ద అంతా బ్యాటర్ గొప్పతనం అనుకుంటారు. బ్యాటర్‌కు గొప్పతనం కట్టబెట్టటానికి కావలసిన స్కీం అంతా ముందే తయారయి ఉంటుంది. క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లకు, టీ20 మ్యాచ్‌లకు ఉన్న రూల్స్ చూస్తే ఇది బాగా అర్థమవుతుంది.

మొదటిది, పిచ్ ని బ్యాటర్‌కు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఎంత గొప్ప బౌలర్ అయినా ఈ పిచ్‌ల మీద చెమట కార్చాల్సిందే, వికెట్ దక్కటం గగనం. టీ 20, వన్డే, టెస్ట్ మ్యాచ్‌లకు వేరువేరుగా పిచ్‌లను ఎందుకు తయారు చేస్తారు. కారణం ఒకటే బాల్ బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టకూడదు. తేలికగా బౌండరీ వైపు పరుగులు పెట్టాలి, లేక గాల్లో తేలుతూ ప్రేక్షకుల మధ్య పడాలి.



పిచ్ మార్పే కాదు, రూల్సులో మార్పులు కూడా బ్యాట్స్‌మన్‌కే అనుకూలం. మొదటి 6 ఓవర్లలో 2 ఫీల్డర్లు మాత్రమే లోపలి సర్కిల్ బయట వుండవచ్చు. మిగతా అందరూ లోపలి సర్కిల్ లోపలే ఉండాలి. ఈ రూల్ వల్ల బ్యాటర్ ధైర్యంగా బంతిని లోపలి ఫీల్డర్ నెత్తి మీదనుంచి బౌండరీకి తరలించవచ్చు.

ఈ రూలు చూడండి ఎట్లా వున్నదో? ఏ బౌలరు 4 ఓవర్లకు మించి బౌలింగ్ చేయకూడదుట. బౌలర్ వరసగా వికెట్లు తీసుకుంటున్నా 4 ఓవర్లే వేయాలి. ఆపైన ఒక్క బాలు విసరటానికి వీల్లేదు. కానీ 4 ఓవర్లే ఆడాలి అనే రూలు బ్యాట్‌మన్‌కి లేదు. అవుట్ కాకుండా మొదటి బంతి నుంచి చివరి బంతి దాకా ఆడవచ్చు. వీళ్లకి నాలుగు ఓవర్ల పరిమితి ఎందుకు లేదు. బ్యాట్ మన్‌ని హీరోను చేయాలి కనుక.

మరో రూలు, బాల్ ఏ కొద్దిగా కూడా బ్యాట్‌మన్ వెనక నుంచి వెళ్ళకూడదు. పొరపాటున వెళితే అంపైర్ వెంటనే రెండు చేతులు ఈ పొడుగున చాపి వైడ్ బాల్ అంటాడు. అంపైర్ కంటే ముందరే టీవీలో ఆట చూసే ప్రేక్షకులు చేతులు చాపి వైడ్ అంటారు. అది వేరే విషయం అనుకోండి. ఇక నోబాల్‌లో బౌలర్‌కి వేసే శిక్ష ఇంకా పెద్దది. ఎదుటి పార్టీకి రన్ ఇవ్వటమే కాక, ఫ్రీ హిట్ బాల్ కూడా ఇస్తారు. ఈ బాల్‌ను బ్యాటర్ ఎట్లాగైనా కొట్టవచ్చు. రనౌట్ తప్ప క్యాచ్‌తోనూ, స్టంపింగ్‌తోనూ ఈ బాల్‌లో అవుట్ కాడు.

ఆట మొత్తం బ్యాటింగ్ చేసే వారికి అనుకూలంగా మార్చేశారు. టెస్ట్ మ్యాచ్‌లలో ఈ రూల్స్ ఏవి లేవు. ఫీల్డింగ్ ఆంక్షలు లేవు, బౌలింగ్ ఆంక్షలు లేవు. టెస్ట్ మ్యాచ్‌లో లేని రూల్స్ ఐపీఎల్‌లో ఎందుకు?

డబ్బు... డబ్బు... డబ్బు గడించాలి. ఇప్పుడున్నది వ్యాపారయుగం కదా. దేన్నైనా వ్యాపారంగా మారిస్తేనే జనం డబ్బులు వ్యాపారావేత్తల దగ్గరికి చేరతాయి. క్రికెట్ ఆటే ఉదాహరణ. ఆట వ్యాపారంగా మారిపోయిన తరువాత, లాభం గురించి తప్ప ఇంకో ధ్యాస ఎక్కడ వుంది? లాభం కోసం క్రికెట్ ఆడని దుబాయ్‌లో క్రికెట్ స్టేడియంలు పెట్టి ఆడించి, టీవీల్లో చూపించి డబ్బులు సంపాదిస్తారు.

వ్యాపారంలో రారాజులందరికి క్రికెట్ టీమ్‌లు వున్నాయి. ఆటగాళ్ళను ఆక్షన్‌లో కొనుక్కున్నారు. అంబానీ, శ్రీవాసన్, గొయంకా లాంటి బిగ్ బిజినెస్‌ల చేతుల్లో, షారుఖ్ ఖాన్, ప్రీతి జింటా లాంటి సినీ సెలబ్రిటీల చేతుల్లో ఐపీఎల్ ఆట ఉంది. హైదరాబాద్ సన్‌రైజర్స్ ఓనర్ సన్ టీవీ ఛానల్ ఓనర్ కళానిధి మారన్. ఈ టీమ్‌లో ఒక్క తెలుగువాడైనా ఉన్నాడా? ఉంటే ఒకడో, అరో వుండవచ్చు. దాదావు అన్నీ టీమ్‌ల పరిస్థితీ ఇదే.

ఇలా చెప్పాలంటే చాలా వుంది. కనుక,
కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి
పడితే పట్టాలిరా డబ్బు సంచులు
అని పాడుకుందాం.

లేఔట్‌లో రైతుబంధు.. ఉచిత కరెంట్

నాలా కన్వర్షన్ లేదంటూ పట్టాదారుల బెదిరింపులు

కోర్టుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేత

మరోవైపు అక్రమ కమర్షియల్ నిర్మాణాలు

అనుమతి పొందిన లేఔట్లలో రోడ్లు, పార్కు స్థలాల కబ్జా

హైడ్రా పరిశీలనలో సిటీ శివార్లలో వెలుగు చూస్తున్న నిజాలు

స్థానికుల ఫిర్యాదుతో ఆక్రమణలను కూల్చేస్తున్న హైడ్రా

హడలిపోతున్న రాజకీయ నేతలు, భూ యజమానులు, కబ్జాదారులు

పాత లేఔట్లకు అక్రమంగా వ్యవసాయ భూమి పట్టాలు





పట్టించుకోని మున్సిపల్, మండల అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

వ్యవసాయ భూములకు రైతుబంధు, ఉచిత కరెంట్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ఇదే అదనుగా.. కొంతమంది రాజకీయనేతలు, భూ యజమానులు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గతంలో గ్రామ పంచాయతీల ద్వారా అనుమతి పొందిన లేఔట్లకు అక్రమంగా వ్యవసాయ భూమి పట్టాలు తీసుకుని, రైతుబంధు ఉచిత కరెంట్ పొందుతున్నారు. ఇప్పుడు ఆ యజమానులే నాలా కన్వర్షన్ లేదంటూ అనుమతి పొందిన లేఔట్లలో రోడ్లు, పార్కు స్థలాలను కబ్జాచేసి వాటిని వ్యవసాయ భూములుగా అక్రమంగా పట్టాలు పొందుతున్నారు.

పలుకుబడిన రాజకీయ నేతల అండదండలతో అధికారులను మ్యానేజ్ చేసి అక్రమంగా అవే నెంబర్లలో వ్యవసాయ పట్టాలుగా చూపడంతో దర్జాగా ప్రభుత్వ పథకాలను పొందుతున్నారు. మరోవైపు వ్యవసాయ భూములంటూ కమర్షియల్ నిర్మాణాలు చేపడుతూ లీజ్‌లకు ఇస్తున్నారు. వీటికి మున్సిపల్ కార్పొరేషన్, మండల అధికారుల పర్మిషన్ కూడా ఉండదు. అడిగేవారు లేకపోవడంతో దర్జాగా పని చేసుకుంటూ పోతున్నారు. చుట్టుపక్కల వారు అడిగితే బెదిరించి నోరు మూయించేస్తున్నారు. వ్యవసాయ భూములంటూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కోర్టుల్లో పిటీషన్‌లు వేసి కాలం గడుతుండటం గమనార్హం. ఇటీవల ఆయా కాలనీలు, సంస్థల నుంచి ఫిర్యాదులు రావడంతో హైడ్రా అధికారులు స్థానికంగా వెళ్లి పరిశీలించారు. ఇందులో అనేక విషయాలు వెలుగు చూశాయి. ఒక్కోచోట ఒక్కో చీకటి బాగోతం బయటకు వస్తున్నాయి. మీడియాలోనూ వస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదులతో హైడ్రా సిబ్బంది రంగంలోకి దిగి ఆక్రమించిన ప్రభుత్వం స్థలాలను రక్షించడంతో పాటు అనుమతి పొందిన గ్రామ పంచాయతీ లేఔట్లలో పట్టాదారులు ఆక్రమించిన రోడ్లను, పార్కు స్థలాలను రక్షించి స్థానికులకు అప్పగిస్తున్నారు. హైడ్రా అధికారుల రాకతో రాజకీయ నేతలు, భూ యజమానులు, భూ కబ్జాదారులు హడలిపోతున్నారు. తమ ఫిర్యాదులకు వెంటనే స్పందన, సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు.

తాజాగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో స్టేడియం నిర్మాణం, కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. వాటిని హైడ్రా అధికారులు కూల్చేశారు. ఆక్రమించిన పార్కు స్థలాలను రక్షించారు. పెట్రోల్ బంకును కూడా వ్యవసాయ భూమిలోనే అనుమతులు లేకుండా నిర్మించారని ఫిర్యాదులున్నాయి. ఇటీవల అల్మాస్‌గూడలోని నాలుగో వార్డు పరిధిలోని బోయపల్లి ఎన్‌క్లేవ్ కాలనీని హైడ్రా అధికారులు తిరుమలేష్ బృందం స్థానికుల ఫిర్యాదు మేరకు సందర్శించారు.

పట్టాదారుల బాగోతాలు..

కొన్నేండ్ల కిందటే భూ యజమానులు 2008-09లో కొంత, 2014లో సర్వే నెంబర్ 39, 40, 41, 42, 44లో 5.7 కుంటల భూమిలో పాత గ్రామ పంచాయతీ లేఅవుట్ మేరకు భూయజమానులు ప్లాట్లు చేసి విక్రయించారు. లేఔట్‌లో నాలుగు రోడ్లు, పార్క్ స్థలం ఉంది. కానీ, వాటిని చూపే స్థలాలను అమ్ముకున్నారు. అప్పటికీ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడలేదు. అయితే, ఇప్పుడు అది వ్యవసాయ భూమి అని, పాసుపుస్తకాలు ఉన్నాయని భూ యజమానులు చెబుతున్నారు. లేఔట్ చేసి, సగం అమ్మాక వ్యవసాయ భూమిగా పాస్ పుస్తకాలు ఉన్నాయని చెబుతున్నారు. అంతటితో ఆగకుండా ఆ లేఔట్‌లో రోడ్లను కూడా కబ్జా చేశారు. తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు ఎన్నిసార్లు భూ యజమానులను కోరినా పట్టించుకోలేదు. "మీకు రోడ్డు ఇచ్చేది లేదు. ఆ భూమి మాది' అంటూ దబాయించారు. చివరకు కాలనీవాసులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఇల్లీగల్ లేఔట్ అయితే ఇన్ని సంవత్సరాలు ఏమి చేశారని, ప్లాట్ల అమ్మకాలు చేసిందెవరని హైడ్రా పట్టాదారులను ప్రశ్నించింది. వ్యవసాయ భూమి కాబట్టే తమకు ఇండ్లు కట్టుకోవడానికి అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని పట్టాదారులు చెప్పగా.. అమ్మిన ఇండ్లకు ఎవరు అనుమతులు ఇచ్చారని, కరెంట్ బిల్లులు, ఆస్తి పన్ను ఎలా వసూలు చేస్తున్నారని ప్రశ్నించడంతో కంగుతిన్నారు. ఇండ్ల నిర్మాణానికి అనుమతి లేకపోవడంతో లక్షల రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ తీసుకుని రెండు పెద్ద ఇండ్ల నిర్మాణం ఎలా చేశారని, వారికి ఎవరు అనుమతి ఇచ్చారని, ఎల్ఆర్ఎస్ ఎలా కట్టించుకున్నారని హైడ్రా ప్రశ్నల వర్షం కురిపించింది. వ్యవసాయ భూమి కావడం వల్లే రైతుబంధు తీసుకుంటున్నామని, ఉచిత కరెంటు వస్తోందని భూ యజమాని చెప్పారు. అలా అయితే, కమర్షియల్ స్టేడియం నిర్మాణం ఎలా చేపడుతున్నారని హైడ్రా అధికారి తిరుమల్ వారిని ప్రశ్నించారు. ఇటీవల పట్టాదారులు కోర్టుకు వెళ్లిన సమయంలోనూ వారి పిటీషన్‌ను డిస్మిస్ చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న అధికారి మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 4వ డివిజన్ పరిధిలోని బోయపల్లి ఎంక్లేవ్ కాలనీ వాసులకు పాత లేఅవుట్ ప్రకారం రోడ్డు సౌకర్యం కల్పించాలని హైడ్రా అధికారి సూచించారు. పెడచెవిన పెట్టడంతో హైడ్రా అధికారులు ఆక్రమణలను కూల్చివేసి నాలుగు రోడ్లు, పార్కు స్థలాన్ని కాలనీవాసులు తిరిగేందుకు, ఉపయోగించేందుకు అవకాశం కల్పించారు. పదిహేనుండ్లుగా లేని వ్యవసాయ భూమి ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చిందని మీడియా ప్రశ్నిస్తోంది. ఇదే విషయమై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కూడా కాలనీ వాసులకు లేఔట్ ప్రకారం రోడ్లు అప్పగించాలని, పార్కు స్థలాన్ని ఇవ్వాలని పట్టాదారులకు సూచించారు. ఆక్రమణలు కూల్చివేత సమయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది కూడా ఉన్నారు. రోజుకొకటి వెలుగుచూడటంతో ఇలాంటి ఆక్రమణలు ఎన్ని ఉన్నాయన్నది ఆలోచించాల్సిందే. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రైతుబంధు, ఉచిత కరెంట్, అనుమతులు లేకుండా కమర్షియల్ నిర్మాణాలు చేసే వారి పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయస్థానాలు కూడా ఇటువంటి కేసుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధితుల పక్షాన నిలబడాలని జనం కోరుతున్నారు.

అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-మంథని/రామగిరి/కమాన్‌పూర్

అధికారులంతా జవాబుదారీతనంతో పని చేయాలని ఐటీ, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో రూ.50 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన తహసీల్దార్ భవన నిర్మాణ పనులకు శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని, అధికారుల్లో జవాబుదారీతనం తీసుకుని రావడానికి చర్యలు చేపట్టామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వల్ల జరిగిన నష్టాలను భూభారతి చట్టంతో పూడ్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఉగాది నుంచి రేషన్‌కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేయనున్నామన్నారు. రైతుల పంటలో గింజ కూడా తరుగు కట్ చేయకుండా మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం రామగిరి మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్లు కె.చక్రవర్తి, ఈఈ గిరీష్‌బాబు, డిఈ. నవీన్ కుమార్, అజిత్రి ఏరియా జీఎం నరేంద్ర సుధాకర్ రావు, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, నాయకులు తొట్ల తిరుపతి యాదవ్, ముస్త్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గవర్నమెంటు ప్లీడర్లకు రెమ్యూనరేషన్ పెంపు

- జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

న్యాయస్థానాల్లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ప్లీడర్లకు రెమ్యూనరేషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు ఆయా కోర్టుల్లో అధికారులు దాఖలు చేసే కంటెంప్ట్ కేసుల్లో ఇస్తున్న రెమ్యూనరేషన్ రూ. 2000 నుంచి రూ.4000 పెంచుతూ న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి జీవో నెంబరు 274 విడుదల చేశారు. వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.

అంతర్జాతీయ సంఘీభావం అవసరం

- అమెరికా 'టారీఫ్ యుద్ధం'పై సామాజికవేత్తలు, విశ్లేషకులు
- ట్రంప్ వచ్చాకే కెనడా వంటి దేశాలకు సుంకాల బెదిరింపులు
- క్యూబా..వెనిజులా...పాలస్తీనా వంటి దేశాలపై ఎప్పటి నుంచో ఆంక్షలు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపు.. ఇప్పటికే ఆయా దేశాలకు ఆగ్రహాన్ని తెప్పించింది. కొన్ని దేశాలు అమెరికా చర్యలకు తలొగ్గగా.. మరికొన్ని దేశాలు మాత్రం తగ్గేదే లేదంటూ ఎదురు నిలబడ్డాయి. ఈ విధంగా తన సుంకాల యుద్ధం కెనడా అమెరికా ముందు లొంగిపోయేలా ఒత్తిడి తెస్తుందని అంతా భావించారు. కానీ, కెనడా నుంచి కూడా ప్రతిఘటన ఎదురైంది. దీంతో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలిందని విశ్లేషకులు చెప్పారు.

అమెరికా చర్యలతో శ్రామిక ప్రజలలో కోపం పెరిగింది. సుంకాలు ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలోని దాదాపు ప్రతి కార్మికుడినీ తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఒక్క ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలలోనే కెనడాలో 43,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు ప్రమాదంలో పడటం గమనించాల్సిన అంశం.

ఈ దేశ ఎగుమతుల్లో మూడొంతుల కంటే ఎక్కువ యూఎస్‌కు వెళ్తాయి. ఇది ప్రతి నెలా దాదాపు 50 బిలియన్ డాలర్లు. కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయీస్ (సీయూపీఈ) అంచనా ప్రకారం... " దిగుమతి సుంకాలు దాదాపుగా లక్షలాది ఉద్యోగాలు కోల్పోవడానికీ, కెనడాలో మాంద్యం ఏర్పడటానికి కారణమవుతాయి. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తిరిగి రావడం ద్వారా మరింత దిగజారిపోవచ్చు" అని హెచ్చరించింది.

సుంకాలు బెదిరింపులకు గురైన వెంటనే కెనడాలోని కార్పొరేషన్లు కార్మికులపై ఆధారపడటం ప్రారంభించాయి. రైలు కార్లను ఉత్పత్తి చేసే హామిల్టన్‌లోని నేషనల్ స్టీల్ కార్, దాని 1,400 మంది కార్మికులలో 90 శాతం మందిని తొలగించింది. మాంట్రియల్కు చెందిన ప్యాంటీహౌస్ తయారీదారు షీర్టెక్స్ దాని 350 మంది కార్మికులలో 40 శాతం మందిని తొలగించింది. క్యూబెక్లోని సౌత్ షోర్ ఫర్నీచర్ 115 ఉద్యోగాలను తగ్గించి, 100 మందికి పైగా ఉద్యోగాలను తొలగించింది. ఆపై సుంకాల బెదిరింపుల కారణంగా దాని వ్యాపార నమూనాను పునర్నిర్మించే ప్రణాళికలను ప్రకటించింది. ప్రైస్వాటర్ హౌస్ కూపర్స్ నిర్వహించిన కెనడాలోని వ్యాపారాలపై నిర్వహించిన సర్వేలో దాదాపు ఐదు కంపెనీలలో ఒకటి వాణిజ్య యుద్ధానికి ప్రత్యక్ష ప్రతిస్పందనగా యూఎస్‌లో తమ కార్యకలాపాలలో కొంత లేదా అన్నింటినీ తీవ్రంగా పునరాలోచించుకుంటున్నట్టు తెలిపాయి.

వ్యవసాయంలో సరఫరా నిర్వహణతో సహ ప్రాంతీయ వాణిజ్య నిబంధనలపై తీవ్రమైన బెదిరింపులు ఉన్నాయి. ఇటువంటి చర్య సరిహద్దుకు ఇరువైపులా ఉన్న గుత్తాధిపత్య సంస్థలకు ఒక వరం అవుతుంది. కానీ ఇది పదివేల మంది రైతులు, ట్రక్కర్లు, రవాణా కార్మికులకు తక్షణ కష్టాలను తెస్తుంది. ఇది దేశవ్యాప్తంగా శ్రామిక ప్రజల ఖర్చు శక్తిని, ఆరోగ్యం, భద్రతను కూడా ప్రమాదంలో పడేస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు.

కెనడాలోని శ్రామిక ప్రజలు 25 శాతం మంది సుంకాల ముప్పుపై చాలా కలత చెందుతుంటే... వెనిజులా, పాలస్తీనా, క్యూబా ప్రజలు ఎదుర్కొంటున్న పూర్తి స్థాయి ఆంక్షలు, దిగ్బంధనాల ప్రభావాల నుంచి ఎంతో కొంత నేర్చుకోవాల్సిన అవసరాన్ని నిపుణులు చెప్తున్నారు.

వెనిజులాపై అమెరికా కనీసం 2014 నుంచి ఆంక్షలు కొనసాగిస్తోంది. కెనడా, ఈయూ 2017లో వాటిని విధించాయి. చమురు పరిశ్రమను లక్ష్యంగా పెట్టుకున్నాయి. మొదటి ఆంక్షలు విధించిన ఆరు సంవత్సరాలలో, వెనిజులా చమురు ఆదాయం 93 శాతం తగ్గింది. ఇదే కాలంలో, తలసరి ఆదాయం 72 శాతం పడిపోయింది. 2020 ప్రారంభంలో ఆంక్షల ఫలితంగా వెనిజులాలో 100,000 మందికి పైగా మరణాలు సంభవించాయని మాజీ యూఎన్ ప్రత్యేక నివేదకుడు ఆల్ఫ్రెడ్ డి జాయాస్ అంచనా వేశారు.1990 దశకం ప్రారంభంలో గాజాలో ఇజ్రాయెల్ కదలికలు, వస్తువులపై ఆంక్షలు విధించినప్పటి నుంచి పాలస్తీనా ఆంక్షలు, దిగ్బంధనలకు గురైంది. గాజాపై ఆర్థిక ప్రభావం దిగ్భ్రాంతికరంగా ఉన్నది. 1996లోనే ఇజ్రాయెల్ ఆంక్షలతో గాజా స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 40 శాతం ఖర్చయిందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

క్యూబా ఆరు దశాబ్దాలకు పైగా అమెరికా నుంచి దిగ్బంధనను ఎదుర్కొంటోంది. ఇది క్యూబా ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలనూ పూర్తిగా ప్రభావితం చేస్తుంది. దీనిని అమెరికా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అంతర్జాతీయాకరించింది. 2023లో, ఐక్యరాజ్యసమితి... దిగ్బంధనం ప్రారంభమైనప్పటి నుంచి క్యూబా ఆర్థిక వ్యవస్థకు జరిగిన మొత్తం ఆర్థిక నష్టం "ట్రిలియన్ల డాలర్లు"గా అంచనా వేసింది.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత కెనడాను టార్గెట్‌గా చేసుకున్నారు. ట్రంప్ సుంకాల యుద్ధానికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు పోరాడుతున్నారు. ఇలాంటి తరుణంలో వెనిజులా, పాలస్తీనా, క్యూబా, ఇతర ప్రాంతాలలో అనుభవించిన కష్టాల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఇది చాలా సందర్భాలలో యూఎస్ ప్రభుత్వాలు విధించిన ఆంక్షల బాధలని అంటున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా సుంకాలపై ఆగ్రహం ఒక్కటే పని చేయదనీ, అంతర్జాతీయ సంఘీభావాన్ని నిర్మించుకోవాలని సామాజికవేత్తలు, అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తలు సూచిస్తున్నారు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పూర్తిచేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ సమీపంలోని శేషమ్మగూడెం వద్ద చేపట్టిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను ఏప్రిల్ 25 నాటికి పూర్తిచేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్, నల్లగొండ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ జె.శ్రీనివాస్, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును తనిఖీ చేశారు. 2014లో రూ.38 కోట్లతో ఈ ప్లాంట్ మంజూరు అయిందని, ఇప్పటివరకు పనులు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. పట్టణంలో దాదాపు 80 శాతం ఇండ్లు ఎస్టీపీ కనెక్షన్లు కలిగి ఉన్నాయని, ముఖ్యంగా వెంకటేశ్వర కాలనీ, రాఘవేంద్ర కాలనీ లాంటి కాలనీలకు ఎస్టీపీ కనెక్షన్ ఉందని, మిగతా ఇండ్లకు కూడా ఎస్టీపీ కనెక్షన్లు ఇస్తామని మంత్రి చెప్పారు. రానున్న 25, 30 రోజుల్లో ఎస్టీపీ నిర్మాణం పూర్తిచేయాలని మున్సిపల్ ఇంజజినీరింగ్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పూర్తి చేయడంతోపాటు చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని, టైల్స్, పెయింటింగ్ వంటి వాటన్నింటినీ ఏర్పాటు చేయాలని చెప్పారు. నర్సప్పగూడ వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మరో ఎస్టీపీ నిర్మాణాన్ని చేపట్టనున్నామని, ఇందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి పనులనూ చేపట్టబోమని స్పష్టం చేశారు. ఎన్జీ కళాశాల మైదానంలో హరితహారం మొక్కలు నాటాలని, ఎవరూ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త వేస్తే జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. పట్టణంలో ఫ్లైఓవర్లకు పెయింటింగ్ వేయించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. అనంతరం మంత్రి ఛాయా సోమేశ్వర దేవాలయం వెనుక వైపు ఉన్న డైసింగ్ కుంట రోడ్డును, ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మంటలు చెలరేగి..

వ్యక్తి సజీవ దహనం

- అదే గ్రామంలో ఇటీవల కరెంటు షాక్‌తో అన్నదమ్ములు మృతి
- భయాందోళనలో గ్రామస్తులు



(ఫైల్)

నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకర్గంలోని గోవిందూర్‌లో మరోమారు విద్యుద్ఘాతం జరిగి.. ఓ వ్యక్తి కాలి బూడిదయ్యాడు. అదే గ్రామంలో ఇటీవల అన్నదమ్ములు విద్యుద్ఘాతానికి గురై పొలం దగ్గరే ప్రాణం కోల్పోయిన విషయం విదితమే. తాజాగా మరో వ్యక్తిపై 11కేవీ విద్యుత్ వైరు తెగిపడటంతో మంటలు చెలరేగి సజీవ దహనమయ్యాడు. వరుస విద్యుత్ ప్రమాదాల వల్ల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందూర్ గ్రామ పరిధిలోని డాక్టర్ ఉషా కిరణ్ వ్యవసాయ క్షేత్రంలో నరసింహారెడ్డి(50) పని చేస్తుండేవాడు. శనివారం పొలంలో పని చేస్తుండగా 11 కె.వి విద్యుత్ వైరు తెగి ఆయనపై పడింది. దాంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ తీగ తెగిపడిన సమయంలో అక్కడి లైన్ ట్రిప్ అయింది. అయితే, వైర్లపై పక్షులు కూర్చున్నా అలాగే అవుతుందనుకొని విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా చేశారు. అప్పటికే విద్యుద్ఘాతం జరగ్గా.. మరోమారు కరెంట్ రావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో నరసింహారెడ్డి ఆ మంటల్లోనే కాలి బూడిదయ్యాడు. పంట పొలంలో మంటలు రావడం చూసిన స్థానిక రైతులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా నరసింహారెడ్డి మృతదేహం కలిపోవడాన్ని చూశారు. దాంతో విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వడంతో వారు సరఫరా నిలిపివేశారు. బాధిత కుటుంబానికి పొలం యజమాని ఆర్థిక సాయం చేయాలని ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం వద్ద బంధువులు ఆందోళన చేపట్టారు. దాంతో పొలం యజమానితో పోలీసులు చర్చలు జరుపుతున్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, కొన్ని రోజుల కిందటే నరసింహారెడ్డి ఏకైక కూతురు అనారోగ్యంతో మృతిచెందింది. దాంతో ఆమె కుమార్తెను నరసింహారెడ్డి దంపతులే పోషిస్తున్నారు. వ్యవసాయ పొలం వద్దే ఉంటూ ఆయన పనులు చేసేవారు. నరసింహారెడ్డి మృతితో.. భార్య, మనువరాలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే..

ఇదే గ్రామంలో 15 రోజుల కిందట ఇద్దరు అన్నదమ్ములు విద్యుద్ఘాతానికి గురై మృతిచెందారు. ఆ ప్రమాదం జరిగినప్పుడే విద్యుత్ అధికారులు స్పందించి వైర్లకు మరమ్మతు చేస్తే ఈ ప్రమాదం జరిగి ఉండేదని కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే నరసింహారెడ్డి మృతిచెందాడని ఆరోపిస్తున్నారు. వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ దుబారా వ్యయంపై మస్క్ అసంతృప్తి

సమర్థత సమగ్ర పరిశీలనకు పిలుపు



వాషింగ్టన్ : ఎలన్ మస్క్ ప్రభుత్వ కార్యకలాపాల సామర్థ్యాన్ని బహిరంగంగా విమర్శించారు. వాటిని వాణిజ్య వ్యాపారాలతో పోల్చారు. ఇక్కడ ఇలాంటి అసమర్థతలు దివాలా, చట్టపరమైన పరిణామాలకు దారితీస్తాయి. డోజ్ అభివృద్ధి చేసిన అధునాతన సాంకేతికత.. మోసాన్ని గణనీయంగా తగ్గించగలదని ఆయన సూచిస్తు న్నారు. ముఖ్యంగా సామాజిక భద్రత వంటి ప్రభుత్వ కార్యక్రమాలలో, గణనీయమైన శాతం కాల్‌లు మోసపూరితంగా ఉంటాయి. మస్క్ వ్యాఖ్యలు ప్రభుత్వ సామర్థ్యం, నియంత్రణ భారాలు, ప్రభుత్వ రంగ సవాళ్లకు ప్రయివేట్ రంగ నిర్వహణ పద్ధతుల వర్తింపుపై చర్చకు దారితీశాయి.

ప్రభుత్వ గుప్పిట్లో న్యాయ వ్యవస్థ

చట్టానికి ఇజ్రాయెల్ పార్లమెంటు ఆమోదం



టెల్అవీవ్ : న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వ నియంత్రణ పెంచేందుకు ఇజ్రాయెల్ పార్లమెంటు చట్టాన్ని ఆమోదించింది. దీనితో న్యాయ వ్యవస్థను ప్రభుత్వ గుప్పిట్లోకి తెచ్చుకున్నది. గతంలో ప్రధాన మంత్రి ఎదుర్కొన్న అవినీతి ఆరోపణలను అక్కడి సుప్రీంకోర్టు విచారణ జరపడం తెలిసిందే. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్ ప్రజలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత తిరోగమన చర్య అని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కష్టసుఖాల కలయికే ఉగాది

వేణు గీతికకు ప్రేమతో...

ఎలా ఉన్నావ్ బంగారు తల్లి? ఉగాది పండుగ వస్తోంది, మొన్న ఒక రోజు అడిగావు 'అమ్మా! ఉగాది పచ్చడిలో ఏమేమి వేసి చేస్తారు' అని. ఇన్నేండ్లుగా నా దగ్గర ఉన్నావు, నేను చేసిన పచ్చడి తినటం, ఆడు కోవడానికి వెళ్ళటం, లేదా చదువుకోవడానికి కూర్చోవడం. నేను ఎప్పుడూ నేర్చుకోమని బలవంత పెట్టలేదు, కాకపోతే ఒక్క విషయం చెప్పేదాన్ని జీవితంలో ఎదురయ్యే కష్ట, సుఖాల కలయికే ఈ పచ్చడి పరమార్థం.

పురాణాల ప్రకారం ఎన్నో కథలు ఉన్నాయి కానీ, ప్రస్తుతం అవి అనవసరం. ఉగాది మన తెలుగు వాళ్ళకే కాదు, కన్నడ వాళ్ళకి కూడా. గుడిప డవాగా మరాఠీలు జరుపుకుంటారు. కొంచెం టూకీగా ఉగాది గురించి చెప్తాను నాన్న. ఉగా అంటే నక్షత్ర

అమ్మ లేఖ



గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది.
అంటే సృష్టి ఆరంభమైన దినమే ఉగాది. చైత్ర శుద్ధ పాడ్యమినాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఉగాదినాడు పొద్దున్నే లేచి ఇంటిని శుభ్రం చేసుకుని, స్నానం చేసి, దేవుడి దగ్గర దీపం పెట్టి ఉగాది పచ్చడి నైవేద్యంగా పెడతారు. ఈ ఉగాది పచ్చడి ఆరు రుచుల కలయిక. దీనినే షడ్రుచులు అంటారు. బెల్లం, ఉప్పు, వేప పువ్వు, చింతపండు, పచ్చి మామిడి ముక్కలు, కారం.

వీటికి ఒక్కొక్క దానికి నిర్వచనం కూడా ఉంది

బెల్లం: ఆనందానికి ప్రతీక.

ఉప్పు: జీవితంలో ఉత్సాహానికి సంకేతం.

వేప పువ్వు: బాధ కలిగించే అనుభవాలు.

చింతపండు: నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు.

పచ్చిమామిడి ముక్కలు: దీని వగరు కొత్త సవాళ్లకు గుర్తు

కారం: సహనానికి సంకేతం.

ఉన్నంతలో ప్రతి పండగను ఆనందంగా జరుపుకోవాలి. అప్పుడే దీని ద్వారా మీకు, భవిష్య తరాల వారికి వాటి ప్రాముఖ్యత గురించి తెలుస్తుంది. అంతేకాకుండా ఏ పండగ చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే ఏ కోణంలో చూసిన ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. నాన్న కిందటి ఉగాది పండగకి నీ దగ్గరకు వచ్చాము. ఈ సారి నువ్వే అన్ని తెచ్చుకుని చేసుకోవాలి. నువ్వు పండగ వస్తోంది, పచ్చడి ఎలా చేసుకోవాలి అని అడగటం, అది కూడా ఈ సారి ఆదివారం రావడం, నేను అమ్మలేఖ ద్వారా నీకు తెలియ చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

కొత్త బట్టలు వేసుకుని, ఉగాది పచ్చడి చేసుకుని తినే సెయ్. కొంతమంది పిల్లలు షడ్రుచులతో తినలేరని వారి కోసం చెరుకు ముక్కలు, అరటి పండు లాంటివి వేస్తారు. పండుగ నాడు మేము దగ్గర లేమని బాధపడకు చిట్టితల్లి. సంతోషంగా ఉండు. ఏడాదంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటావు.. ఉంటాను...



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి



శక్తికి చిహ్నం నలుపు

ఇటీవల కాలంలో బాడీషేమింగ్ బాగా పెరిగిపోయింది. రంగూ, రూపాన్ని చూపి మహిళలను అవహేళన చేస్తున్నారు. సాధారణ మహిళలు, సెలబ్రెటీలు చివరకు అధికారులు సైతం దీనికి అతీతులు కారు. దానికి ఉదాహరణ ఈ సంఘటన. తన శరీర రంగు గురించి వస్తున్న కామెంట్లపై.. సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ భావోద్వేగ పోస్టు పెట్టారు. ఒక సీఎస్‌గా పనిచేస్తున్నప్పటికీ.. నల్లగా ఉన్నావంటూ వర్ణ వివక్షకు గురి అవుతున్నానని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త రంగుతో తనను పోల్చి కొందరు నెటిజన్లు చేసిన పోస్టులు చూసి.. ఆమె స్పందించారు. ఇంతకీ ఆమె ఎవరు. ఈ రంగు వివాదం ఏంటో తెలుసుకుందాం.

కేరళకు చెందిన శారదా మురళీధరన్ పుట్టుకతో కొంత నల్లగా ఉండేది. ఆమెను చూసి చాలామంది హేళన చేసేవారు. తన శరీర రంగును చూసి నలుగురూ నవ్వడంతో నాలుగేండ్ల వయసులో తల్లికి చెప్పుకొని తీవ్ర వేదనకు గురయ్యింది. కూతురిని బుజ్జగించి ఏదో సర్దిచెప్పింది. అయితే పెరిగిన తర్వాత కూడా ఆ చిన్నారికి అవే ఛీత్కారాలు, అవమానాలు, హేళనలు. కష్టపడి చదివి.. ఐఏఎస్ పాస్ అయి ఉద్యోగం సాధించారు. మరో ఐఏఎస్‌ను పెండ్లి చేసుకున్నారు.

ఎన్నో ఉన్నత పదవులు

1990 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి శారదా మురళీధరన్.. ఆరేండ్ల పాటు కేరళ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన 'కుటుంబ శ్రీ'కి నేతృత్వం వహించారు. ఆ తర్వాత జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు. అలాగే త్రివేండ్రం జిల్లా కలెక్టర్‌గా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కమిషన్‌గా.. ఇలా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారు. గత ఏడాది కేరళ చీఫ్ సెక్రటరీ బాధ్యతలు చేపట్టారు. అయితే ఈమె కంటే ముందు అదే స్థానంలో ఆమె భర్త డాక్టర్ వేణు పని చేసి రిటైర్ అయ్యారు. మొదట భర్త.. ఆ వెంటనే ఆ స్థానంలో శారదా మురళీధరన్ నియమితులు కావడం విశేషం.

నలుపు పేరుతో...

గతంలో ఎన్నో ఉన్నత పదువులు చేపట్టి ఇప్పుడు సీఎస్‌గా ఉన్నప్పటికీ నలుపు పేరుతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమెకు వెక్కిరింపులు ఎదురవుతూనే ఉన్నాయి. తర్వాత కొందరు ఆకతాయిలు ఆమె శరీర రంగు గురించి కామెంట్లు చేశారు. భర్త నుంచి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రంగుతో పోల్చుతూ 'ఆ పదవికి మీరేం సరిపోతారు?' అంటూ పోస్టులు పెట్టారు. అయితే ఆమె వీటికి స్పందిస్తూ తాను నల్లగా ఉన్నాను అనే విషయాన్ని తాను అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. మొదట తాను చేసిన పోస్ట్‌కు వచ్చిన కామెంట్లతో కంగారు పడి.. ఆ పోస్ట్ డిలీట్ చేశారు. అయితే ఇలాంటి అంశాలు తప్పనిసరిగా చర్చించాలని.. తన ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు చెప్పడంతో మళ్లీ తిరిగి తన మనసులో ఉన్నది మొత్తం ఆమె షేర్ చేశారు.

నాలుగేండ్ల వయసులోనే...

ఇదే సమయంలో చిన్నతనంలో తాను ఎదుర్కొన్న ఒక అనుభవాన్ని కూడా ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ శరీర రంగు వల్ల చిన్నతనంలోనే ఆమె పెద్ద మాటలు పడాల్సి వచ్చింది. తాను నల్లగా ఉన్నానని.. తన తల్లి వద్దకు వెళ్లి.. తనను గర్భంలోకి తీసుకెళ్లి తెల్లగా, అందంగా తీసుకురాగలవా అని నాలుగేండ్ల వయసులోనే అడిగినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే ఆ శరీర రంగు ప్రభావం తనపై 50 ఏండ్ల పాటు కొనసాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకానొక సందర్భంలో అందరి లాగే ఆమె కూడా నల్ల రంగుకు విలువ లేదనే భావనలో తెల్లటి రంగు పట్ల ఆకర్షితురాలయ్యారు. దానివల్ల తనను తాను తక్కువ చేసుకున్నారు. కానీ నలుపు అంటే అద్భుతమని, అందంగా ఉందని ఆమె పిల్లలే ఆమెకు తెలియజేశారు. దాంతో 'నలుపు విశ్వం యొక్క సర్వవ్యాప్త సత్యం అయినప్పుడు ఆ రంగును ఎందుకు కించపరుస్తారు' అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు ఇది సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారిసింది. జరగాల్సిన చర్చ జరుగుతోందని చాలా మంది శారదకు సపోర్ట్‌గా కామెంట్లు పెడుతున్నారు. ■



విశ్వావసు ఉగాది

ఈ ఉగాది
విశ్వంభరాన్ని ధరియించి విశ్వావసుగా వచ్చింది.
విశ్వైక ప్రేమతో తరియించి విశ్వమంతా నిలిచింది.
పాతదనంలో కొత్తదనం ఇంధనంలా మెరిసి
అందమైన మామిడి రెమ్మల మాటున బంధంలా
పూత మురిసి
చెరుకు గడ హరివిల్లుగా
మారి ద్వార
తోరణమయ్యింది
పంచాంగ శ్రవణముల
జాడ సాంప్రదాయాల
తీరమయ్యింది
వేపపూల పరిమళాలతో
పులకరించింది
నవ వసంతం
ఋతువుల క్రతువులతో
పలుకరించింది పండుగ
అనునిత్యం
జీవనమాదుర్యపు అనుభూతుల తీపి
మట్టి పాత్రలో నిండిన పచ్చడి రుచి చూపి
దివ్య ఆమనుల ఉగాది వేళ
భవ్య ఆనందాల అనుభవాల హేల
నాలుగు కాలాలు సౌహార్దానికి చెలిమిగా
రంగుల ముంగిళ్ళు
సౌభాగ్యానికి కలిమిగా
అలౌకిక పరిష్వంగంలో నిత్యానందమై,
ఆంతరంగిక భావాల సంరంభంలో
పరవశపు దొందమై,
మనో వాకిళ్ళ, తలపు తలుపులను తడుముతుంది,
కొత్తదనపు ఊట మరో అధ్యాయపు
పూహలను తరుముతుంది
ప్రతి చోటా ఈ ఉగాది విశ్వావసుగా
ఆకారం ధరించింది
ఉషస్సు నిండిన జగతిని
శతమానం భవతిగా దీవించింది



- డా.సముద్రాల శ్రీదేవి,
9949837743

ప్రజలకు గవర్నర్, సీఎం

ఉగాది శుభాకాంక్షలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం నుంచి శ్రీ విశ్వావసునామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలనీ, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని ఇరువురు ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివద్ధి సాధించి, సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ప్రతిఒక్కరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ యాప్ ప్రారంభించిన మూడు వారాల వ్యవధిలోనే మూడు వందల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేశారు. స్వీయ బహిష్కరణ వేటు పడిన అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది. ప్రతి రోజూ ఈ చర్యలు కొనసాగుతాయి. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. వారి వీసాలను రద్దు చేస్తాం' అని స్పష్టం చేశారు. 'ఎవరు రావాలో, ఎవరు రాకూడదో నిర్ణయించే అధికారం ప్రతి దేశానికీ ఉంటుంది' అని అన్నారు. కాగా సోషల్ మీడియా పోస్టుల పరిశీలన ఆధారంగా అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు పడుతోంది. అకడమిక్ స్టడీ వీసా (ఎఫ్), ఒకేషనల్ స్టడీ వీసా (ఎం), ఎక్స్ఛేంజ్ వీసా (జె)....ఇలా ఏ వీసా కోసమైనా కొత్తగాదర ఖాస్తు చేసే వారి సోషల్ మీడియా పోస్టులను కూడా జల్లెడ పడతారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇస్తున్నట్లు తేలితే అమెరికాలో చదువుకోకుండా దరఖాస్తుదారులను నిషేధిస్తారు. ఓ తాజా నివేదిక ప్రకారం అమెరికాలో 11 లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. వీరిలో 3.31 లక్షల మంది భారతీయ విద్యార్థులే.

ఈ మెయిల్‌లో ఏముంది?

'అమెరికా విదేశాంగ శాఖ తరపున బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా కార్యాలయం తెలియజేస్తున్న విషయమేమంటే మీకు వీసా జారీ చేసిన తర్వాత కొంత అదనపు సమాచారం లభించింది. దాని ఆధారంగా అమెరికా ఇమ్మిగ్రేషన్-నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 221 (ఐ) ప్రకారం మీ ఎఫ్-1 వీసాను రద్దు చేస్తున్నాము. ఈ విషయాన్ని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి తెలియజేశాము. వారు మీ వీసా రద్దు సమాచారాన్ని మీరు విద్యాభ్యాసం చేస్తున్న సంస్థకు తెలియజేస్తారు. చట్టబద్ధమైన ఇమ్మిగ్రేషన్ హోదా లేకుండా అమెరికాలో నివసిస్తే జరిమానా, నిర్బంధం, తిప్పిపంపడం వంటి చర్యలు చేపట్టవచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసా పొందడానికి మీరు అనర్హులు కూడా కావచ్చు. స్వీయ బహిష్కరణ వేటు పడిన వారు అమెరికాలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదని గమనించండి. మిమ్ములను మీ స్వదేశానికి కాకుండా ఇతర దేశాలకు పంపవచ్చు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వీసా రద్దయిన వారు సీబీపీ హోమ్ యాప్‌ను ఉపయోగించి అమెరికాను వదిలి వెళ్లేందుకు తమ సుముఖత తెలియజేయవచ్చు. అమెరికాను వదలబోయే ముందు మీ పాస్‌పోర్టును వ్యక్తిగతంగా అమెరికా రాయబార కార్యాలయంలో కానీ, వీసా జారీ చేసిన కాన్సులేట్‌లో కానీ విధిగా సమర్పించాలి. వారు దానిని భౌతికంగా రద్దు చేస్తారు. వీసా రద్దయినందున దానిని ఉపయోగించేందుకు ప్రయత్నించకూడదు. భవిష్యత్తులో అమెరికా రావాలని అనుకుంటే మరో వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. మీరు వీసాకు అర్హులా కాదా అనే విషయాన్ని ఆ సమయంలో నిర్ధారిస్తారు' అని అంతర్జాతీయ విద్యార్థులకు పంపిన ఈ మెయిల్స్‌లో వివరించారు.

స్క్రీన్‌షాట్లను భద్రపరచండి

ఈ నెల 25వ తేదీ నుండే విద్యార్థులకు ఈ మెయిల్స్ పంపుతున్నారని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు తెలిపారు. ఇప్పటికే అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి సోషల్ మీడియా ఖాతాలను కూడా పరిశీలించాలని రుబియో అంతరంగిక ఆదేశాలు జారీ చేశారు. అమెరికా వీసాలు పొందడం జన్మహక్కుగా భావించకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారు దేశం విడిచి వెళ్లిపోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. 'సోషల్ మీడియా పోస్టులను క్షుణ్ణంగా పరిశీలించండి. అవమానకరమైన సమాచారం కన్పిస్తే వాటి స్క్రీన్‌షాట్లు తీసి భద్రపరచాలి. దరఖాస్తుదారులు తమ పోస్టులను తొలగించేందుకు, మార్చేసేందుకు ప్రయత్నించే అవకాశం ఉన్నందున వాటిని జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉంటుంది' అని ఆయన తన ఆదేశాలలో కాన్సులర్ అధికారులకు సూచించారు.

రెండ్రోజులు ఇదేమాదిరిగా ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. దానికితోడు ఉక్కపోత కూడా తీవ్రమైంది. ఫ్యాన్లు, కూలర్లు తిరుగుతున్నా వేడిగాలికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఆది, సోమవారాల్లో పరిస్థితి ఇలాగే ఉండే అవకాశముంది. అయితే, ఆ తర్వాత క్రమంగరెండు నుంచి మూడు డిగ్రీల మేర గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. రాష్ట్రంలో శనివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 40 డిగ్రీలకుపైగా గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయినట్టు తెలిపారు. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఏప్రిల్ రెండో తేదీన పలు జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల(గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లవేగం)తో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈదురుగాలుల వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, మెదక్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికను విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాబోయే 48 గంటల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది. అదే సమయంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి పేలిన తూటా

(మొదటిపేజీ తరువాయి)

దానిని సాధిస్తాయని ఆయన తెలిపారు.

దట్టమైన అటవీ ప్రాంతంలో కొందరు మావోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం అందడంతో భద్రతా దళాలు శుక్రవారం రాత్రే అక్కడికి బయలు దేరాయనీ, శనివారం ఉదయం కాల్పులు మొదలయ్యాయని ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ఓ అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా దళాలు అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగిస్తున్నాయి. మరి కొందరు మావోయిస్టులు కూడా ఆ ప్రాంతంలో దాక్కొని ఉండవచ్చునని అనుమానిస్తున్నాయి. మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న బస్తర్ డివిజన్‌లోనే సుక్మా జిల్లా ఉంది. ఇటీవలి కాలంలో అక్కడ భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పుల ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఈ జోన్‌ను అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా అధికారులు గుర్తించారు.

నక్సలిజంను నిర్మూలిస్తామని అమిత్ షా పదే పదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం గమనార్హం. వారం రోజుల క్రితం ఆయన పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. గత పది సంవత్సరాల కాలంలో మావోయిస్టుల హింస 53 శాతం తగ్గిందని అమిత్ షా తెలిపారు.

అందాల పోటీల పేరిట వ్యాపారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అందాలపోటీల పేరిటి వ్యాపారం, మార్కెటింగ్ చేసుకోవడానికి కార్పొరేట్లకు ఆడ మాంసమే దొరికిందా? అని ప్రొఫెసర్ జూపాక సుభద్ర ప్రశ్నించారు. మేకప్‌లు, రంగులు రుద్దుకుని తళుక్కున మెరిసేది అందం కాదనీ, శ్రమైక జీవనంలోనే అసలైన సౌందర్యం ఉందని నొక్కిచెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేకప్‌లు, రంగులు పూసుకుని షో చేసే 120 దేశాల అందెగత్తెలతో 10 నిమిషాల పాటు ఉపాధి పనులు చేయిస్తే.. తట్టెడు మన్ను ఎత్తించి కొంత దూరం నడిపిస్తే వారి అందమేంటో బయటపడుతుందన్నారు. అందాల పోటీల పేరిట పెండ్లికాకుండా 21 ఏండ్ల లోపు ఉన్న యువతులను నాలుగేండ్ల పాటు ఫారం కోళ్ల లెక్క పెంచి అంగాంగాలను ప్రదర్శించడం పోటీలెలా అవుతాయని ప్రశ్నించారు. తెలంగాణది మట్టిమనుషుల కల్చర్ అనీ, పోరాటాల గడ్డ అని చెప్పారు. ఫ్యూడల్ వ్యవస్థకు, దేశ్‌ముఖ్‌లు, రజాకార్లు, నిజాంరాజుకు వ్యతిరేకంగా ఒడిసెలు, గన్నులు పట్టి ఆనాడు పోరాడిన పాలకుర్తి ఐలమ్మ సాలమ్మ, కమలమ్మ స్వరాజ్యం లాంటి ఎందరో మహిళలను ఈ సందర్భంగా గుర్తుచేశారు ఆయా దేశాల్లో వనరులను కొల్లగొట్టేందుకు, వినిమయ సంస్కృతిని ప్రోత్సహించేందుకు కార్పొరేట్లు అందాల పోటీలను ఇలాంటి గడ్డ మీద నిర్వహించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్, పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉండి కూడా ఈ అందాల పోటీలు నిర్వహించడమేంటని నిలదీశారు. అంగట్లో మహిళను నిలబెట్టడం కిచెన్ టూ కింగ్ మేకర్ ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. ఆ అందాల పోటీలను నిర్వహించకుండా ఉపాధి కూలీలకు, ఆశాలకు, అంగన్‌వాడీలకు కనీస వేతనాలను పెంచి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అందం ఆత్మగౌరవానికి ప్రతీక కాదని స్పష్టం చేశారు. మహిళలను వినిమయ వస్తువుగా చూస్తున్న పితృస్వామిక వ్యవస్థను తప్పుబట్టారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు సంధ్య మాట్లాడుతూ.. ఆ అందాల పోటీలను నిర్వహించకుండా ఉపాధి కూలీలకు, ఆశాలకు, అంగన్‌వాడీలకు కనీస వేతనాలను పెంచి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అంగాంగ ప్రదర్శనలు చేసే అందాల పోటీలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఎలా అవుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావును ప్రశ్నించారు. కొలతలను బట్టి ఒక మహిళ అందాన్ని నిర్ధారించడమేంటి? అసలు మహిళ దేహాన్ని కొలతలు వేసే అధికారం వారికెక్కడిది అని నిలదీశారు. మేకప్ కిట్లు, మెరిసేందుకు వాడే క్రీమ్‌లలో పాదరసం ఉంటుందనీ, అది క్యాన్సర్ కారకమని చెప్పారు. స్త్రీని వినిమయ వస్తువుగా చూడటం ఆత్మగౌరవం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అందాల పోటీల్లో గెలిచే యువతి స్పాన్సర్లు చెప్పినట్టు నడుచుకోవాలన్నారు. ఇలా చేయడమంటే ఆ మహిళ హక్కులను హరించడమే అవుతుందని నొక్కి చెప్పారు. స్త్రీహక్కులను హరించడానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. అందాల పోటీలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్త్రీపురుష సమానత్వం కోసం విధివిధానాలు రూపొందించాలని సూచించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, అనసూయ (పీఓడబ్ల్యూ), ఆశాలత(ఐద్వా) జ్యోతి(ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ), స్వరూప(పీఓడబ్ల్యూ), శాంత (బీఎస్పీ), జయ (చైతన్య మహిళా సంఘం), అరుణ(ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం), హేమలత(ఏఐఎమ్ఎస్ఎస్), గిరిజ(మహిళా రచయితల వేదిక), జ్యోతి(కుల నిర్మూలన సంఘం), సత్య, జ్యోతి, కోట రమేశ్(డీవైఎఫ్ఐ), ప్రదీప్(పీడీఎస్‌యూ-ప్రోగ్రెసివ్ యూత్ లీగ్), మహేశ్ (పీడీఎస్‌యూ), రాము (విరసం), జాన్ (ప్రజా కళామండలి), తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకే లింక్ రోడ్లు

విస్తరణతోపాటు కొత్తవి నిర్మించాలి : హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో సీఎం రేవంత్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై హెచ్ఐసీసీసీలో సీఎం రేవంత్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణ ం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో విశాల ప్రజా ప్రయోజనాలను దష్టిలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దష్టిలో పెట్టుకో వాలన్నారు. ఆయా రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి సమయం కలిసి వచ్చేలా ఉండాలని అభిప్రాయ పడ్డారు. ఇందులో భాగంగా అదనపు భూసేకరణకు కొంత అధికంగా ఖర్చయి నా వెనుకాడొద్దని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిశోర్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

పదేండ్లు నేనే ఉంటా..

నవతెలంగాణ-కొడంగల్

'నాకు రాష్ట్రాన్ని పాలించే శక్తినిచ్చిందే కొడంగల్ ప్రజలు. నేను మీకు ఏం చేస్తానో.. ఏం చేయనో.. నా గురించి మీ కంటే ఎక్కువగా ఎవరికీ తెలియదు.. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి.. మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదు.. చిట్టీ రాసిస్తే.. నేను కొడంగల్‌కు వచ్చి అన్నీ పూర్తి చేయిస్తా..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పదేండ్లు ముఖ్యమంత్రి కుర్చీ కొడంగల్‌కే ఉంటుందన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో సీఎం పర్యటించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, నారాయణపేట్ కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ నారాయణరెడ్డి సీఎంకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి శ్రీమహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సీఎం చేరుకున్నారు. ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో బాజాభజంత్రీలతో సీఎంకు స్వాగతం పలికారు. 45వ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా స్వామివారికి రేవంత్‌రెడ్డి శేష వస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి, వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం కొడంగల్‌లోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజలు తనకు గొప్ప అవకాశం ఇచ్చారని, రాష్ట్రాన్ని పరిపాలించే శక్తినిచ్చారన్నారు. కొందరికి వాళ్ల కుర్చీ పోయిందని దు:ఖం ఉండొచ్చు.. వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అసెంబ్లీకి వస్తే వినాల్సి వస్తుందని, వింటే పడాల్సి వస్తుందని కేసీఆర్ రావడం లేదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తాను ఏం చేశానో.. చేస్తానో ఇక్కడి ప్రజలకు తెలుసునని అన్నారు. వక్ఫ్ బిల్లు అంశాన్ని అక్బరుద్దీన్ కంటే మొదటగా లేవనెత్తింది తానేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి 25 శాతం మంజూరు చేశామన్నారు ఒక్క సంతకంతో కొడంగల్‌కు ఏం కావాలన్నా చేసుకోవచ్చని.. ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని అన్నారు. చిన్న చిట్టీ రాసిస్తే.. అన్ని పనులూ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, ఈఓ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో..

కొడంగల్‌లోని తన నివాసంలో జరిగిన 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్' జిల్లా సన్నాహక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో మాట్లాడారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీని చంపిన వారిని ప్రోత్సహించేలా అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ప్రజలు కనిపించని దేవుడిగా అంబేద్కర్‌ను కొలుస్తున్నారన్నారు. అలాంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ప్రతీచోట సమావేశాలు నిర్వహించి అంబేద్కర్ స్ఫూర్తిని చాటుతున్నామన్నారు. పదేండ్లలో కొడంగల్‌ను గొప్పగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఇక్కడ కొంతమందిని రెచ్చగొట్టి చిచ్చుపెట్టి భూసేకరణను అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన వారికి ఇక్కడ ఏర్పాటు చేసే కంపెనీల్లో ఇంటికి రెండు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తనదన్నారు. కొడంగల్ భూముల విలువ ఎకరానికి కోటికిపైగా కావాలంటే ఇక్కడ అభివృద్ధి జరగాలన్నారు.






ఉమ్మడి వరంగల్ జిల్లా పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు.






























































Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886